అనుదినం... జనస్వరం

Dwaraka

నవతెలంగాణ

మంగళవారం 23-1-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 25 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద



అధికార పార్టీ నాయకులు,
పోలీసుల బెదిరింపులు..
ఆంక్షలు..అడ్డగింతలు..నిర్బంధాలు..
పోలీసు పహారాల మధ్య టీమాస్ చేపట్టిన చలో కలెక్టరేట్ల ముట్టడి విజయవంతమైంది. కడుపు మండి పోరుబాట పట్టిన తమను పాలకుల నిర్బంధాలు ఏమీ చేయలేవంటూ ఊరూరా కదిలి తెలంగాణ ప్రజానీకం తన పోరాట పటిమను చాటింది. బంగారు తెలంగాణ ఏమోగానీ...మాకు బతుకు తెలంగాణ కావాలంటూ గొంతెత్తి నినదించింది. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు...
ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమి పంపిణీ...రైతులకు ఒకేసారి పూర్తిస్థాయిలో రుణమాఫీ...రిజర్వేషన్ల పెంపు...కొలువుల భర్తీ...ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు..
కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వటం...
తదితర 18 హామీలను వెంటనే నెరవేర్చాలని టీమాస్ డిమాండ్ చేసింది.

జనగోస

పహారా మధ్య టీమాస్ ముట్టడులు

- అడుగడుగునా పోలీసుల అడ్డగింత
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- పలుచోట్ల తోపులాటలు...అరెస్టులు
- ప్రజాసమస్యలపై కలెక్టర్లకు వినతులు
- టీమాస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం

నవతెలంగాణ-యంత్రాంగం/సిటీబ్యూరో

'200 మందితోనే సభ పెట్టుకోవాలి. ర్యాలీకి అనుమతి లేదు' అంటూ ఖమ్మంలో ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను అరెస్టు చేశారు. సూర్యాపేటలో లాఠీచార్జి చేశారు. టీమాస్ నాయకులు శ్రీకాంత్ వర్మ కడుపులో పిడిగుద్దులు గుద్దారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద పోలీసుల తీరును నిరసిస్తూ జాతీయ రహదారిపై టీమాస్ నాయకులు ధర్నాకు దిగారు. అదే దారిలో వెళ్తున్న స్పీకర్ మధుసూదనాచారి ఘెరావ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. వరంగల్‌లో కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరిన వారిని పోలీసులు కాళోజి సెంటర్లోనే అడ్డుకున్నారు. దీంతో ప్రజలు అక్కడే ఆందోళనకు దిగారు. నాగర్‌కర్నూల్‌లో ర్యాలీకి అనుమతి ...9లో

సంపన్నుల వద్దే సంపద

ఒక్క శాతం ధనికుల వద్దే 73% సొమ్ము



- 2017లో రూ.20.9 లక్షల కోట్లకు చేరిక
- సంస్కరణల ఫలాలు సంపన్నులకేనా..!
- పేదవారు మరింత పేదరికంలోకి జారడమా..
- బిలియనీర్లు పెరగటం ఆర్థిక వ్యవస్థ వైఫల్యమా! : సంచలన సర్వే నివేదిక విడుదల చేసిన 'ఆక్స్‌ఫామ్'
- దావోస్‌లో మోడీ ప్రసంగానికి కొన్ని గంటల ముందు విడుదల
- బహిర్గతమైన కేంద్రం ఆర్థిక విధానాల్లోని తప్పిదాలు

వివరాలు 2లో

పాక్ కంటే భారత్‌కు అధ్వాన్న ర్యాంకింగ్ 10



రికవరీ ఏజెంట్ల కిరాతకం..

- తన ట్రాక్టర్ కిందే దళిత రైతును చిదిమేశారు
- ఉత్తరప్రదేశ్‌లో దారుణం



వివరాలు 2లో

గొంతెత్తిన మహిళా లోకం

లండన్‌లో వేధింపులు, లింగ వివక్షకు వ్యతిరేకంగా నిరసనలు

లండన్ : సమాన హక్కులు కోసం, పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు, లింగ వివక్షకు వ్యతిరేకంగా ఆదివారంనాడు లండన్‌లో భారీ ర్యాలీ జరిగింది. భీకరమైన చలి, అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి కల్పిస్తున్న మంచు...ఉన్నప్పటికీ ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో మహిళలు, పురుషులు పాల్గొన్నారు. 'టైమ్స్ అప్', 'ప్రతీకారం కోరటం లేదు. న్యాయం కోసం డిమాండ్ చేస్తున్నాం'అనే ప్లకార్డులను ప్రదర్శించారు. వ్యాపార, వినోద (ముఖ్యంగా హాలీవుడ్) రంగాల్లో, పని ప్రదేశాల్లో మహిళలకు ఎదురవుతున్న వేధింపులకు వ్యతిరేకంగా 'వుమెన్స్ మార్చ్ లండన్' తాజాగా ఈ ర్యాలీ నిర్వహించింది. 'వీన్‌స్టన్ సెక్స్' కుంభకోణంపై 'హ్యాష్‌ట్యాగ్ మీటూ మూవ్‌మెంట్' ఉద్యమాన్ని ...9లో



విశ్వసనీయం కాదు

- సేవలకు ఆధార్ ప్రాతిపదిక కారాదు : అమెరికన్ ప్రజావేగు స్నోడెన్

2



సినిమాలకు సెలవు

- ఇక రాజకీయాల్లోనే
- బీజేపీ ఆహ్వానాన్ని తిరస్కరించా..!
- జనసేనకు, చిరంజీవికి ఎలాంటి సంబంధమూ లేదు
- సమస్యల అధ్యయనానికే రాజకీయయాత్ర
- 27 నుంచి అనంతపూర్ నుంచి ప్రారంభం : జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్



9

రూ.50 వేల కోట్లివ్వండి..

ప్రభుత్వం ముందు సాగునీటి పారుదలశాఖ ప్రతిపాదన

- రూ.30 వేల కోట్లు తగ్గించండి : ఆర్థికశాఖ సూచన
- చివరకు రూ.25 వేల కోట్లు ఇచ్చే అవకాశం
- గత బడ్జెట్‌లో డిసెంబరు నాటికి రూ.15 వేల కోట్లు కూడా ఖర్చు కాని వైనం

వివరాలు 9లో



ప్రధాని సంతకం చేశారు..

'నియోజకవర్గాల పునర్విభజన'పై..

- టచ్‌లో చాలామంది నేతలు : ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని మోడీ సంతకం చేశారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారరెడ్డి తెలిపారు. ఈ మేరకు తనకు ఢిల్లీ నుంచి సమాచారం అందిందని ఆయన వెల్లడించారు. అయితే ఈ అంశం బీజేపీ రాష్ట్ర నేతలకు తెలియదన్నారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. పునర్విభజన ...9లో





ప్రజలు ఉచితాలే కాదు.. జీఎస్టీ బాదుడు లాంటివి కూడా కోరుకోవడం లేదు..!!

అంతా మా ఇష్టం..దిక్కున్న చోట చెప్పుకో..

- బక్క రైతు భూమిని కబ్జా చేసిన నల్లు ఇంద్రసేనారెడ్డి
- రైతును పిస్తోల్‌తో బెదిరించిన గన్‌మెన్లు
- రాత్రికిరాత్రే భూమిని దున్నించిన వైనం



నవతెలంగాణ - హయత్‌నగర్

అతనో బక్క చిక్కిన రైతు..రేయింబవళ్లు కష్టపడితే తప్పా కుటుంబం పూట గడవని పరిస్థితి. వారి దీనస్థితిని చూసిన అప్పటి ప్రభుత్వం అతనికి ఎకరం భూమి ఇచ్చింది. దీనిపక్కన రెండెకరాల భూమి కొన్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి కన్ను దానిపై పడింది. ఆ రైతు భూమిని రాత్రికిరాత్రే ఆక్రమించి నాగండ్లతో దున్నించాడు. ఫెన్సింగ్ వేయించే పనిలో ఉన్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేటలో సోమవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతుల వివరాల ప్రకారం... తారామతిపేటలో 1991లో ఆంధ్రప్రదేశ్ హయాంలో సర్వేనెంబర్ 83లో సీలింగ్ భూమి ఉన్నది. దీన్ని ముగ్గురు రైతులకు పంచారు. అందులో మూల భిక్షపతి అనే రైతుకు ఎకరం భూమి ఇచ్చారు. భిక్షపతి దాన్ని సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజుల కింద దానిపక్కన ఇంద్రసేనారెడ్డి రెండెకరాల భూమి కొన్నాడు. దానిలో గెస్ట్‌హౌజ్ నిర్మించాడు. యధావిధిగా భిక్షపతి నారు వేసేందుకు తన భూమిని దున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం అర్ధరాత్రి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో అక్కడికొచ్చి జేసీబీని తెచ్చి రోడ్డును ...9లో

హింసను నిలువరించేందుకు భారత్‌-పాక్‌ మధ్య

నిర్మాణాత్మక చర్చలు జరగాలి

సీపీఐ(ఎం) నేత తరిగామి



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో హింసను నిలువరించేందుకు భారత్, పాక్ నాయకత్వం మధ్య తక్షణమే నిర్మాణాత్మక, ప్రయోజనకరమైన చర్చలు ప్రారంభించాలని సీపీఐ(ఎం) నేత ఎంవై తరిగామి అన్నారు. యుద్ధాలు, దాడులు, కాల్పులు, హింసల వల్ల ఏ ఒక్క దేశం ప్రయోజనం పొందలేదని గత ఏడు దశాబ్దాల చరిత్రే సాక్ష్యమని చెప్పారు. గత మూడు రోజులుగా అంతర్జాతీయ సరిహద్దు వెంబడి, వాస్తవాధీనరేఖ వెంట పాకిస్తాన్ జరుపుతున్న దాడుల్లో ఐదుగురు భద్రతా సిబ్బంది సహా 11 మంది చనిపోగా, 50 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. సరిహద్దు ఉద్రిక్తతలను నివారించేందుకు భారత్‌-పాక్ నాయకత్వం కృషి చేయాలని తరిగామి విజ్ఞప్తి చేశారు. హింసాత్మక చర్యల వినాశనం నుంచి తప్పించుకునేందుకు రెండు దేశాల సరిహద్దుల నుంచి వేలాది మంది ప్రజలు తమ ఇండ్లను, వదిలేసి పారిపోతున్నారని సీపీఐ(ఎం)నేత అన్నారు. ఈ భయానక పరిస్థితుల నుంచి ప్రజలను కాపాడేందుకు తక్షణమే ఇరు దేశాల నాయకులు చర్చలు ప్రారంభించాలని తరిగామి పిలుపునిచ్చారు.

ఫాక్‌లాండ్‌ ద్వీపం చేరిన 'నారీ యాత్ర'

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని చుట్టి రావడమే లక్ష్యంగా.. భారత నావికాదళానికి చెందిన ఆరుగురు మహిళలతో చేపట్టిన 'ఐఎన్ఎస్‌వీ తరిణి' సముద్ర యాత్ర బ్రిటన్‌కు చెందిన పోర్ట్ స్టేన్లీ లోని ఫాక్‌లాండ్ దీవులకు చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడి గవర్నర్, స్థానికులు నావికాదళానికి ఘన స్వాగతం పలికారని నావికాదళ ప్రతినిధి ఒకరు ట్వీట్ ద్వారా తెలిపారు. వచ్చే నెల 4 నుంచి ఈ నౌక అక్కడినుంచి బయల్దేరనుందని ఆయన పేర్కొన్నారు. 'నావిక సాగర్ పరిక్రమ' పేరుతో ఈ నౌక పసిఫిక్ సముద్రంలో 41 రోజుల పాటు ప్రయాణించింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకున్నా యాత్ర సాగుతున్నదని భారత నావికాదళం ఓ ప్రకటనలో తెలిపింది. గతేడాది సెప్టెంబర్ 10న ప్రారంభమైన ఈ యాత్ర ఏప్రిల్‌లో గోవాకు చేరడంతో ముగుస్తుంది.

'మోడీ ఆలింగనాలు ప్రముఖులకే...'

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మోడీ ఆలింగనాలపై రాహుల్ గాంధీ విమర్శనాస్త్రాలు గుప్పించారు. మోడీ కేవలం ప్రముఖ వ్యక్తులకే హగ్గులిస్తారని, రైతులు, కార్మికులు, జవాన్లకు ఆ అవకాశాన్ని ఇవ్వరని విమర్శించారు. 'నేను సాధారణ వ్యక్తిని, నాకు ప్రోటోకాల్ ఏమీ ఉండదు, ఈ వ్యక్తిత్వమే నన్ను అందరికీ దగ్గరయ్యేలా చేసింది' అన్న మోడీ వ్యాఖ్యలకు స్పందిస్తూ... ట్విట్టర్ వేదికగా రాహుల్ పై విమర్శలు చేశారు. ఇటీవల ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను మోడీ ఆలింగనం చేసుకున్నప్పుడు సోషల్ మీడియాలో కాంగ్రెస్ ఒక వీడియో విడుదల చేసిన విషయం విదితమే.

రైల్వేల్లో పెద్ద ఎత్తున సీసీటీవీల ఏర్పాటు

- 11 వేల రైళ్లు, 8500 రైల్వే స్టేషన్లల్లో

అమర్చేందుకు రైల్వే శాఖ కసరత్తు

న్యూఢిల్లీ: ప్రయాణికుల భద్రత కోసం రైల్వే శాఖ పలు రైళ్లు, వివిధ రైల్వేస్టేషన్లలో పెద్ద సంఖ్యలో సీసీటీవీలను ఏర్పాటుచేసేందుకు కసరత్తు ప్రారంభించింది. దీనికి సంబంధించి రాబోయే రైల్వే బడ్జెట్లో అధిక నిధులు కేటాయించే దిశగా రైల్వే శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దేశ వ్యాప్తంగా పలు రైళ్లు, రైల్వే స్టేషన్లలో 12 లక్షల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనుంది. 2018-19 రైల్వే బడ్జెట్‌లో వీటికోసం దాదాపు 3 వేల కోట్ల రూపాయలు వెచ్చించనున్నట్టు తెలుస్తున్నది. ఈ బడ్జెట్‌తో ప్రీమియర్, సబర్బన్ రైళ్లతో కలిపి 11 వేల రైళ్లు, 8,500 స్టేషన్లలో సీసీటీవీ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఈ వ్యవస్థ సుమారు 395 స్టేషన్లు, 50 రైళ్లలో అందుబాటులో ఉంది. రైల్వేల ప్రణాళిక ప్రకారం ప్రతి కోచ్‌లో (ఎంట్రీ గేట్, కీలకమైన ప్రాంతాలు)8 సీసీటీవీ కెమెరాలను అమర్చనున్నారు. గతేడాది రైలు ప్రమాదాల(రైళ్లు పట్టాలు తప్పడం)సంఖ్య పెరిగిన కారణంగా ఈ ఏడాది రైల్వే బడ్జెట్లో భద్రత, ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

లీటర్ పెట్రోల్ @ 80

2014 తర్వాత తొలిసారి

ముంబయి : పెట్రోల్, డీజిల్ ధరల హెచ్చుతగ్గుల నిర్ణయంతో వాటి ధరల్లో చోటు చేసుకుంటున్న మార్పులు సాధారణ ప్రజల గుండెల్లో మంటలు రేపుతున్నాయి. ముంబయిలో పెట్రోల్ ధరలు చూస్తే ఇది నిజమేననిపించకమానదు. సోమవారం ఇక్కడ లీటరు పెట్రోల్ ధర రూ. 80, డీజిల్ ధర రూ. 67కు చేరింది. 2014 ఆగస్టు తర్వాత ఈ స్థాయిలో పెట్రో ధరలు పెరగడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినా దేశంలో పెట్రో ధరలు మాత్రం పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ముంబయితో పాటు దేశంలోని మిగతా నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ. 72.23 ఉండగా, డీజిల్ రూ. 63.01, చెన్నైలోనూ వీటి ధరలు వరుసగా రూ. 74.91 కాగా, రూ. 66.44కు చేరాయి.

పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తెస్తాం : ధర్మేంద్ర ప్రదాన్

పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చే అవకాశముందని పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ త్వరలోనే దీనికి ఆమోదం తెలుపుతుందని, దీనితో ధరలు తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

డ్యాముల పరిరక్షణపై తొలి అంతర్జాతీయ సదస్సు

- తిరువనంతపురంలో నేడు ప్రారంభం

న్యూఢిల్లీ: డ్యాముల పరిరక్షణకు సంబంధించి తొలి అంతర్జాతీయ సదస్సు తిరువనంతపురంలో మంగళవారం ప్రారంభం కానున్నది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సులో భారీ డ్యాముల పరిరక్షణ సంబంధిత అంశాలను చర్చించనున్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించనున్న ఈ సదస్సుకు కేంద్ర నీటి వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రాంపాల్ మేఘావాల్ అధ్యక్షత వహించనున్నారు. అమెరికా, స్విట్జర్లాండ్, స్పెయిన్, ఆస్ట్రేలియా తదితర 20 దేశాలనుంచి సుమారు 550మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నట్టు కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. సుమారు 30 జాతీయ, అంతర్జాతీయ సంస్థలు డ్యాముల భద్రతపై సమకాలీన సాంకేతికత, పరికరాలు, వారి సూచనలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్టు కేంద్ర వాటర్ కమిషన్ డైరెక్టర్ (డ్యాం భద్రత) ప్రమోద్ నారాయణ తెలిపారు.

రక్షణ రంగంలోకి రోబోలు

ఇండియా-జపాన్ మధ్య సంయుక్త సహకారం

న్యూఢిల్లీ : కృత్రిమ మేథ(రోబోటిక్స్)ను భారత రక్షణ రంగంలో ప్రవేశపెట్టడానికి కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి ఇండియా, జపాన్ సంయుక్తంగా ఓ ప్రాజెక్టు చేపట్టబోతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. దేశ ప్రధాని షింజో అబేకు అత్యంత సన్నిహితుడు, జపాన్ విదేశాంగ మంత్రి కెంటారో సోనౌరా మీడియాతో మాట్లాడుతూ..."ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడనున్నాయి. ముఖ్యంగా మానవ రహిత వాహనాల తయారీ, రక్షణ రంగంలో రోబోటిక్స్ వంటివాటిని సంయుక్తంగా చేపడుతున్నాం. ఇరు దేశాల వాణిజ్య ఒప్పందాలపై ఈనెలాఖరుకల్లా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకానున్నది. న్యూక్లియర్ కంపెనీల మధ్య సహకారంపై ఈ టాస్క్‌ఫోర్స్ దృష్టిసారించనున్నది" అని తెలియజేశారు. ముందు ముందు ఇండో-పసిఫిక్ వ్యూహాత్మక సంబంధాల్ని బలపర్చటడానికి ఇదెంతగానో దోహదం చేస్తుందని ఆయన తెలియజేశారు. జపాన్ విదేశాంగ మంత్రి కెంటారో సోనౌరా ఈమధ్యే పాకిస్తాన్, మాల్దీవులు, శ్రీలంక దేశాల పర్యటన జరిపారు. అలాగే బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలతో సత్సంబంధాల కోసం జపాన్ ప్రయత్నాలు చేస్తున్నది.

ఆధార్ విశ్వసనీయం కాదు...

అమెరికన్ ప్రజావేగు స్నోడెన్

న్యూఢిల్లీ : పౌరులకు సేవలు అందించే ప్రతీ సందర్భంలో ఆధార్ కోసం డిమాండ్ చేయడాన్ని అమెరికన్ ప్రజావేగు ఎడ్వర్డ్ స్నోడెన్ తప్పుపట్టారు. ఆధార్ డేటా సురక్షితం కాదని మరోసారి ఆరోపించారు. దేశంలోని బ్యాంకులు, టెలికామ్ సంస్థలు, ఇతర రవాణా సంస్థలు ఆధార్ సమాచారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన ట్విట్టర్‌లో గుర్తుచేశారు. ఇలాంటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నెల రోజుల వ్యవధిలో ఈ విధంగా ఆధార్ డేటాపై స్నోడెన్ వ్యాఖ్యానించడం ఇది మూడో సారి. తాజాగా రీసెర్చ్ అండ్ అనలిసిస్ వింగ్ మాజీ అధిపతి కే.సీ.వర్మ వ్యాసంపై స్పందిస్తూ సాధారణంగా ఇంటెలిజెన్స్ అధికారులు సాధారణంగా ఈ విధంగా ఒక ప్రభుత్వ విధానంలోని లోపాల గురించి మాట్లాడారని, మామూలుగా అయితే తాను కూడా వాటిని గురించి మాట్లాడడం జరగదని అన్నారు. వర్మ తన వ్యాసంలో ఆధార్ వివరాలను బ్యాంకులు, టెలికామ్ సంస్థలు, కొన్ని రవాణా సంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు. అర్హత కల వారిని గుర్తించేందుకు ఆధార్‌ను ఉపయోగించడం సరైన సేవలందించే విధానం కాదని అన్నారు. కొద్దికాలం క్రితం ఆధార్ రూపకల్పన చేసిన యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ (యూఐడీఏఐ) స్వయంగా ట్వీట్ చేసిన వ్యాఖ్యను ప్రస్తావించి. ఆధార్ అనేది కేవలం వ్యక్తి గుర్తింపు కోసం మాత్రమే, ఆ పేరుతో వ్యక్తుల బ్యాంకు ఖాతాల గురించి కానీ, వారికి ఉన్న షేర్లు, మ్యూచువల్ ఫండ్ల వివరాలు కానీ, ఆస్తుల వివరాలు కానీ, ఆరోగ్య సంబంధ వివరాలు కాని, మతం, కులం, విద్యార్హతల సమాచారాన్ని భద్రపరచటం లేదని స్పష్టం చేసిన విషయాన్ని కూడా స్నోడెన్ గుర్తుచేశారు. అంతేకాక, భారతీయులు ఎవరిని అడిగినా, ఎన్ని సార్లు ఆధార్ వివరాలను సమర్పించవలసి వచ్చిందో చెప్పగలుగుతారని స్నోడెన్ ఆరోపించారు.



సంపన్నుల వద్దే సంపద

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా మొదలైన ప్రపంచ ఆర్థిక సదస్సులో తమ సంస్కరణల గొప్పతనాన్ని చాటుకొనేందుకు సన్నద్ధమైన ప్రధాని మోడీకి ఆదిలోనే చుక్కెదురైంది. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల్లోని డొల్లతనాన్ని బయటపెడుతూ ఆక్స్‌ఫాన్ ఇండియా సంస్థ సోమవారం సంచలన సర్వే నివేదికను విడుదల చేసింది. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ సమ్మిట్ ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందు ఆక్స్‌ఫామ్ సంస్థ 'రివార్డ్ వర్క్, నాట్ వెల్త్' పేరుతో నిర్వహించిన సర్వే నివేదికను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం మోడీ సర్కారు కార్యక్రమాలు దేశంలోని అత్యధికులుగా ఉన్న సామాన్యులకు కాకుండా సంపన్నులకే మేలు చేస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఫలితంగా భారత్‌లో ఆర్థిక అసమానతలు అంతకంతకు పెరుగుతూ పోతున్నట్టుగా ఆ సంస్థ వెల్లడించింది. సర్వే ప్రకారం.. భారత్‌లోని ఒక్క శాతం ధనికుల సంపద 2017లో రూ.20.9లక్షల కోట్లు పెరిగింది. అంటే ఇది దాదాపుగా ఓ ఏడాది కేంద్ర బడ్జెట్‌తో సమానం. ఒక్క శాతం మంది వద్ద దేశంలోని దాదాపు 73శాతం సంపద పోగవటం ఆందోళన కలిగిస్తోందని నివేదక పేర్కొంది. ఇదే సమయంలో దాదాపు 67కోట్ల మంది భారతీయుల సంపద కేవలం ఒక్క శాతమే మాత్రమే పెరగటాన్ని సర్వే గుర్తించింది. 2017లో భారత్‌లో లక్షాధికారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొంది. 2010 నుంచి భారత్‌లో బిలియనీర్ల సంపద ఏడాదికి సగటున 13శాతం పెరిగిందని విశ్లేషించింది. సాధారణ ఉద్యోగి సందపతో పోలిస్తే ఇది ఆరు రెట్లు ఎక్కువ. దేశ ఆర్థిక విధానాలు ఒక్కశాతమున్న ధనికుల కోసం కాదని 'ఆక్స్‌ఫామ్' 2017 తాజా నివేదిక హెచ్చరించింది. దేశంలో ఆర్థిక అసమానతలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని పేర్కొంది.

370 కోట్ల మంది జీవితాల్లో వెలుగే లేదు..

ప్రపంచవ్యాప్తంగా కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని ఆక్స్‌ఫాన్ వెల్లడించింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన మొత్తం సంపదలో 82శాతం ధనివంతులైన కేవలం ఒక్క శాతం మంది వద్దకు చేరిందని సర్వే తెలిపింది. కాగా సుమారు 3.7 వందల కోట్ల మంది ప్రజల సంపాదనలో ఏమాత్రం వృద్ధి లేదని తేలింది. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సులో ఆక్స్‌ఫామ్ సర్వేను నిశితంగా పరిశీలించనున్నారు. ప్రపంచాధినేతలు తమ చర్చల్లో ఆర్థిక, లింగ అసమానతల గురించి ప్రధానంగా మాట్లాడనున్నారు. ఆక్స్‌ఫామ్ క్రితం సర్వే ప్రకారం, భారత్‌లో ఒక్క శాతం ధనికుల వద్ద దేశంలోని సంపదలో 58శాతం కేంద్రీకృతమైందని, ప్రపంచవ్యాప్తంగా సంపదలోని 50శాతం సంపద కొందరి వద్దే పోగుపడినట్టు తేలింది. ఇలా ధనికులు మరింత ధనవంతులవుతుండగా.. పేదవాళ్లు మరింత పేదవాళ్లుగా మారుతున్నారని నివేదిక పేర్కొంది.

ఆ పెద్దాయన ఏడాది జీతానికి చిరుద్యోగికి 941 సంవత్సరాలు..

భారత్‌లోని 2017 నాటికి ఒక్క శాతమున్న ధనికుల సంపద రూ.20.9లక్షల కోట్లకు చేరుకోవడాన్ని తీవ్రంగా పరగణించిన ఆక్స్‌ఫాన్ నివేదిక ఇందుకు పలు ఉదాహరణలను పేర్కొంది. భారత్‌లో ఓ ప్రముఖ కంపెనీలో అధిక వేతనం తీసుకునే సీఈఓ ఏడాది సంపాదన మొత్తం గ్రామీణ ప్రాంతంలో కనీస వేతనం తీసుకునే ఓచిన్న ఉద్యోగి సంపాదించడానికి దాదాపు 941 ఏండ్లు పడుతుందని సర్వే తెలిపింది. ఇదే అమెరికాలో అయితే ఓ ప్రముఖ కంపెనీ సీఈఓ ఒక్క రోజు తీసుకునే వేతనం, సాధారణ ఉద్యోగి ఏడాది సంపాదనకు సమానమని పేర్కొంది.

బిలియనీర్ల సంఖ్య పెరిగితే చాలా ?

2017లో బిలియనీర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 17 మంది కొత్తగా బిలియనీర్లుగా అవతరించారు. దీంతో అపరకుబేరుల సంపద 101 నుంచి వీరి సంఖ్య 118కు చేరుకుంది. దేశంలోని ధనికుల సంపద మొత్తంగా రూ.4.89 లక్షల కోట్లు పెరిగింది. ఇది...దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యా, ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 85 శాతం. ఉపాధి, కార్మిక రంగాల్ని భారత్ నమ్ముకుంటే ఎన్నో ఉద్యోగాలు కొత్తగా ఏర్పడతాయని సర్వే సూచించింది. వ్యవసాయం రంగంలో పెట్టుబడులు పెంచటం, సామాజిక, సంక్షేమ పథకాల్ని పక్కాగా అమలయ్యేట్టు చూడటం ద్వారానే ఆర్థిక అంతరాల్ని రూపుమాపుమాపేందుకు వీలు పడుతుందని సర్వేలో తెలియజేసింది. ముందుగా బడుగు బలహీన వర్గాలకు, మధ్య తరగతికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వాలు పని చేయాలని సర్వే జనులు అభిప్రాయపడ్డారు. మోడీ సర్కార్ అమలుజేస్తున్న ఆర్థిక విధానాల వల్ల దేశ సంపద మొత్తం జనాభాలో కేవలం ఒక్క శాతంగా ఉన్న కుబేరుల పాలవుతోందని తెలిపింది. దేశంలో బిలియనీర్ల సంఖ్య పెరిగితే సరిపోతుందా ? అది ఆర్థిక వ్యవస్థ వైఫల్యానికి సూచన. ఈవిషయంపై ప్రభుత్వాలు వెంటనే దృష్టి సారించాలని సర్వేలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారని ఆక్స్‌ఫామ్ పేర్కొంది.

తీవ్రమైన అంశం.. నిష్పక్షపాతంగా పరిశీలిస్తాం

జస్టిస్ లోయా మృతి కేసు విచారణను ప్రారంభించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: జస్టిస్ లోయా మృతికేసులో పలు తీవ్రమైన అంశాలున్నాయని, వాటిని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. జస్టిల్ లోయా అనుమానాస్పద మృతికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఆయన మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను తానే విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. బొంబే హైకోర్టులో దాఖలైన పిటిషన్లను కూడా తనకు పంపించాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఇకపై ఈ అంశంపై ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను స్వీకరించవద్దని హైకోర్టులను ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 2న జరుగుతుందని తెలిపింది. జస్టిస్ లోయా మరణంపై సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిందిగా కోరుతూ జనవరి 8న బాంబే న్యాయవాదుల సంఘం (బీఎల్‌ఏ) బాంబే హైకోర్టులో తొలుత వ్యాజ్యం దాఖలైన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ స్పందర్భంగా బీఎల్‌ఏ తరపు న్యాయవాది దుష్యంత్ దవే తొలుత



తన వాదనలను వినిపించారు. అమిత్‌షాను రక్షించేందుకే ప్రతిదీ జరిగిందంటూ వాదించారు. సమాచారా హక్కు చట్టం కింద తాను సేకరించిన డాక్యుమెంట్లలో జస్టిస్ లోయా మరణంపై అనేక అనుమానాస్పద అంశాలను గమనించవచ్చునని స్పష్టం చేశారు. సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సమయంలో జస్టిస్ లోయా 2014 డిసెంబరు 1న అనుమానాస్పద రీతిలో మరణించిన విషయం తెలిసిందే. లోయా మృతి తర్వాత నెల రోజులకే అమిత్‌షాను ఆ ఎన్‌కౌంటర్ కేసులో నిర్దోషిగా తేల్చడం గమనార్హం.

శానిటరీ నాప్‌కిన్స్‌పై జీఎస్టీ స్వయంగా విచారించనున్న సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : శానిటరీ నాప్‌కిన్స్‌పై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ, ముంబయి హై కోర్టులలో దాఖలైన పిటిషన్లపై జరుగుతున్న విచారణపై సుప్రీం కోర్టు సోమవారం స్టే విధించింది. శానిటరీ నాప్‌కిన్స్‌పై జీఎస్టీ విధించడానికి సంబంధించిన అన్ని కేసులపై తామే స్వయంగా విచారణ జరుపుతామని తెలిపింది. శానిటరీ నాప్‌కిన్స్‌పై ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ విధించారు. వీటిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ గతేడాది జేఎన్‌యూ పిహెచ్‌డీ విద్యార్థి జర్మినా ఇస్రార్ ఖాన్ ఢిల్లీ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాప్‌కిన్స్‌పై పన్ను విధించడం అక్రమం, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కాటుక, కుంకుమ, బొట్టు బిళ్ళలు, సింధూరం, అల్తా, ప్లాస్టిక్, అద్దాల గాజులు, వినికిడి పరికరాలు, పాసింజర్ బ్యాగ్‌లు, అన్ని రకాల పూజా సామాగ్రి, అన్ని రకాల గర్భనిరోధక సాధనాలను పన్ను శ్లాబు నుండి ప్రభుత్వం మినహాయించింది. కాని మహిళల ఆరోగ్యానికి సంబంధించిన శానిటరీ నాప్‌కిన్స్‌పై అనుచితంగా పన్ను విధించిందని జర్మినా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ఢిల్లీ హై కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. శానిటరీ నాప్‌కిన్స్‌పై జీఎస్టీ విధించడానికి ముందు మహిళా, శిశు అభివృద్ధి శాఖను సంప్రదించారా? అని ప్రశ్నించింది. అదే సమయంలో జీఎస్టీ మండలిలో ఒక్క మహిళా సభ్యురాలు కూడా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. గత ఏడాది జులైలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమలులోకి తెచ్చింది. అత్యవసరాలు అని భావించిన కొన్ని వస్తువులపై జీఎస్టీని మినహాయించింది. జీఎస్టీ శ్లాబ్‌ల నుండి శానిటరీ న్యాప్‌కిన్స్‌ను మినహాయించక పోవడంపై ప్రభుత్వాన్ని తప్పుపట్టింది.

కేరళ గవర్నర్ అనుచిత వైఖరి

ప్రభుత్వ విధాన ప్రకటనలో 'కోతలు'

- కేంద్రంపై విమర్శల భాగాన్ని పక్కన పెట్టిన సదాశివం



తిరువనంతపురం : కేరళలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రూపొందించిన విధాన ప్రకటన పత్రాన్ని పూర్తిగా చదవకుండా, బీజేపీని విమర్శించే అంశాలను ప్రక్కనబెట్టి గవర్నర్ సదాశివం అనుచితంగా వ్యవహరించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాల విధాన ప్రకటనకు సంబంధించిన పాఠాన్ని గవర్నర్లు యథాతథంగా చదవడం సాంప్రదాయంగా వుంది. అయితే ఆ సాంప్రదాయాన్ని ఉల్లంఘించి తనకు 'నచ్చని' అంశాలను వదిలివేస్తూ అసెంబ్లీలో గవర్నర్ సోమవారం ప్రసంగించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. తొలుత ప్రభుత్వ విధాన ప్రకటనకు సంబంధించి రూపొందించిన ప్రసంగ పాఠాన్ని శాసన సభ్యులకు, మీడియాకు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పక్కనపెట్టి సహకార సమాఖ్య సాంప్రదాయాలను కాలరాస్తూ, స్థానిక సంస్థలతోనూ, జిల్లా అధికారులతోనూ కేంద్ర ప్రభుత్వం నేరుగా సంప్రదిస్తున్న వైఖరిని విమర్శిస్తూ చేసిన ప్రస్తావనలను గవర్నర్ తన ప్రసంగంలో చదవకుండా పూర్తిగా విడిచిపెట్టారు. అలాగే కేరళలో అల్లర్లను ప్రేరేపిస్తున్న కొన్ని మత సంస్థల కుట్రలను గురించిన ప్రస్తావనలను కూడా ఆయన తన ప్రసంగంలో పూర్తిగా వదిలిపెట్టారు. 'శాంతి భద్రతల నిర్వహణలో దేశంలోనే అగ్రస్థానంలో వున్న రాష్ట్రంగా కేరళ మరోసారి గుర్తింపు పొందింది. ప్రజలకు నాణ్యమైన జీవనాన్ని అందిస్తున్న రాష్ట్రాలలో దేశంలోనే మొదటి ర్యాంకింగ్‌లో ఉంది. కొన్ని మత సంస్థలు కుట్ర పన్నితే జరిగినవే తప్ప రాష్ట్రంలో మత ఘర్షణలకు సంబంధించిన దృష్టాంతాలు ఏవీ లేవు' అని ప్రసంగ పాఠంలో ఉంది. గవర్నర్ సదాశివం ఇలా కొన్ని అంశాలను వదిలిపెడుతూ చేసిన ప్రసంగంపై ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించగా దీనిపై వ్యాఖ్యానించేందుకు సిద్ధంగా లేమని చెప్పారు. రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితికి సంబంధించి కొన్ని మత సంస్థలు ఏడాది కాలంగా సామాజిక, సాంప్రదాయ మీడియాల్లో ప్రచారం జరుపుతున్న విషయాన్ని సదాశివం ప్రస్తావించారు. 'శాంతి భద్రతల నిర్వహణలో దేశంలోనే ఉత్తమమైన రాష్ట్రంగా గుర్తింపు తెచ్చుకున్న రాష్ట్రంలో అస్పష్టమైన కారణాలతో కొన్ని మత సంస్థలు అల్లర్లకు పాల్పడుతున్నాయంటూ దేశ వ్యాప్తంగా నెల రోజులపాటు ప్రచారం జరిగింది' అని అన్నారు. ఈ ప్రచారంపై రాష్ట్ర ప్రజలు హ్యాష్ ట్యాగ్‌లతో ప్రతిస్పందించారని ఆయన చెప్పారు. కేరళలోని లౌకిక సాంప్రదాయాలపై ఏడాది కాలంగా అపోహలతో దాడులు జరిగాయని, సామాజిక రంగ విజయాలపైకి ఆ అపోహలను తోసేశారని, సమాజంలోని వివిధ వర్గాల నుంచి శాంతి భద్రతల పరిస్థితి విమర్శలను ఎదుర్కొంటుందని గవర్నర్ అన్నారు..

విడుదలకు ముందు చూస్తాం

పద్మావత్‌పై కర్ణిసేన



న్యూఢిల్లీ : 'పద్మావత్'పై వివాదం రేపుతున్న కర్ణిసేన ఆ సినిమాను విడుదలకు ముందు చూసేందుకు ఆమోదం తెలిపింది. పద్మావత్‌పై రగడ రేపుతున్న కర్ణిసేనకు ముందుగా ఆ సినిమా చూడాల్సిందిగా బన్సాలీ ఆఫర్‌కు ఇచ్చారు. బన్సాలీ చిత్రం పద్మావత్ విడుదలను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించ బోని చెప్పిన కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కల్వీ.. తమ ఇతర సభ్యులతో ముందుగా ఆ సినిమాను చూసేందుకు అంగీకరిస్తున్నట్టు చెప్పారు. 'ముందుగా ఆ సినిమాను చూడాలని కోరుతూ బన్సాలీ నుంచి మాకు లేఖ అందింది. మేము దానికి అంగీకరించబోమని ఆయన భావించి వుండొచ్చు. కానీ, ఆయన ఆఫర్‌ను మేము స్వీకరిస్తున్నాం. విడుదలకు ముందు ఆ సినిమాను చూసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని కల్వీ అన్నారు. 'ఎవరు చూడాలన్నది మేమే నిర్ణయిస్తాం. చూసేందుకు సెన్సార్ బోర్డు ఆరుగురికి అనుమతించింది. కొద్దిమంది జర్నలిస్టులతో కలసి ఆ సినిమాను చూసే ఆ ఆరుగురిని మేం నిర్ణయిస్తాం' అని కల్వీ చెప్పారు.

నిలిపివేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్

ఒకవైపు కర్ణిసేన సినిమాకు వ్యతిరేకంగా ఆందోళనలు జరుపుతుండగా.. మరోవైపు నిరసనల నడుమ ఆ సినిమాను తమ రాష్ట్రాల్లో విడుదల చేయలేమంటూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. 'పద్మావత్' సినిమా విడుదలను నిలిపివేయాలంటూ రెండు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశాయి. కాగా, ఈ పిటిషన్ అత్యున్నత న్యాయస్థానంలో మంగళవారం విచారణకు రానున్నట్టు తెలుస్తోంది.

'భావన' బాధితులకు పరిహారం ఇవ్వండి

సీఐటీయూ డిమాండ్

న్యూఢిల్లీ : దేశరాజధానిలోని భావన పారిశ్రామిక ప్రాంతంలో ఒక ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంపై సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటున్నవారి పరిస్థితి తీవ్రంగా ఉందని, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ ప్రమాదంపై స్వతంత్ర విచారణ జరిపించాలనీ డిమాండ్ చేసింది. పరిశ్రమలో అగ్ని మాపక, భద్రతా చర్యలు తీసుకోనందునే ప్రమాదం జరిగిందని ఆరోపించింది. లేబర్ ఇన్‌స్పెక్టర్లతో సహా అధికారులెవ్వరూ కార్మికుల కోసం సరైన భద్రతా చర్యలు తీసుకోలేదని పేర్కొంది. బాధిత కార్మికులు కనీసం ఈఎస్ఐ పరిధిలో లేరని తెలిపింది.

ఇలాంటి సంఘటనలు ఆగ్రా, ఫరిదాబాద్, ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లోనూ జరిగాయని తెలిపింది. ఈ సంఘటనలకు భారత ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. పీరగారి వద్ద 11 మంది కార్మికులు మృతిచెందినప్పుడు పని ప్రదేశాల్లో భదత్ర చర్యల గురించి త్రిపార్టీ కమిటీ వేస్తామని ఢిల్లీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని సిఐటియు గుర్తు చేసింది. పని ప్రదేశంలో భదత్ర ఏర్పాట్లు అమలుపై కేంద్ర కార్మిక శాఖ కూడా హామీ ఇచ్చిందని తెలిపింది. అయినా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, కానీ ఇవి అమలు కావడం లేదని విమర్శించింది.

యూపీలో రికవరీ ఏజెంట్ల కిరాతకం

సీతాపూర్ (ఉత్తరప్రదేశ్) : రికవరీ ఏజెంట్ల వికృత చర్య ఓ దళిత అన్నదాతను బలితీసుకుంది. ఆ రైతును అతని ట్రాక్టర్ కిందే పడేశారు. ఆయన మీది నుంచి ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వెళ్ళారు. ఈ దారుణ ఘటనలో అన్నదాత హాహాకారాలు చేస్తూ... తుది శ్వాస విడిచాడు. కుటుంబ సభ్యుల రోదనతో ఆ ప్రాంతం హృదయవిదారకంగా మారింది. రుణాలను వసూలు చేసే ఏజెంట్ల కిరాతక ఘటన ఉత్తరప్రదేశ్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్‌లో శనివారం ఈ హదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఒక ప్రయివేటు కంపెనీ ఎల్ అండ్ టి ఫైనాన్స్ నుంచి భౌరీ గ్రామ వాసి జ్ఞాన్ చంద్ర (45) ట్రాక్టర్ కొనడానికి 2015లో రూ. 5 లక్షలు అప్పు తీసుకున్నాడు. 2017 డిసెంబరు నాటికి రూ. 4 లక్షల అప్పును వెనక్కి చెల్లించాడని పోలీసులు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని త్వరలో చెల్లిస్తానని జ్ఞాన్ చంద్ర ఆ ప్రయివేటు కంపెనీకి హామీ కూడా ఇచ్చాడనీ, మిగిలిన రుణానికి సంబంధించి ఈ నెల మొదటివారంలో రూ. 35 వేలను డిపాజిట్ కూడా చేసినట్టు బాధితుడి భార్య జ్ఞానవతి తెలిపారు. అయినప్పటికీ ఆ కంపెనీ వారం రోజుల క్రితం నోటీసు పంపింది. మిగిలిన రుణాన్ని వసూలు చేసేందుకు ఏజెంట్లు శనివారం ఉదయం ఆ రైతు ఇంటికి వెళ్ళారు. తాను రూ. 35 వేలు చెల్లించానని మిగిలిన మొత్తాన్ని 10 రోజుల్లో కట్టేస్తానని చెప్పాడు. కాగా, ఆ ఏజెంట్లు ట్రాక్టర్‌ను తీసుకెళ్ళేందుకు ప్రయత్నించారు. తాను రూ.35 వేలు చెల్లించానని జ్ఞాన్‌చంద్ చెప్పినప్పటికీ వారు వినలేదు. ఆయన వద్దనుంచి ట్రాక్టర్ తాళాలను లాక్కున్నారు. ట్రాక్టర్‌ను తీసుకెళ్ళకుండా అడ్డుకునేందుకు జ్ఞాన్‌చంద్ర ప్రయత్నించాడు. అయినా వారి మొండిపట్టు వీడలేదు. ఆ ట్రాక్టర్‌ను జ్ఞాన్ చంద్ర మీదుగా నడిపించుకుంటూ వెళ్ళిపోయారు. లోన్ రికవరీ ఏజెంట్లపై కేసు నమోదు చేశామనీ, వారి కోసం గాలిస్తున్నామని పోలీస్ సూపరింటెండెంట్ ఓం ప్రకాశ్ చెప్పారు.

ఆర్థిక, సామాజిక సమానత్వం కోసమే

టీమాస్ యుద్ధం



మాట్లాడుతున్న తమ్మినేని

బీఎల్‌ఎఫ్‌తో మారనున్న తెలంగాణ రూపురేఖలు: టీమాస్ బహిరంగ సభలో తమ్మినేని

నవతెలంగాణ-ఖమ్మంప్రతినిధి

ఆర్థిక, సామాజిక సమానత్వం కోసమే టీమాస్ యుద్ధమని టీమాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజా, సామాజిక సంఘాల ఐక్యవేదిక (టీ మాస్) ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం నగరంలోని పెవిలియన్ మైదానంలో టీమాస్ జిల్లా చైర్మెన్ డీ.జ్యలిత అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న హైదరాబాద్ వేదికగా ఏర్పాటు కానున్న బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌తో తెలంగాణ రూపురేఖలు మారనున్నాయని, ప్రతి పేదోడు రాష్ట్రంలో తలెత్తుకు జీవించేలా చేయాలన్నదే బీఎల్‌ఎఫ్ ప్రధాన కర్తవ్యమని అన్నారు. పాలకులను అడుక్కునే ఫ్రంట్ కాదని, అసమర్థ పాలనను గద్దె దించే ఫ్రంట్ అని నొక్కిచెప్పారు. ఖమ్మంలో ప్రజాస్వామ్యయుతంగా టీమాస్ సభ పెట్టుకుంటే కేవలం 200మందే రావాలని నిబంధనలు పెట్టడానికి ఎస్పీ ఎవరు? సీఎం కేసీఆర్ ఎవరు? అని ప్రశ్నించారు. నియంతృత్వ పాలన సాగించిన ఎందరో నియంతలు మట్టి కరిచారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు ఏ విధమైన ఇబ్బందులు అనుభవించారో ఇప్పుడు కూడా అవే పరిస్థితులను ఎదుర్కొంటున్నారని వాపోయారు. తెలంగాణ ఏర్పాటై నాలుగేండ్లవుతున్నా ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పూ రాలేదన్నారు. కేసీఆర్ పాలనలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఏడు వేల పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ఉన్నత విద్య చదివిన వారికి ఉద్యోగం, ఉపాధి లేదన్నారు. నిరుద్యోగులు అడ్డా కూలీలుగా మారుతున్నారన్నారు. ఉద్యోగం ఉన్న వారికేమో సరైన వేతనాల్లేవని అన్నారు. వైద్యాన్ని ప్రయివేటు ఆస్పత్రులకు దారాదత్తం చేసేందుకు టీఆర్ఎస్ సర్కారు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద నిధులున్నా పేదలకు వైద్యం, విద్య అందించలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. బీఎల్‌ఎఫ్ అధికారంలోకి వస్తే పేదలకు సముచిత స్థానం ఉంటుందని తమ్మినేని అన్నారు.

అందుకే ఈ నెల 25న బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటు కార్యక్రమానికి జిల్లా నుంచి వేలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, టీమాస్ నాయకులు కత్తి నెహ్రూ, బత్తుల హైమావతి, భద్రు నాయక్, లింగాల రవికుమార్, బీవీ రాఘవులు ప్రసంగించారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బత్తుల లెనిన్, యర్రా శ్రీకాంత్, బత్తుల హైమావతి, వై.విక్రమ్, వేదగిరి శ్రీనివాసరావు, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జేఏసి ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ పోరాట జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్టు కన్వీనర్‌గా ఎన్నికైన కోదాటి శ్యాంసుందర్, కో-కన్వీనర్ ఎం.శ్రీశైలం తెలిపారు. తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఏమిచ్చినా తక్కువేనని అభిప్రాయపడ్డారు. బేసిక్ పేతో కలపకుండా తెలంగాణ ఇంక్రిమెంటు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఉద్యోగులు ఎనలేని సేవలు చేస్తున్నారని వివరించారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో వేలాదిగా ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేస్తున్నా, ఆ స్థాయిలో పోస్టుల భర్తీ లేదన్నారు. ఉద్యోగ విరమణ వయస్సును 58 ఏండ్ల నుంచి 60 ఏండ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'ఎస్సీ వర్గీకరణ'ను పరిష్కరించాలి: సీపీఐ(ఎం)

- మందకృష్ణ మాదిగను పరామర్శించిన పార్టీ నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. వర్గీకరణ కోసం కొనసాగుతున్న ఉద్యమాన్ని ఆ పార్టీ బలపరిచింది. ఈ అంశంపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన కేసీఆర్ ప్రతిపక్షాలను కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకుపోవడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించింది. తద్వారా తన తీర్మానాలకు తానే వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేసింది. ఇది మాదిగలను మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదని విమర్శించింది. తక్షణం మందకృష్ణను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. వర్గీకరణపై ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేసింది. వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో చంచల్‌గూడ జైల్లో ఉన్న ఆయన్ను.. సోమవారం సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ, బి.భిక్షమయ్య కలిసి పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించడం ద్వారా తమ ప్రభుత్వ విధానాలను ఎవరూ ప్రశ్నించకుండా చేస్తోందని వారు ఈ సందర్భంగా విమర్శించారు. మందకృష్ణ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన, ధర్నా నిర్వహించటాన్ని కూడా కేసీఆర్ ప్రభుత్వం సహించటంలేదని తెలిపారు. ఆయనతోపాటు అరెస్టయిన నలుగురికి బెయిల్ మంజూరు చేసిన సర్కారు.. అతనికి మాత్రం బెయిల్ ఇవ్వకపోవటాన్ని ప్రభుత్వ కక్ష సాధింపు చర్యని విమర్శించారు.



మందకృష్ణను పరామర్శించిన భిక్షమయ్య, డీజీ, జాన్‌వెస్లీ

అభివృద్ధి పనులను

త్వరగా చేపట్టండి : మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని తీవ్రవాద ప్రాంతాల్లో అభివృద్ధి పనులను సత్వరమే చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివద్ధి, జాతీయ రహదారులు, కొత్త కలెక్టరేట్ల నిర్మాణంపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. 'తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివద్ధి' పథకంలో భాగంగా గతంలో కేంద్రం నుంచి మంజూరు అయిన రూ. 1,290 కోట్ల రహదారుల పనులను త్వరతగతిన చేపట్టేలా ఆదేశించారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఎన్‌హెచ్‌డిపి పథకం కింద రూ. 2,398.31 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఎన్‌హెచ్ -63 జాతీయ రహదారిని ఎన్‌హెచ్ఎఐ సంస్థకు బదలాయించాలని, కేంద్ర నిధులతో ఆధునీకరణకు ఆమోదించారు. ఆరంఘడ్ నుంచి శంషాబాద్ వరకు ఆరు లేన్ల అభివద్ధి కోసం రూ.290.00 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. హైదరాబాద్-నరసాపూర్-మెదక్ జాతీయ రహదారి అభివధికి రూ.400.00 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల ప్రస్తుత స్థితి, పనుల ఆలస్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. 26 జిల్లాల కలెక్టరేట్ల భవనాలు, 21 జిల్లాలలో అధికార నివాస గహల నిర్మాణంపై చర్చించారు.

కలెక్టరేట్ల భవన నిర్మాణ కాంట్రాక్టు అగ్రిమెంటు కూడా పూర్తి అయ్యిందని అధికారులు వెల్లడించారు. అయితే కొన్ని జిల్లాల్లో మాత్రమే భవన నిర్మాణాలకు భూ సేకరణ జరిగిందని తెలిపారు. భవన నిర్మాణ పనుల్లో ఆలస్యం జరగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు రవీందర్ రావు, గణపతిరెడ్డి, లింగయ్య, సతీష్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకోసం ఎమ్మెల్యేలతో ముఖాముఖి



- ఫిబ్రవరి నెలాఖరులో కార్యక్రమానికి
- ఐక్యఉద్యమం నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సీపీఎస్‌ను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఫిబ్రవరి చివరి వారంలో నియోజకవర్గ కేంద్రాల్లో శాసనసభ్యులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించాలనీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐక్య ఉద్యమం నిర్ణయించింది. తద్వారా సీపీఎస్‌తో కలిగే నష్టాలపై ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించి, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేయాలని భావిస్తుంది. సోమవారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎం రఘుశంకర్‌రెడ్డి (డీటీఎఫ్) అధ్యక్షతన ఐక్య ఉద్యమం సమావేశం జరిగింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్ల ఐక్య ఉద్యమం ఆధ్వర్యంలో ఫిబ్రవరి చివరివారంలో అన్ని మండల కేంద్రాలనుండి నియోజకవర్గ కేంద్రాలకు సీపీఎస్ వ్యతిరేక జాతాలు నిర్వహించాలని నిర్ణయించారు. జూలై 2018 నుంచి నూతన వేతనాలు అమలు జరిపే విధంగా పీఆర్సీని వెంటనే నియమించాలనీ, జూలై 2017 నుంచి బకాయిపడ్డ డీఏను విడుదల చేయాలనీ, అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలనీ ఐక్య ఉద్యమ సమావేశం తీర్మానించింది. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే కలిసొచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల సంఘాలను కలుపుకొని త్వరలోనే ఉద్యమ కార్యాచరణను ప్రకటించాలని ఐక్య ఉద్యమం నిర్ణయించింది. సమావేశంలో సీహెచ్ రాములు, సీహెచ్ రవి (టీఎస్‌యూటీఎఫ్), వి మనోహరరాజు(టీపీటీఎఫ్), టి లింగారెడ్డి(డీటీఎఫ్), షౌకత్‌అలీ (టీఎస్‌పీటీఏ), ఎంఎన్‌రెడ్డి(టీఏపీఆర్ఏ), లింగయ్య (టీసీపీఎస్ఈఏ), టీవీ ప్రసాద్, జి సురధీర్ (సీపీఎస్‌టీఈఏ), కొమ్ము రమేశ్, ఎస్ బాబు(బీటీఎఫ్), సుభాష్, రమేశ్‌రెడ్డి(పీఎస్‌హెచ్ఎంఏ), మహిపాల్‌రెడ్డి(ఎస్‌జీటీయూ), మోకినపల్లి శ్రీనివాస్, రఘునందన్, మసూద్ అమ్మద్(టీయూటీఏ), ఎస్ హేశ్(ఎంఎస్‌టీఎఫ్) పాల్గొన్నారు.

మనిషి మనసులో [illegible] లక్షణాలు అనేకం. వాటిలో విచక్షణకన్నా ఉపయోగకరమైంది మరొకటి లేదు. -ఎడిసన్

సంపాదకీయం

శాస్త్ర జగత్తుకే అవమానం...

"ఊరందరిదీ ఓ దారైతే.. ఉలిపి కట్టెది మరోదారి.." అన్నట్టు ప్రపంచమంతటిదీ ఒక దారైతే బీజేపీ నేతలది మరోదారి. అందుబాటులోకొచ్చిన శాస్త్ర సాంకేతికాభివృద్ధిని ఆధారం చేసుకుని ప్రపంచమంతా పురోగమనానికి బాటలు వేసుకుంటుంటే.. బీజేపీ నేతలు మాత్రం ఏ రుజువులూ లేని పురాణాలూ, విశ్వాసాల ఆధారంగా దేశాన్ని తిరోగమనంలోకి నడిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ వ్యాఖ్యలు ఇందుకు తాజా ఉదాహరణ. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన "జీవపరిణామ వాద" సిద్ధాంతాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ భూమి మీదికి వచ్చినప్పటి నుంచీ మనుషులు మనుషులుగానే ఉన్నారనీ, డార్విన్ చెప్పినట్టుగా కోతి నుండి మానవుడు ఉద్భవించాడనడం తప్పనీ అంటున్నారు. ఔరంగాబాద్‌లో జరిగిన ఆలిండియా వైదిక్ సమ్మేళన్‌లో ఆయనీ వ్యాఖ్యలు చేసారు. ఈ విషయాన్ని పూర్వీకులెవ్వరూ చెప్పలేదనీ, పురాణాల్లో సైతం ఎక్కడా ఈ ప్రస్తావన లేదని చెపుతూ, ఇక నుండి మన కళాశాలల్లో, పాఠశాలల్లో ఈ సిద్ధాంతాన్ని బోధించడం ఆపేయాలని కోరారు. సాక్షాత్తూ విద్యా వ్యవస్థకు సంబంధించిన మంత్రి వ్యాఖ్యలు భారతీయ వైజ్ఞానిక సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. అంతేకాదు, భవిష్యత్ భారత నిర్మాణాన్నే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

> **నిజానికి ఆయన తెలియక ఈ వ్యాఖ్యలు చేశారని అనుకోలేం. ఉద్దేశ్యపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేశారని ఎవరికైనా అర్థమవుతోంది. ఇదే ప్రమాదకరం... ఒక వైపు ఆధునిక సమాజ నిర్మాణం, సైన్సు, టెక్నాలజీ అని ఊదరగొడుతూనే ఇలా సైన్సుపై దాడి చేయడం వీరికే చెల్లుతోంది. ఇది దేనికి దారితీస్తుంది..? ఆధునిక సమాజానికా? ఆటవిక సమాజానికా?**

వైజ్ఞానిక ప్రపంచంలోనే ఓ అద్భుత ఆవిష్కరణ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం. మానవాళికి ఒక మాతృక నుండి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడ్డాయన్న సత్యాన్ని తెలిపాడు డార్విన్. వానరుని నుండి నరవానరుడు, నరవానరుడి నుండి నరుడూ ఉద్భవించిన తీరును తన పరిణామవాదంలో శాస్త్రీయంగా రుజువు చేసాడు. డార్విన్ సిద్ధాంతం ఆధునిక జీవశాస్త్రంలోనే కాదు సామాజిక శాస్త్రాల్లో కూడా అద్భుతమైన ఆవిష్కరణలకు ఆలంబనగా నిలిచింది. మూఢనమ్మకాలను విభేదించింది. జీవుల్ని ఏదో అతీతశక్తి ఏకకాలంలో సృష్టించలేదనీ, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని నిరూపించింది. ఇందుకోసం చార్లెస్ రాబర్ట్ డార్విన్ అవిశ్రాంత కృషి చేసాడు. అనేక ప్రాంతాల్లోని మొక్కలు, రాళ్ళు, శిలాజాలు, కీటకాలు, జంతువుల నమూనాలను సేకరించి, పరిశీలించి ఆ పరిశీలనల ఆధారంగానే మానవాళికి తన "జీవ పరిణామవాదం" సిద్ధాంతాన్ని అందించాడు. ఈ సిద్ధాంతం జీవశాస్త్రానికే ప్రామాణికంగా నిలిచింది. ఇది ఇప్పటి మైక్రో బయోలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయోలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది.



అనేక పరిశీలనల్లో రుజువైన ఈ సిద్ధాంతంపై ప్రపంచంలో ఎక్కడా శాస్త్రీయంగా ఎలాంటి విభేదాలూ లేవు. ఇటువంటి సిద్ధాంతంపై ఉన్నట్టుండి బీజేపీ నేత అశాస్త్రీయంగా విరుచుకుపడటం శాస్త్ర జగత్తుకే అవమానం. "జీవ జాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతితో సంఘర్షణ. ఈ సంఘర్షణల్లో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థక జీవులు. ఇవే మనుగడ సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిధ్యాలే కాలక్రమంలో కొత్తజాతుల ఉత్పన్నానికి మూలాధారాలవుతాయి." ఇదీ సంక్షిప్తంగా డార్విన్ పరిణామ వాదం. ప్రపంచమంతా ఈ వెలుగులో భవిష్యత్తు వైపునకు అడుగులు వేస్తున్నా... సృష్టి సిద్ధాంతవాదులు, మూఢులు మాత్రం ఈ వాదాన్ని అంగీకరించరు. ఇది అనాదిగా జరుగుతున్నదే.. ఆ కోవలోనివే సత్యపాల్‌సింగ్ వాదనలు. ఆధునిక ప్రపంచం సాధించిన శాస్త్రీయ విజ్ఞానాన్ని కాదని, మానవాళి ఆవిర్భావాన్ని పురాణాల్లో వెతికితే ఏం తెలుస్తుంది..? తద్వారా ఏ ప్రయోజనం సాధించాలనీ..!? ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారిని శాస్త్రీయ విజ్ఞానానికి, శాస్త్రీయ భావాలకు దూరంగా ఉంచాలనుకుంటున్నారా..? తిరిగి మధ్య యుగాల్లోకి నడిపించాలనుకుంటున్నారా..? అందుకే యావత్ శాస్త్రప్రపంచం సత్యపాల్‌సింగ్ వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండిస్తోంది. ఇది శాస్త్రీయ సమాజానికే అవమానం అని ఘోషిస్తోంది. మంత్రి వ్యాఖ్యలకు శాస్త్రీయ ప్రాతిపదిక ఏదీ లేదని మండిపడుతోంది. ప్రత్యేకించి దేశంలోని మూడు ప్రఖ్యాత సంస్థలైన "భారత జాతీయ శాస్త్ర అకాడమీ (ఢిల్లీ), భారతీయ శాస్త్రాల అకాడమీ (బెంగుళూరు), జాతీయ శాస్త్రాల అకాడమీ (అలహాబాద్) శాస్త్రవేత్తలు మంత్రి వ్యాఖ్యలు అశాస్త్రీయమనీ, పాఠ్యాంశాల్లోంచి ఈ సిద్ధాంతాన్ని తొలగించాలనుకోవడం తిరోగమన చర్య అని పేర్కొనడం గమనార్హం.

ఇంత జరుగుతున్నా మంత్రి సత్యపాల్‌సింగ్ మాత్రం తన వ్యాఖ్యల్ని సమర్థించుకోవడమే గాక పునరుద్ఘాటిస్తున్నారు. పైగా "నేను ఆధారాల్లేకుండా మాట్లాడటం లేదు. నేను కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పట్టా పొందిన వాడిని" అంటున్నారు. డార్విన్ "జీవపరిణామక్రమ" సిద్ధాంతం తప్పని ఆయనకు ఏ శాస్త్రం చెప్పిందో, ఏ యూనివర్సిటీ బోధించిందో కూడా ఆయన చెపితే బాగుండేది. నిజానికి ఆయన తెలియక ఈ వ్యాఖ్యలు చేశారని అనుకోలేం. ఉద్దేశ్యపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేశారని ఎవరికైనా అర్థమవుతోంది. ఇదే ప్రమాదకరం... ఒక వైపు ఆధునిక సమాజ నిర్మాణం, సైన్సు, టెక్నాలజీ అని ఊదరగొడుతూనే ఇలా సైన్సుపై దాడి చేయడం వీరికే చెల్లుతోంది. ఇది దేనికి దారితీస్తుంది..? ఆధునిక సమాజానికా? ఆటవిక సమాజానికా?

భద్రత కరువైన ఆధార్ వ్యవస్థ



ప్రభీర్ పుర్కాయిస్తా

లోపభూయిష్టమైన ఆధార్ వ్యవస్థ కారణంగా వ్యక్తిగత విషయాలను గోప్యం(ప్రయివసి)గా ఉంచుకునే హక్కు గురించి, రేషన్‌వంటి చట్టపరమైన ప్రయోజనాలు దెబ్బతింటాయనే విషయం గురించి ఆధార్‌ను విమర్శించేవాళ్ళు ఆందోళన చెందుతున్నారని చాలామంది అనుకుంటారు. యూనీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ)కి సంబంధించిన మొబైల్ యాప్‌లో వేరేవిధమైన భద్రత పూర్తిగా లోపించినదని రెండు విషయాలను ట్రిబ్యూన్, ఒక ఫ్రెంచ్ సెక్యూరిటీ పరిశోధకుడు విశదీకరించారు. గుర్తింపు(ఐడీ)లకు సంబంధించిన దొంగతనం గురించి వారు తెలియజేశారు. కాబట్టి దీనితో మన బ్యాంకు అకౌంట్లపై నేరస్తులు దాడిచేసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వారు మన ఆధార్‌ను వాళ్ళ సెల్‌ఫోన్లతో లింకు చేసుకుని నేరపూరిత చర్యలకు దిగే అవకాశం ఉంటుంది. మన ఆధార్ నెంబరుతో మన ఆర్థిక, ఇతర కార్యకలాపాలను లింకు చెయాలని వత్తిడిచేసే హక్కు ప్రభుత్వానికి ఉందా, లేదా అనేంత సామాన్యమైనది కాదు విషయం. అయితే అలా చేస్తున్న క్రమంలో మన ఆధార్ నెంబరును బ్యాంకు ఖాతా నంబర్లు, సెల్ నెంబర్లవంటి ఇతర నెంబర్లతో లింకు చేస్తున్నప్పుడు దాని పర్యవసానాల నుంచి ప్రభుత్వం మనల్ని కాపాడుతున్నదా.. అనేదే ప్రశ్న. లేక ప్రభుత్వం మనల్ని అనేక రకాల నేరపూరిత చర్యలకు లోనయ్యేలా చేస్తున్నదా? ఇలా భద్రత లేనందున మన డబ్బే కాకుండా మన వ్యక్తిగత భద్రత కూడా ప్రమాదంలో పడతాయి. మన ఇండ్ల తాళాలనన్నింటినీ ప్రభుత్వం నేరస్తుల చేతుల్లో పెడుతున్నట్టుగా ఇది ఉన్నది. మన బ్యాంకు అకౌంట్లకు చెందిన సమాచారాన్ని కూడా నేరస్తులకు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వ విధానం ఉన్నది.

> **ఎంతో ప్రజా ధన వ్యయంతో ఆధార్ వ్యవస్థ నిర్మితమైంది. ఇంత తెలిసిన తరువాత ఆధార్ ప్రాజెక్టు ప్రధానోద్దేశం నెరవేరుతుందని మనం భావించగలమా? ఆధార్ ప్రాజెక్టుతో ముందుకు సాగటమంటే ఇప్పటికే వ్యయం చేసిన ఎంతో డబ్బుకు అదనంగా మరింత డబ్బును ఖర్చు చేయవలసి ఉంటుంది. అయితే దీనితో మన పౌరులకు మరింతగా ప్రమాదాలను సృష్టించమా? అంతేకాకుండా మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రమాదంలో పడదా?**

కేవలం రూ.500 లంచం ఇచ్చి ట్రిబ్యూన్ పత్రిక రిపోర్టర్ 100కోట్లమంది వ్యక్తిగత సమాచారాన్ని 10నిముషాలలోనే సేకరించాడు. దీనిని యూఐడీఏఐ అభ్యంతర పెట్టలేదు. ప్రభుత్వ అధికారుల కథనం ప్రకారం పంజాబ్‌లో ఇద్దరికి మాత్రమే యావత్తు ఆధార్ డేటాబేస్ చూడటానికి అనుమతి ఉన్నది. యావత్తు దేశ ప్రజల వ్యక్తిగత సమాచారం కేవలం రూ.500కు 10నిముషాలలోనే దొరికిందంటే ఆధార్ భద్రత గురించి ఏమాత్రం జాగ్రత్త తీసుకోలేదని అర్థమౌతోంది. కేంద్ర కార్యాలయంలో ఉంచిన బయోమెట్రిక్ డేటా మాత్రమే భద్రంగా ఉందని యూఐడీఏఐ కూడా అంగీకరించింది. పత్రికా సమావేశంలో డేటాబేస్‌లోని ఈ విభాగం భద్రంగా ఉందని పదేపదే చెప్పటమంటే మిగిలిన సమాచారం భద్రంగా లేదని అర్థం. నిజానికి ఆధార్ సమాచారం ఆసాంతంగా ఏమాత్రం భద్రంగా లేదు.

ఆధార్ సమాచారం ఎంత అభద్రంగా ఉన్నదో రెండవసారి ఒక ఫ్రెంచ్ పరిశోధకుడు తెలియజేశాడు. మన స్మార్ట్‌ఫోన్లలో పనిచేయటానికి యూఐడీఏఐ విడుదల చేసిన మొబైల్ యాప్‌లోని భద్రత గురించి ఈయన పరిశోధించాడు. ఎమ్‌ఆధార్ పేరుతోగల ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనితో సర్వీసు ప్రొవైడర్లు ఆధార్ సంబంధిత సమాచారాన్ని ధృవీకరించవచ్చు. తనను తాను ఇలియట్ అల్‌డర్‌సన్ అని పరిచయం చేసుకున్న ఈ ఫ్రెంచ్ భద్రతా నిపుణుడు కోస్లా లాబ్స్ రూపొందించిన ఎమ్‌ఆధార్ యాప్‌లో భద్రత నామమాత్రంగానే ఉన్నదని తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా తెలియజేశాడు. దానిలో వాడిన సాఫ్ట్‌వేర్ కోడ్ ఇంటర్‌నెట్‌లో విస్తృతంగా దొరుకుతుంది. సెల్‌ఫోన్‌లో పాస్‌వర్డ్ నిలువచేస్తుంది. రాండమ్ నంబర్ జనరేటర్ అదే నంబర్‌ను ప్రతిసారీ జనరేట్ చేస్తుంది. అన్నింటికంటే దారుణమైన విషయం ఏమంటే ఖోస్లా ల్యాబ్స్‌కు యాజమాన్య సర్టిఫికేట్‌ను ఎలా జనరేట్ చేయాలో కూడా తెలియకపోవటం. ఆ యాప్ యజమాని గూగుల్ అని చూపెడుతున్నది. అల్‌డర్‌సన్ ప్రకారం ఖోస్లా ల్యాబ్స్‌కి తాను రూపొందించిన యాప్‌ను మెరుగుపర్చే సామర్థ్యం కొరవడినట్టు కనపడుతున్నది. అందుకే పాత యాప్ స్థానంలో ఆ సంస్థ కొత్త యాప్‌లను విడుదల చేస్తున్నది. ఒకవేళ మీ సెల్‌ఫోన్ దొంగిలించబడితే ఆధార్ ప్రమాదాన్ని సృష్టిస్తుంది. మీ సెల్‌ఫోన్ పోతే దానిని బ్లాక్‌చేసేసరికల్లా మీ బ్యాంకు అకౌంట్‌లోని డబ్బు తస్కరణకు గురయ్యే ప్రమాదముంది. దీనితో ఆధార్ కార్డుగల 100కోట్లమందికి ప్రమాదముంటుందని అర్థం కాదు. ఖోస్లా ల్యాబ్స్ సృష్టించిన ఆధార్ పర్యావరణ వ్యవస్థలో భద్రత చాలా బలహీనంగా ఉందని దీని అర్థం. ఎమ్‌ఆధార్ యాప్‌లోని భద్రత పాఠశాల స్థాయి ప్రమాణంలో ఉన్నది. దీనిని సామాన్య పరిజ్ఞానం ఉన్నవారు ఇంటర్‌నెట్ వనరుల ఆధారంగా ప్రాథమిక స్థాయిలో రూపొందించినట్టు కనపడుతున్నది.

ఖోస్లా ల్యాబ్స్‌ను ఆధార్ పర్యావరణ వ్యవస్థ భద్రత నుంచి మినహాయించాలనే ఆలోచన రాకముందే ఖోస్లా లాబ్స్ యోగ్యత గురించి తెలుసుకోవలసి ఉంటుంది. ఈ సంస్థను స్థాపించిన ముగ్గురు సహ వ్యవస్థాపకులు యుఐడీఏఐలో ముఖ్యమైన పదవులలో ఉన్నారు. ఈ ముగ్గురు వ్యవస్థాపకులలో ఒకరైన శ్రీకాంత్ నాథముని యూఐడీఏఐలో సాంకేతిక విభాగానికి అధిపతి.

ఇక్కడ మనం ప్రయోజనాల ఘర్షణ గురించి చర్చించటం లేదు. అంతేకాకుండా సుప్రీం కోర్టులో ఆధార్‌తో దేశానికి అనూహ్య లాభాలు ఉన్నాయని వాదించిన ఖోస్లా ల్యాబ్స్ గురించి కూడా చర్చించటం లేదు. మేము సాదాసీదాగా చెప్పేదేమంటే యూఐడీఏఐ సాంకేతిక విభాగం మాజీ అధినేత భాగస్వామ్యం గల సంస్థ ఎమ్‌ఆధార్ యాప్‌లో ఇటువంటి నాసిరకం సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిస్తే ఇక మిగిలిన ఆధార్ పర్యావరణ వ్యవస్థలో ఏ స్థాయి భద్రత ఉంటుంది?

ఆధార్ వ్యవస్థ ఆరంభంలో మన గుర్తింపు ఆధార్ నంబరుతో ముడిపడలేదు. మన గుర్తింపు మన చేతివేళ్ళ లేక కండ్ల బయోమెట్రిక్ సమాచారంలో ఉంటుందనేవారు. మన చేతివేళ్ళ, మన కండ్ల ఐరిస్ సమాచారాన్ని ధృవపర్చటంలో మన గుర్తింపు ఉండేది. బయోమెట్రిక్ సమాచారాన్ని ధృవీకరించటంలో అనేక సమస్యలున్నాయి. అసలు వ్యక్తులు కానివారిని ఉన్నట్టు, అయిన వారిని లేనట్టు చూపించే అవకాశం ఉండటంతో అసలైన ఆధార్‌గల వారిని ధృవీకరించటం వీలుపడదు. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, ఇతర బయోమెట్రిక్ పరికరాలను నడవటానికి కావలసిన కరెంటు మన గ్రామాలలో, పట్టణాలలో నిరంతరాయంగా సరఫరా కాకపోవటం ఈ సమస్యకు అదనం. అటువంటి సమస్యలు ఎదురవుతుండగా బయోమెట్రిక్ ధృవీకరణను అధికారులు పేదలకే పరిమితం చేశారు. ఉదాహరణకు రేషన్ కార్డులు ఉన్నవారికి మాత్రమే పరిమితం చేశారు. అనేక రకాల లావాదేవీలకు ఆధార్ 'కార్డు' గుర్తింపు ధృవీకరణకు ఉపయోగపడుతున్నది. ఇక్కడ సమస్య



ఏమంటే వ్యవస్థ యావత్తూ గుర్తింపు ధృవీకరణకు బయోమెట్రిక్ సమాచారం మీద ఆధారపడాలిగానీ కార్డుపై కాదు. ఆధార్ కార్డును ఎవరైనా ఎవరికోసమైనా డూప్లికేట్ చేసి ముద్రించవచ్చు. ఇటువంటి ఆధార్ కార్డును ధృవీకరణకు ఉపయోగించవలసివస్తే అది వ్యవస్థను తీవ్ర సంక్షోభానికి గురిచేస్తుంది. యూఐడీ నెంబరును మన గుర్తింపు ధృవీకరణ(ఐడీ ప్రూఫ్)గా వాడటం కోసం ఆధార్ వ్యవస్థను రూపొందించలేదు. అందుకే ఆధార్ పర్యావరణ వ్యవస్థలోని బయోమెట్రిక్ డేటాను మినహాయించి మరే ఇతర డేటాకు భద్రత అసలు లేనేలేదు.

మనం మన ఆధార్‌ను అనేక అకౌంట్లకు, ఫోన్ నంబర్లకు లింకు చేసినప్పుడు జరిగే ప్రమాదం గురించి మనం చర్చించనే లేదు. దుర్వినియోగం జరగకుండా, లోపలి వ్యక్తులు హాకింగ్ చేయకుండా ఉండటానికి మనకు ఎంత రక్షణ ఉన్నది? ఈ విషయం ఎయిర్‌టెల్ కేసులో తేటతెల్లమయింది. ఏ కంపెనీ అయినా ఆధార్‌ను ధృవీకరించటానికి మన ఫోన్ నెంబరు తీసుకుంటుంది. దానితోపాటు మన 'ఆమోదం' తీసుకోవటానికి ఒక 5000పదాలున్న డాక్యుమెంట్‌ను కంప్యూటర్‌లో చూపి 'నేను ఆమోదిస్తున్నాను' అనే బటన్‌పై క్లిక్ చేయమంటుంది. ఈవిధంగా ఎయిర్‌టెల్ కంపెనీ ప్రజల గ్యాస్ సబ్సిడీని ఎయిర్‌టెల్ బ్యాంకులో తెరిచిన వారివారి ఎకౌంట్లలోకి మళ్లించింది.

ప్రభుత్వం నిర్బంధంగా తయారుచేసిన ఆధార్ వ్యవస్థ భద్రతాపరమైన పీడకలగా మారింది. ఆధార్ వ్యవస్థలో విశ్వసనీయతను పెంచటానికి యూఐడీఏఐ చాలా శ్రమపడుతున్నది. ధృవీకరణ కోసం ఒక వర్చువల్ ఐడీ స్కీమ్‌తోపాటుగా ముఖ గుర్తింపును అది ప్రతిపాదిస్తున్నది. ఇక్కడ సమస్య ఏమంటే వర్చువల్ ఐడీ స్కీమ్‌లను ఉపయోగించటానికి ఇప్పటికే చాలా కాలాతీతం కావటం సమస్యగా ఉన్నది. డేటాబేస్‌లలో ఇప్పటికే నిక్షిప్తమైవున్న మన బ్యాంకు అకౌంట్ల సమాచారంతో సహా ఇతర సమాచారానికి ఏమాత్రం భద్రత లేదు. గుర్రం వెనుక రంధ్రం గుండా పారిపోయిన తరువాత దొడ్డికి తాళం వేసినట్టుగా ఇది ఉన్నది. ముఖ గుర్తింపు సమస్యకు పరిష్కారం కానేకాదు. శరీరం నల్లగావున్న మనుషులను గూగుల్ సాఫ్ట్‌వేర్ గొరిల్లా కోతులుగా గుర్తించి విఫలమయింది. అలాగే యాపిల్ చైనాలో ఐ-ఫోన్ యజమానులందరినీ ఒకేఒక వ్యక్తిగా గుర్తించింది. అంటే యాపిల్ సాఫ్ట్‌వేర్ దృష్టిలో చైనా వాళ్ళందరూ ఒకేరకంగా ఉంటారు.

నిఘా, వ్యాపార అవసరాల కోసం దేశంలోని ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తానని ప్రభుత్వానికి, బడా పెట్టుబడికి యూఐడీఏఐ హామీ ఇచ్చింది. మన ఆధార్ డేటాను ఉపయోగించటంలో అది అమెరికా జాతీయ భద్రతా ఏజన్సీని అనుకరిస్తున్నది. గూగుల్, ఫేస్‌బుక్‌లతో పోటీచేసేందుకోసం, భారతీయ ఫిన్‌టెక్ కంపెనీల, బ్యాంకుల ఆర్థిక లావాదేవీల కోసం బిగ్ డేటాను నిర్మిస్తామని కూడా మాటిచ్చారు. ఇదంతా బలహీనమైన పునాదిమీద ఉన్నది. యూఐడీఏఐ ప్రతిస్పందనలు నిస్పృహతో కూడినవని విఫలమయ్యే సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టుల గురించి తెలిసినవారు అర్థం చేసుకుంటున్నారు. సరియైన సలహాలను పాటించకపోవటం, ట్రిబ్యూన్‌పై కేసుపెట్టటం వంటి నిరుపయోగమైన చర్యలను యూఐడీఏఐ తీసుకుంటున్నది. ఈ ప్రతిపాదిత చర్యలేవీ ఆధార్ భద్రతా వ్యవస్థలోని మౌలిక సమస్యను పరిష్కరించేవిగా లేవు. ఎంతో ప్రజా ధన వ్యయంతో ఆధార్ వ్యవస్థ నిర్మితమైంది. ఇంత తెలిసిన తరువాత ఆధార్ ప్రాజెక్టు ప్రధానోద్దేశం నెరవేరుతుందని మనం భావించగలమా? ఆధార్ ప్రాజెక్టుతో ముందుకు సాగటమంటే ఇప్పటికే వ్యయం చేసిన ఎంతో డబ్బుకు అదనంగా మరింత డబ్బును ఖర్చు చేయవలసి ఉంటుంది. అయితే దీనితో మన పౌరులకు మరింతగా ప్రమాదాలను సృష్టించమా? అంతేకాకుండా మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రమాదంలో పడదా?

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్: 8886396999

మెయిల్ @ నవతెలంగాణ

ఈ రోజుల్లో షాదీ బర్బాదీ..!



సయ్యద్ రఫీ

నిజానికి పెండ్లి అనేది ఒక అమ్మాయి అబ్బాయి కలిసి కాపురం చేయడానికి చేసుకొనే ఒప్పందం. ఆ ఒప్పందం తెలిసిన బంధుమిత్రుల సమక్షంలో జరిపించి, వచ్చిన వారికి భోజనాలు పెట్టి పంపించడం ఆనవాయితీ. తద్వారా ఒక కాపురానికి ఒక కొత్త జంట కలిసిందని బహిరంగంగా తెలియపరచడమే దీని ఉద్దేశం. ఇంతదానికి వివిధ కారణాలతో ఎంతో పెద్ద తతంగంలా మార్చేసుకున్నారు మనుషులు. పెండ్లి అంటే మానవ సంబంధాల ఒప్పందం కంటే వ్యాపార లావాదేవీల మాదిరిగా మారింది. ముఖ్యంగా వరకట్నం అయితే వధువు తల్లిదండ్రులకు ఒక శాపంలా, వరుడి తాలూకు వారికి ఒక పైశాచిక ఆనందానికి మూలమయింది. ఈ కట్నాల వల్ల అమ్మాయిల పెండ్లిండ్లు జరగడం కష్టతరం అయిపోయింది. తీసుకున్న కట్నాలు చాలక, ఇంకా ఆశించి రకరకాల వేధింపులకు గురి అవుతున్నారు అమ్మాయిలు. కొందరమ్మాయిలైతే హత్యలకు ఆత్మహత్యలకు గురి అవుతున్న సంగతి తెలిసిందే. నా దృష్టిలో కట్నం అడిగేవాడికి పిల్లనివ్వడం అంటే ఒక పిశాచికి ఇచ్చి కట్టబెట్టినట్టే!

కట్నాల సంగతి అటు ఉంచితే ఎవరి స్థోమత వారు ఒకరికి ఒకరు పోటీపడి మరీ చూపించుకొని మురిసిపోయే సందర్భంగా మారిపోయింది పెండ్లి వేడుక. అవసరానికి మించిన రకరకాల వంటలు, వస్త్రాలు, నగలు, అలంకరణలు, కల్యాణమండపాలు, ఆర్కెస్ట్రా లాంటి వాటిపై డబ్బును ధారపోస్తున్నారు. ధనవంతులను పక్కన పెడితే, పేదలు అప్పులు చేసి మరీ చేతులు కాల్చుకుంటున్నారు. తీసుకున్న బాకీ తీర్చడానికి నానా తిప్పలు పడిపోతున్నారు. కొందరైతే పెండ్లి చేసుకొని సుఖంగా ఉండడం కంటే కొన్ని ఏండ్లు పెండ్లి కోసం తీసుకున్న అప్పు వడ్డీతో సహా తీర్చటానికే గడిచిపోతుంది. ఇదంతా అవసరానికి మించి మనుషులు స్వయంగా తయారు చేసుకొని తమ కాలిపై తామే గొడ్డలితో నరుకున్నట్టుగా అనిపిస్తున్నది ఈ వ్యవహారం చూస్తుంటే.

ఈ మధ్య ఎక్కువ శాతం పెండ్లిండ్లు రాత్రిపూట జరుగుతున్నాయి. వధూవరులే కాకుండా తమ తమ ఆహ్వానితులు సైతం పెండ్లి జరిగే స్థలానికి చాల ఆలస్యంగా చేరుతున్నారు. ఆలస్యంగా చేరడం వల్ల భోజనాలు కూడా ఆలస్యంగా చేయవలసి వస్తుంది. రాత్రి ఆలస్యంగా భోజనాలు చేయడం వల్ల ఆరోగ్యానికి నష్టమే. రాత్రి ఆలస్యంగా పడుకొనే సరికి మర్నాడు ప్రొద్దున్నే దిన చర్య సాగించడం చాల కష్టమై పోతున్నది. అందువల్ల పిల్లలకు స్కూళ్ళు, ఉద్యోగస్తులకు ఆఫీసులు, వ్యాపారస్తుల వ్యాపారాలు సక్రమంగా సాగకుండా అంతరాయం కలిగి జీవితంలో వెనక బడిపోతున్నారు. అర్ధరాత్రి ప్రయాణాలవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

కాబట్టి ఈ పెండ్లిండ్ల ప్రక్రియను సులువుగా సాదా సీదా పద్ధతితో జరుపుకునే పద్ధతులను అవలంబించడం మంచిది. ఒకరిని చూసి ఒకరు పోటీపడడం, లేని వారు అప్పులుచేసీ మరీ తమ హోదాను చూపించుకోవడం, మితి మీరిన ఖర్చు ఆర్భాటాలకు పోవడం చాల దురదృష్టకరం, వ్యవస్థకు హానికరం. అలా కాకుండా ఒక ఆదర్శాన్ని చాటే పెండ్లిండ్లకు ప్రాధాన్యత నిచ్చి, షో పుటప్ పెండ్లిండ్లకు ఫుల్ స్టాప్ పెడితే మంచిది. వీలయితే అలాంటి పెండ్లిండ్లను బాయ్‌కాట్ చేయడం ఉత్తమం. పెండ్లి అంటే నూరేండ్ల పంట అవ్వాలి. కానీ షాదీ బర్బాది అవ్వకూడదు!

సెల్: 9966025325

ప్రజావాణి

సద్వినియోగం చేసుకోవాలి

ప్రతీ మనిషికీ పుస్తక పఠనం ఆవశ్యకత ఎంతైనా ఉంది. నిరంతరం గ్రంథపఠనం వల్లనే మేధావులు అయినవారు ఎందరో ఉన్నారు. పూర్వపురోజుల్లో స్త్రీలు పాఠశాలలకు వెళ్ళకున్నా ఇంటివద్ద పురాణగ్రంథాలు, నవలలు, విజ్ఞాన పుస్తకాలు చదివి మేధావులు, సంఘసేవకులు, మహా రచయితలు అయినవారు ఉన్నారు. నేడు పిల్లలు మొబైల్‌ఫోను ఫీచర్లు, పెద్దలు టీవీ సీరియల్స్‌కు బానిసలు అయి విలువైన సమయాన్ని వృథాచేసుకుంటున్నారు. అందుకే ప్రతీ ఒక్కరూ పుస్తకాల పురుగులు కావాలి. తమపిల్లలను చిన్ననాటి నుంచే కథా పుస్తకాలు, విజ్ఞాన గ్రంథాలకు బానిసలను చేయాలి. తరచుగా మహానగరాలలో బుక్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి. మన రాజధాని నగరంలోనూ జనవరి 18 నుండి 28 వరకు జరుగుతున్న బుక్‌ఫెస్టివల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. తమ అభిరుచిని బట్టి గ్రంథాలను కొని చదివించాలి. తప్పని సరిగా తమ పిల్లలను వెంటబెట్టుకొని పోయి వారి అభిరుచిని బట్టి వివిధ కథల పుస్తకాలు, విజ్ఞాన గ్రంథాలు కొని చదివించాలి. ఇవి పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తాయి.

ఎస్ఎస్ రాజు, హైదరాబాద్.

తలాక్ రాజకీయాలు



వాహెద్

లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఎలాంటి ప్రతిఘటన లేకుండా సునాయాసంగా ఆమోదం పొందిన తర్వాత రాజ్యసభలో ప్రస్తుతం పెండింగులో పడింది. దానిక్కారణం ఒక రకంగా బీజేపీయే. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు పట్టుపట్టడంతో బీజేపీ రాజ్యసభ వాయిదా పడేలా చేసింది. రాజ్యసభలో బిల్లును ఆమోదించడం కష్టం కాబట్టి ఇక ప్రభుత్వం ఆర్డినెన్సు తెచ్చే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. విచిత్రమేమంటే, ముస్లిం మహిళ ట్రిపుల్ తలాక్ విషయంలో కష్టాలకు గురయితే, భర్త నుంచి వేధింపులకు గురయితే వెంటనే రంగంలోకి దూకి కాపాడేస్తానంటున్న ప్రధాని నరేంద్ర మోడీ మత కలహాల్లో ముస్లిం మహిళలపై దాడి జరిగినప్పుడు కాపాడటానికి ఏమీ చేయడం లేదు. ఇళ్ళను తగలబెట్టిన ఘటనల్లో, గోరక్షణ పేరిట బాధిత మహిళల భర్తలను, తండ్రులను, కుమారులను అమానుషంగా కొట్టి చంపుతున్న సంఘటనల్లో కాపాడటానికి మాత్రం కనీసం నోరు విప్పడానికి కూడా మీనమేషాలు లెక్కిస్తారు. చివరకు ఒక హిందూ మహిళ ముస్లిం పురుషుడిని వివాహం చేసుకోవాలనుకుంటే లవ్ జిహాద్ పేరిట నానా యాగీ చేస్తున్న సంఘ విద్రోహ శక్తుల నుంచి రక్షించడానికి కూడా ఆయన ముందుకురారు. భార్యలను వదిలేసి పట్టించుకోకుండా రోడ్డున పడేలా చేసే పురుషుల నుంచి కాపాడేందుకు అసలు ముందుకు రారు.

కాని ట్రిపుల్ తలాక్ కారణంగా కష్టాలకు గురైన ముస్లిం సోదరీమణుల కోసం ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కడవల కొద్దీ కన్నీళ్ళు కార్చేశారు. గుజరాత్ ఎన్నికల ప్రచారం సందర్భంలోనూ ఇదే మాట చెప్పారు. నిజంగానే ఇది ఎన్నికల సమస్య అనుకోవాలా? నిజంగానే ఆయన మొసలి కన్నీళ్ళు చూసి, తమను రక్షిస్తారని నమ్మి ముస్లిం మహిళలంతా ఓటు వేయడం వల్ల గెలిచారనుకోవాలా? ముస్లింలలో విడాకుల రేటు ఎంత ఉంటుంది? అసలు ఏ సముదాయంలో అయినా విడాకుల రేటు 2శాతానికి మించి ఉందా? అలాంటప్పుడు ఏ సముదాయానికి సంబంధించైనా సరే విడాకులు పొందిన మహిళల సమస్య ఎన్నికల సమస్యగా మారుతుందా? ఓట్లను రాలుస్తుందా? విడాకుల సమస్య భారత దేశానికి సంబంధించినంత వరకు కేవలం మహిళల సమస్య కాదు. కుటుంబం మొత్తం బాధపడే సమస్య. భర్త తరపు బంధువుల్లోను మహిళలు ఉంటారు, భార్య తరపు బంధువుల్లోను మహిళలు ఉంటారు. ఈ మహిళలంతా ఒకేవిధంగా ఆలోచించి, విడాకులు పొందిన మహిళ పట్ల సానుభూతితో మోడీకి ఓట్లేస్తారని అనడం సామాజిక నిర్మాణాన్ని అర్థం చేసుకోని అవివేకం మాత్రమే. కాబట్టి ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం వల్ల మోడీ పార్టీకి ముస్లిం మహిళలందరు గంపగుత్తగా ఓట్లేశారని చెప్పడం అవగాహనా రాహిత్యం. కానీ 'ట్రిపుల్ తలాక్ నిషేధించిన దమ్మున్న పార్టీ మాదే, చూశారా, నిన్నటి వరకు ఇతర ప్రభుత్వాలు చేయలేని పని మేం చేశాం. ముస్లింలను మేం బుజ్జగించడం లేదు, ముస్లింలను అణిచేసే ఘనకార్యం మేం చేశాం, తలాక్ ఇచ్చినోడిని జైల్లో పడేసి, ఆ కుటుంబం రోడ్డున పడేలా చేయగలిగాం' అనే స్పష్టమైన సంకేతాలు ముస్లిమేతర ఓటర్లకు ఇవ్వడమే ఈ ప్రచారం ముఖ్యోద్దేశ్యం. దశాబ్దాలుగా కొనసాగుతున్న ముస్లిం సంతుష్టీకరణ అనే అబద్ధాన్ని పచ్చి నిజంగా నమ్మేస్తున్న వారి అహాన్ని సంతృప్తిపరిచే ఇలాంటి ఎత్తుగడ చాలు గెలవడానికి అని బీజేపీ నమ్ముతోంది. అది నిజమే అని రుజువవుతోంది.

ట్రిపుల్ తలాక్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెడుతూ న్యాయశాఖా మంత్రి 'ఇది రాజకీయం కాదు. మానవత్వం' అన్నారు. ఎక్కడుంది మానవత్వం? తలాక్ చెప్పగానే జైల్లో పెట్టడం, భార్యను రోడ్డున పడేలా చేయడం, కుటుంబం కూలిపోయేలా చేయడం ఇదా మానవత్వం? ఇది రాజకీయం తప్ప మానవత్వం కాదని స్పష్టంగా అర్థమవుతోంది. కాని అబద్ధాలను నిజాల్లా నమ్మించడం బీజేపీకి చేతనైన ఏకైక విద్య. ఇప్పటి వరకు ముస్లింలను జిహాదీలు, టెర్రరిస్టులుగా ప్రచారం చేస్తూ వస్తున్న వాళ్ళు, ఆయా కేసుల్లో జైళ్ళకు అమాయకులను పంపిస్తున్నవాళ్లు, ఇప్పుడు విడాకుల కేసుల్లో కూడా ముస్లిం పురుషులను జైళ్ళకు పంపడానికి చేసిన కుట్రే ఈ బిల్లు. ఈ బిల్లు సుప్రీంకోర్టు తీర్పును కూడా నిర్వీర్యం చేసేస్తోంది. ట్రిపుల్ తలాక్ చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కాబట్టి ఎవరైనా ట్రిపుల్ తలాక్ ఇస్తే అది విడాకులుగా అమలు కాదు. కాబట్టి ఆ భార్యాభర్తల మధ్య సయోధ్యకు అవకాశం ఉంది. కాని ఇప్పుడు ప్రభుత్వం ఇందులో తల దూర్చి, భర్తను జైలుకు పంపి, ఆ తర్వాత విడాకులు గ్యారంటీగా జరిగే వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఇది ముస్లిం కుటుంబాలను కూల్చే కుట్ర మాత్రమే.



నిస్సందేహంగా ట్రిపుల్ తలాక్ బిల్లు ఒక రాజకీయ వ్యూహంగా ముందుకు వచ్చింది. ఈ బిల్లు వల్ల ముస్లిం మహిళలంతా బీజేపీకి ఓటేస్తారనడం ఎంత హాస్యాస్పదమో ఇంతకు ముందే మనం చెప్పుకున్నాం. గత మూడు సంవత్సరాలుగా, అంటే మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి దేశంలో ముస్లింల పరిస్థితి మరింత దిగజారింది. రాజకీయంగానూ, ఆర్థికంగానూ ముస్లింలను అణిచి వేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాజకీయంగా చూస్తే లోక్‌సభలో గతంలో ఎన్నడూ లేనంత తక్కువ సంఖ్యలో ముస్లిం సభ్యులున్నారు. అంటే 22 మంది. ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం జనాభా దాదాపు 20 శాతం. కాని అక్కడి శాసనసభలో వారి ప్రాతినిధ్యం 5.9 శాతం. ముస్లింలకు బీజేపీ టిక్కెట్లివ్వడం లేదు. వారిపై విషం కక్కే నాయకు లకు టిక్కెట్లిస్తోంది. అలాంటి వారే గెలుస్తారన్నది రుజువవుతూ వస్తోంది. సామాజికంగా దేశం ఎలాంటి పరిస్థితుల్లో ఉందో సమాజ శ్రేయస్సు కోరే వారందరూ ఆలోచించుకోవలసిన ప్రశ్న ఇది.

ఈ బిల్లు చట్టమైతే, భార్య స్వయంగా ఫిర్యాదు చేయనవసరం లేదు, ఎవరైనా అనుమానంతో ఫిర్యాదు చేసినా పోలీసులు సదరు భర్తను అరెస్టు చేయవచ్చు. అంటే ఏవైనా పాత కక్షలు ఉంటే ఎవరైనా ఎవరినైనా వేధించడానికి కూడా ఈ చట్టాన్ని వాడుకోవచ్చు. పోలీసులు కూడా వేధించడానికి ఈ చట్టాన్ని వాడుకోవచ్చు. అంటే, బీజేపీ ఏం చేస్తోంది. రాజకీయంగా, ఆర్థికంగా ముస్లింలపై దాడులు చేసి వారిని బలహీనుల్ని చేసి, ఇప్పుడు ముస్లిం మహిళల సాధికారతకు ఈ బిల్లు తెచ్చామంటోంది. ముస్లిం మహిళల సాధికారత ముస్లిం పురుషులకు జైళ్ళలో కఠిన కారాగారశిక్ష విధించడం ద్వారా సాధిస్తానంటోంది. నిజం చెప్పాలంటే భారత దేశం జెండర్ డెవలప్‌మెంట్ ఇండెక్సులో 131వ స్థానంలో ఉంది. దానికి కారణం ముస్లిం పర్సనల్ లా కాదు. మొత్తం దేశంలోనే లైంగిక వివక్ష తీవ్రంగా ఉంది. కాని బీజేపీ కోరుతున్నది అది కాదు, ముస్లిం సముదాయాన్ని ఎంతగా అణిచేశామో తన ఓటుబ్యాంకుకు చెప్పుకోవడం ముఖ్యంగా భావి స్తోంది. ముఖ్యంగా నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో ఇప్పుడు హిందూత్వమే ముఖ్యమైన అంశం. కాంగ్రెస్ కూడా సాఫ్ట్ హిందూత్వ మాత్రమే ఓట్లను సంపాదించి పెడుతుందన్న ఆలోచనలో ఉంది. గుజరాత్‌లో అదే జరిగింది. కాబట్టి కాంగ్రెస్ కన్నా తమ హిందూత్వ చాలా బలమైందని చెప్పుకోవడం ఇప్పుడు బీజేపీకి చాలా అవసరం. కాబట్టి ఈ బిల్లు ద్వారా తమ హిందూత్వ కాంగ్రెస్ హిందూత్వ కన్నా చాలా గొప్పదని, ఆ పార్టీ ముస్లింల పట్ల మెతగ్గా వ్యవహరిస్తుందనీ, కాని తామైతే ఇలాంటి బిల్లు ద్వారా ముస్లింలను పూర్తిగా అణిచేశామని, ముస్లిం మహిళల పేరు చెప్పి మరీ అణిచేశామన్న సంకేతాలు స్పష్టంగా ఇవ్వవచ్చు. ముస్లిం మహిళల ఓట్లు పడతాయా లేదా అన్నది ఇక్కడ ప్రశ్నే కాదు. ఈ రాజకీయ క్రీడ బీజేపీ తన ఓటుబ్యాంకు అహాన్ని సంతృప్తి పరచడానికి, కాంగ్రెస్ కన్నా ఈ విషయంలో తామే మెరుగు అని చెప్పుకోడానికి నడుపుతున్న క్రీడ.

భీమ-కోరెగావ్‌లో జరిగిన సంఘటనలు, ట్రిపుల్ తలాక్ బిల్లు ఇవన్నీ చెప్పేది ఒక్కటే. దేశంలో చిచ్చు పెట్టే రాజకీయాలు, వివిధ సముదాయాల మధ్య విద్వేషం రాజేసే రాజకీయాలు మరింత తీవ్రమవుతున్నాయి. 2014లో మాదిరిగా సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనేది మాటవరుసకు కూడా వినిపించే వాతావరణం ఇప్పుడు కనబడడం లేదు. 2019 ఎన్నికల వాతావరణం ఎలా ఉంటుందో దీన్ని బట్టి ఊహించుకోవచ్చు.

తీరైన చీర కట్టు...



రంగు రంగుల సీతాకోక చిలుకలన్నీ ఒకే చోట చేరితే ఆమని అందంతో గంతులేస్తుంది. ఇక ఆ రంగుల్లో దాగిన వైభవం అపూర్వం. ప్రకృతిలోని వంపు సొంపులను తనలో దాచుకొని వయ్యారాలు పోయే సీతాకోక చిలుకల్లాంటి అమ్మాయిల చీర కట్టు వర్ణనాతీతం. శుభకార్యం ఏదైనా కానీ చీరకట్టులోనే మగువలు అందంగా కనిపిస్తారు. అందరిలో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా, హుందాగా కనిపించాలంటే ఒకే చీరను వివిధ పద్ధతుల్లో కడితే సరి! సాంప్రదాయంగా, కళాత్మకంగా కనిపించడంతో పాటు పది మందిలో తమదైన ముద్రను వేసుకుంటారు. అందుకే ఓ సారి ఈ కట్టును ప్రయత్నించి చూడండి!



పర్మిషన్ లేకుండా మహిళ శరీరాన్ని తాకరాదని ఢిల్లీ కోర్టు స్పష్టం చేసింది. మహిళ శరీరం ఆమె సొంతం. దీనిపై ఆమెకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని పేర్కొంది. అందువల్ల మహిళ అనుమతి లేకుండా ఎవరైనా సరే ఆమె శరీరాన్ని తాకడానికి వీల్లేదని స్పష్టం చేసింది. తొమ్మిదేళ్ళ బాలికపై లైంగిక దాడి కేసులో ఈ వ్యాఖ్యలు చేసింది. తొమ్మిదేళ్ళ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన చవి రామ్ అనే వ్యక్తికి ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ అదనపు సెషన్స్ జడ్జి సీమా మైని తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా కొందరు పంచుకున్న అభిప్రాయాలు ఫేస్‌బుక్ సౌజన్యంతో...

తాకరాదంటే... తాకరాదు

ఆహ్వానించదగ్గది..



అవును 'ఆమె అనుమతి లేనిదే ఆమెను తాకరాదు'... ఆమె నిస్సహాయంగా వున్నా, ఒంటరిగా వున్నా, అమాయకంగా వున్నా, ఏమరుపాటుగా వున్నా, ఆమె శరీరాన్ని తాకే హక్కు ఎవరికీ లేదూ అంటూ అనేక వేదికల్లో, అనేక సందర్భాల్లో, తరచుగా పీవోడబ్ల్యూ సంధ్య అనే మాటలను ఉటకాయిస్తూ నేనూ ఓ కవితను రాసాను. ఇప్పుడు అవే మాటలను ఢిల్లీ హైకోర్టు సమర్థిస్తూ అనుమతి లేకుండా ఆమెను తాకరాదు అని సంచలన తీర్పు ఇవ్వటం నిజంగా ఆహ్వానించదగ్గ పరిణామం. పీవోడబ్ల్యూలాంటి మరికొన్ని మహిళా సంఘాలు, ప్రజాస్వామిక వాదుల పోరాటాల ఫలితంగా ఎన్నో చట్టాలు వచ్చినప్పటికీ వాటి అమలులో ఇప్పటి దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వాన్ని వహిస్తున్న తరుణంలో ఈ తీర్పు ఢిల్లీ హైకోర్టు ఇవ్వటం నిజంగా గర్వించదగ్గది. ఇది భారతదేశ మహిళలందరి విజయంగా మనం చెప్పుకోవాలి.

స్త్రీల శరీరాలను వస్తు వినిమయ కేంద్రాలుగా చూపించి వ్యాపార రంగంలో లాభాలు గడిస్తున్న పెట్టుబడీదారులకు, సినిమా, టీవీ మాధ్యమాలకు కూడా ఒక్క జెలక్ న్యాయవ్యవస్థ ఈతరుణంలో ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా వుంది. జనసమ్మర్థం ఉన్న ప్రాంతాలలో, బస్సుల్లో, రైలు ప్రయాణాల్లో, సినిమా హాళ్లల్లో ఎక్కడపడితే అక్కడ తమ పైశాచిక కామ ప్రకోపాలను కొందరు పురుషులు చేయటం ప్రతి స్త్రీకి కూడా జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వచ్చిన సందర్భం తప్పకుండా ఉండే ఉంటుంది. మానవీయ ద కృథం వున్న పురుషులు అలాంటి వింత పోకడలున్న వారిని అడ్డుకున్న సందర్భాలు కూడా కోకొల్లలు. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో స్త్రీలతో పాటు ముక్కుపచ్చలారని బాలికలు, విద్యార్థినీలు బస్సుల్లో, రైళ్లల్లో కిక్కిరిసిన పురుషుల మధ్య ప్రయాణం చేయటం ఒక సవాలు అయిపోతోంది. దాన్ని అవకాశంగా తీసుకొని కొందరు మగవాళ్ళు తమ విపరీత లైంగిక వాంఛలను తీర్చుకొనే దిశగా స్త్రీల/బాలికల ప్రైవేటు పార్ట్సు తాకటం, తడమటం లాంటి చర్యలు చేస్తూ తన్మయులౌతూ ఉంటారు. అది చాలా సహజ సిద్ధంగా మూడోకంటికి తెలియకుండా చాలా గుట్టుగా జరుపుతారు. అది పబ్లిక్ ప్లేస్ అన్నది కూడా మరచి తమ చూపులతో, సంజ్ఞలతో మరికొందరు పురుషులు స్త్రీల శరీరాన్ని తడుముతూ మానసిక విక త చేష్టలు చేస్తూ ఉంటారు...

ఇవన్నే కూడా క్షమించరాని నేరం కిందకే వస్తాయి. ఇలాంటి చర్యలను కూడా న్యాయవ్యవస్థ ఇప్పుడు పరిశీలించాల్సిన అవసరం వుంది. ఒకప్పుడు స్త్రీల కోసం ప్రత్యేక బస్సులు నడిపేవారు. రైళ్ళల్లో ప్రత్యేక బోగీలు ఉండేవి. స్త్రీలకు కేటాయించ బడిన సీట్లలో కూడా స్త్రీలు, బాలికలు కూర్చోలేని స్థితి ఈనాటికి కొనసాగింపబడుతూనే వుంది. ఆ సీట్లను కూడా సీనియర్ సిటీజనుల పేరుమీదా మగవాళ్ళే ఆక్రమించేస్తారు. ఎవరైనా వ ద్ధ మహిళ బస్సు ఎక్కి నిలబడలేని స్థితిలో వున్నాసరే కనీసం సీటు ఇవ్వాలన్న ధ్యాసకుడా కొందరు సీనియర్ సిటిజెన్స్ అయిన పురుషులకు ఉండదు.. అక్కడ కూడా ఆమె రెండవ స్థాయి పౌరురాలిగానే చూడబడుతుంది. ఇక రైళ్ళల్లో మొదట ప్రవేశపెట్టిన రెండు మహిళా బోగీలు కాస్తా కుదించబడి ఒకేఒక్క బోగిగా నేడు మిగిలిపోయింది. పోలీసు ప్రొటెక్షను లేకపోతే దానిని కూడా పురుషులే ఆక్రమించేస్తారు.

మహిళా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు మూడు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలు చేసి, సాధించిన చట్టాల అమలు ప్రశ్నార్థకమైన సందరరేలో సమాజంలో స్త్రీల దుస్థితిని తెల్యచేస్తూ...ఆమెను తాకరాదన్న తీర్పు ఆహ్వానించదగ్గది. ప్రతి మహిళా కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ స్పందించాల్సి వుంది....చట్టాల అమలు దిశగా ప్రశ్నించాల్సిన అవసరం వుంది.

పోరాడితే పోయేది ఏముంది..బానిస సంకెళ్లు తప్పా!
ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు.. క తజ్ఞతలతో!

- భండారు విజయ

సర్వహక్కులు ఆమెవే...



మహిళ దేహం ఆమె స్వంతం. అనుమతి లేనిదే తాకరాదని కోర్టు స్పష్టం చేసింది. ఒక బాలిక పట్ల అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తికి శిక్ష విధిస్తూ చెప్పిన మాటలివి. మహిళల సెక్సువాలిటీ గురించి, మహిళల సాధికారత గురించి మాట్లాడడం అంటే ఈ విషయాలను చర్చించడం. అంతేకాని పోర్న్ సినిమాలు తీసి, మహిళల సాధికారత, మహిళల సెక్సువాలిటీ ముసుగు వేసి కొందరు పురుషుల కామవికారాలకు సంతుష్టి కలిగించడం నైతికంగా హేయమైన చర్య. అలాగే అనాటమీ పాఠాల పేరిట చేతులు పట్టుకుని బోధించడమూ, ఆ సీన్లను సినిమాలో చూపించడం ద్వారా అదంతా 'రా ఫీల్' అనే ముసుగువేయడం కూడా అత్యంత హీనమైన కుట్ర. స్త్రీకి శరీరం తప్ప మనస్సు ఉండదన్నట్లు, తలూపడం, వెంట నడవడం తప్ప మరో మాట ఉండదన్నట్లు చూపించే సినిమాలను, సెక్సువాలిటీ, సాధికారతల పేరిట అంగాంగ ప్రదర్శననే కాదు, బెడ్ రూము దృశ్యాలను బజారులో పరచడంపై కూడా ఏదైనా కోర్టు మాట్లాడితే బాగుండును. స్త్రీ సాధికారత, సెక్సువాలిటీ గురించి గొప్పలు చెప్పే ఈ ప్రబుద్ధులు నల్లగా, లావుగా, ఎత్తుపండ్లతో ఉన్న అమ్మాయిని హీరోయిన్‌గా ఎందుకు తీసుకోవడం లేదు. అలాంటి అమ్మాయిలు కూడా స్త్రీలే కదా. వారికి సాధికారత అవసరం లేదా? వారి సెక్సువాలిటీ గురించి మాట్లాడితే తమ సినిమా చూసేవాళ్ళుండరని భయమా? స్త్రీల సాధికారత, స్త్రీల సెక్సువాలిటీ గురించి మాట్లాడేదయితే అనాకారిగా ఉన్న అమ్మాయి కూడా అమ్మాయేనని గుర్తించి మాట్లాడాలి. అంగసౌష్టవం, అందం ఉన్న అమ్మాయితో అంగాంగ ప్రదర్శన చేయించడం నిజాయితీ లేమిని సూచిస్తుంది. ఇది స్త్రీలను అవమానించడమే తప్ప మరేమీ కాదు. దురదృష్టమేమంటే ఇదే ప్రోగ్రెసివ్ అని కొందరు భావించడం. ప్రేమించాలని వెంటబడడం, వేధించడం, ఒత్తిడి చేయడం, బెదిరించడం ఇవన్నీ నేడు సినిమాల్లో కనిపిస్తున్న సగటు సీన్లే. ఇవే ఏదో ఒక రూపంలో సమాజంలో కూడా కనిపిస్తున్నాయి. స్త్రీల గురించి మాట్లాడడమంటే, అందమైన అమ్మాయిల శరీరాల గురించి మాట్లాడ్డం కాదన్నది అర్థం కానంతవరకు ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది. ప్రోగ్రెసివ్ థాట్ నీ ఇన్వెంట్ చేసుకోవలసిన అవసరం ఉంది. గాలిబ్ ఎప్పుడో శతాబ్దాల క్రితం రాసిన రెండు పంక్తులు గుర్తొస్తున్నాయి

'సాదగీ వ పుర్కారీ, బేఖుదీ వ హెూషియారి
హుస్న్ కో తగాఫుల్ మేం జుర్అత్ ఆజ్మా పాయా'
(నిర్లక్ష్యం, అప్రమత్తం, భోలాతనం, టక్కరితనం
పరధ్యానంగా చొరవను పరీక్షించే చక్కదనం) అని పై పంక్తులకు అర్థం.

రెండు పంక్తుల కవితలో గాలిబ్ ఒక సన్నివేశాన్ని ఆవిష్కరించాడు. ప్రేయసి ఏదో పరధ్యానంగా కనబడింది. చుట్టుపక్కల ఎవరున్నారో పట్టించుకునే స్థితిలో లేదు. నల్లని కురులు గాలికి ఎగురుతున్నాయి. ఆ సౌందర్యాన్ని చూసి నిగ్రహించుకోవడం సాధ్యం కాలేదు. కాస్త దగ్గరకు వెళ్ళి ఆమెను తనివిదీరా చూడాలని, వీలయితే ఆ కురులను తాకాలని అనుకున్నాడు. కాని వెంటనే నిగ్రహించుకున్నాడు. ఈ పరధ్యానం కేవలం పరీక్ష మాత్రమేనని, పరధ్యానంలో ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా ఎప్పుడు ఉండదని, తానేం చేస్తాడో చూడాలన్న పరీక్ష పెడుతుందని, కాబట్టి అందాన్ని ఆస్వాదించాలని ఉన్నప్పటికీ, గౌరవంగా, జాగ్రత్తగా వ్యవహరించాలని, పరధ్యానంలో ఉంది కదా అని తాకడం, చాటుమాటుగా చూడడం, ఆమె అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరించడమేనని చెప్పుకుంటున్నాడు. రెండులైన్ల ఆ కవితకు ఇంకా సుదీర్ఘమైన వివరణ ఇచ్చిన వారు కూడా ఉన్నారు. సూఫీతత్వంలో వివరణ మరింత లోతుగా ఉంటుంది. కాని క్లుప్తంగా చెప్పాలంటే ప్రేయసే అయినా చాటుమాటుగా చూడడం, ఆమెకు తెలియకుండా తాకడాన్ని నిరసించడం ఈ రెండు పంక్తుల్లోను స్పష్టంగా వినిపించే ధ్వని.

స్త్రీలను గౌరవించడం, వారి సెక్సువాలిటీని గుర్తించడం, వారి సాధికారత కోసం ప్రయత్నించడం అంటే అంగాంగ ప్రదర్శనలు కాదు, 'రా ఫీల్' చూపిస్తున్నామంటూ ఆత్మలేని శరీరాల్లా అమ్మాయిలను చూపించడమూ కాదు.

- వాహెద్

తొలి మహిళా మేయరు

తండ్రి నుంచి వారసత్వంగా సంఘ సేవను అందిపుచ్చుకున్న మహిళ రాణీ కుముదినీదేవి. హైదరాబాదు తొలి మహిళా మేయరుగా సేవలందించిన ఆమె కుకట్‌పల్లిలో కుష్టువ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేకంగా ఆశ్రమం నిర్మించి వ్యాధి నివారణకు విశేషకృషి చేశారు. ఆమె శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.



జానంపల్లి కుముదినీ దేవి (జనవరి 23, 1911 - 2009)

వరంగల్లు జిల్లా, వాడపల్లికి (వడ్డెపల్లి) చెందిన జమీందారీ వంశంలో కుముదినీ దేవి జన్మించారు. ఆమె తండ్రి పింగళి వెంకటరమణారెడ్డి. ఆయన హైదరాబాదు రాజ్యానికి ఉపప్రధానిగా పనిచేశారు. బాలికావిద్యను ఎంతో ప్రోత్సహించిన ఆయన తన కొడుకులతో సమానంగా కుతురిని కూడా ఉన్నత విద్యావంతురాల్ని చేశారు. కుముదినీ దేవికి 1928లో వనపర్తి సంస్థానం అధినేత రాజా రామదేవరావుతో పెండ్లి చేశారు. వారికి నలుగురు పిల్లలు.

సామాజిక సేవలో చురుకుగ్గా పాల్గొనే కుముదినీ కుష్టువ్యాధిగ్రస్తుల చికిత్స, పునరావాసం కోసం హైదరాబాదు కూకట్‌పల్లిలో 'శివానంద' ఆశ్రమం స్థాపించారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు చికిత్స, పునరావాసం వంటి విషయాలలో ఈ సంస్థ నేటికీ ఎంతో కృషి చేస్తోంది. అంతేకాక, 1958 లో కుముదిని వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరుగా ఉంటూ నెలకొల్పబడిన 'సేవాసమాజ బాలికా నిలయం' ఇప్పటికీ విజయవంతంగా నడుస్తూ, ఎందరో ఆడపిల్లలకి ఉపాధి, ఆశ్రయం కల్పిస్తున్నది. కుముదినీదేవి 1962లో హైదరాబాద్ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆమె బాలికావిద్య, నగర పారిశుద్ధ్యం, కుష్టువ్యాధి బారిన పడిన వారి కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. 2009లో తన 98 వ ఏట మరణించింది. 2011లో కుముదినీ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ❄

బార్లీ ఎంతో మేలు...

బార్లీ గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి కొవ్వును తగ్గించడంతో పాటు శరీర బరువును అదుపులో ఉంచుతాయి. ఉడికించిన బార్లీ నీటిని తాగడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ఒక గ్లాసు బార్లీ నీటిని తాగడం వల్ల అనారోగ్య సమస్యలు దూరం కావడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

- బార్లీ నీరు త్వరగా జీర్ణమై రక్తంలో కలిసిపోతాయి. అలాగే రోజంతటికి కావాల్సిన శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. నీరసంగా ఉన్నప్పుడు ఒక గ్లాసు బార్లీ నీరు తాగితే త్వరగా ఉపశమనం పొందుతారు.
- మధుమేహం ఉన్నవారు బార్లీ గింజలను తినడం మంచిదని చెబుతున్నారు నిపుణులు. ఉదయం పూట టిఫీన్‌లోకి ఉడికించిన బార్లీ గింజలను తింటే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల ఇన్సులిన్‌లో హెచ్చు, తగ్గులు ఉండవు. బార్లీ గింజలను తినడానికి ఇష్టపడని వారు గోధుమ పిండిలో బార్లీ గింజల పొడిని కలుపుకొని జావ చేసుకొని తాగినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- బార్లీ పొడిలో ఉండే గ్లూకాన్ పీచు పదార్థం, గోధుమ పిండిలో ఉండే గ్లైసమిక్ ఇండెక్స్ స్థాయిలను తగ్గిస్తుంది. అంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు త్వరగా పెరగకుండా కాపాడుతుంది.
- బరువు త్వరగా తగ్గాలనుకునే వారు ఓట్స్‌ను ఎక్కువగా ప్రిఫర్ చేస్తారు. కానీ బరువు తగ్గించడంలో ఓట్స్ కన్నా బార్లీ బాగా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అజీర్తి, కడుపు నొప్పి, యూరినరీ ఇన్ఫెక్షన్లు, గొంతు నొప్పి, హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారు బార్లీ నీరు తాగితే సరిపోతుంది. ❄





హోదా ఇస్తే బీజేపీతో పొత్తు

తిరుపతి: ఎన్‌డీఏ ప్రభుత్వం ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తే 2019 ఎన్నికల్లో బీజేపీతో కలిసి వెళ్తానని వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారం కోసం ప్రధాని మోడీని, ప్రజలను మోసగించాడని, వచ్చే ఎన్నికలలో చంద్రబాబే ప్రధాన టార్గెట్‌గా ఎత్తుగడలు ఉంటాయన్నారు. సోమవారం జగన్ ప్రజాసంకల్పయాత్ర శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని తొట్టంబేడు మండలం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా రిలయన్స్ పెట్రోలు బంక్ వద్ద మైనార్టీలు స్వాగతం పలికారు. నెల్లిమానుకండ్రిగ, శివనాథపాళెంలోని ప్రజలు తమ సమస్యలను వివరించారు. తొట్టంబేడు వద్ద పీహెచ్‌సీ సిబ్బంది వేతనాలు, రెగ్యులైజేషన్‌పై జగన్‌కు వినతిపత్రాలు అందజేశారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాలలో దళితుల ఆత్మీయ సభలో ప్రసంగించారు. అనంతరం సీఎన్‌ఎన్ నేషనల్ ఛానెల్‌కు సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకటిన్నర శాతం ఓట్లతో బాబు అధికారంలోకొచ్చి అసత్య హామీలతో ఆంధ్రా ప్రజలను మోసం చేశారన్నారు. తనపై కాంగ్రెస్, టీడీపీ పెట్టిన కేసులను ఎప్పటికీ మరచిపోనన్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు గౌరవనీయ వ్యక్తిగానే ఉన్నా కాంగ్రెస్‌ను వీడిన తర్వాత తనపై కేసులు నమోదు చేశారని చెప్పారు. పార్లమెంటులో ప్రత్యేకహోదాపై ఇచ్చిన హామీని బిజెపి నెరవేరిస్తే ఏ ఇతర ఆలోచన లేకుండా బిజెపితో కలిసి ఎన్నికలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియో టేపుల్లో రెడ్‌హ్యాండెట్‌గా దొరికిపోయిన చంద్రబాబు ఇంకా సీఎంగా కొనసాగే అర్హత లేదన్నారు.


శ్రీకాకుళం, గుంటూరు

కలెక్టరేట్ల వద్ద రైతుల ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న అర్జీదారులు, కలెక్టరేట్ సిబ్బంది

- బాధితులకు న్యాయం చేసేలా ఆయా కలెక్టర్లు ఆదేశాలు

శ్రీకాకుళం /గుంటూరు: శ్రీకాకుళం, గుంటూరు జిల్లా కలెక్టరేట్ల వద్ద సోమవారం ఇద్దరు రైతులు ఆత్మ హత్యాయత్నానికి పాల్పడారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువా గ్రామానికి చెందిన టంకాల మోహనరంగ ఉద్యోగ ప్రయత్నంలో విఫలమై తనకున్న 1.57 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఆ భూమిని తనకు విక్రయించాలంటూ ఐదేళ్లుగా అదే గ్రామానికి చెందిన రేషన్ డీలరు, టిడిపి నాయకుడు కె.కూర్మారావు ఒత్తిడి చేస్తున్నాడు. ఇందుకు నిరాకరించినందుకు మోహనరంగపై కక్షకట్టాడు. అధికారులపై ఒత్తిడి చేసి బోరుకు విద్యుత్ కనెక్షన్ మంజూరు కాకుండా చేశాడు. దీనిపై బాధితుడు తహశీల్దార్, విద్యుత్ శాఖ అధికారులను కలిసినా, సిఎం కాల్ సెంటర్ 1100కు పలు దఫాలు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రజావాణి అర్జీలను నమోదు చేసే కాల్‌సెంటర్ వద్ద తన వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కిరోసిన్ వాసన రావడంతో అక్కడున్న అర్జీదారులు, సిబ్బంది అప్రమత్తమై అడ్డుకున్నారు. కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ఆ రైతును పరామర్శించారు. తన చావుకు తహశీల్దార్, విద్యుత్ శాఖ అధికారులు కారణమని తాను రాసిన లేఖను కలెక్టర్‌కు బాధితుడు ఇచ్చాడు. దీనిపై కలెక్టర్ స్పందించి తహశీల్దార్, విద్యుత్ శాఖ ఎస్ఇతో ఫోన్లో మాట్లాడారు. తక్షణం కలెక్టరేట్‌కు వచ్చి బాధితునితో కలిసి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించాలని, రెండు రోజుల్లో విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు.



మోహనరంగ



ప్రసన్నబాబు

గుంటూరు కలెక్టర్ ఎదుట నాదెండ్ల మండలం బుక్కాపురానికి చెందిన యువ రైతు శివప్రసన్నబాబు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వ్యవసాయంలో అప్పుల పాలయ్యాయని, ఆదుకోవాలని పలు మార్లు అధికారుల్ని కోరినా ఫలితం లేదని చెప్పిన శివబాబు సోమవారం 'మీకోసం'లో కలెక్టర్, అధికారులందరి ఎదుటే ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. ఉలిక్కిపడిన అధికారులు వెంటనే తేరుకొని అతన్ని వారించటంతో ప్రమాదం తప్పింది. బాధితుడు పదేళ్ల నుండి కొంత సొంత భూమి, మరికొంత కౌలుకు తీసుకొని వివిధ రకాల పంటలు వేస్తున్నాడు. అయితే ప్రతి ఏటా ఏదో ఒక రూపంలో తీవ్ర నష్టాలొస్తున్న క్రమంలో ఇప్పటి వరకూ రూ.8 లక్షల వరకూ అప్పుల పాలయ్యాడు. దీంతో తనకు డైరీ ఫామ్ ఏర్పాటుకు రుణం ఇవ్వాలని ఎన్నో సార్లు అధికారుల్ని కోరాడు. 'మీకోసం'లోనూ పలుమార్లు విన్నవించాడు. అయినా ఫలితం లేదు. ఆర్థిక సాయం అందించాలని సిఎంను కోరగా రూ.25 వేలు మంజూరు చేసినా ఆ ప్రయత్నమూ విఫలమైంది. దీంతో అప్పుల నుండి తేరుకోలేక, తన ఆత్మహత్యతోనైనా ప్రభుత్వం మేల్కొనాలనే ఈ చర్యకు పాల్పడినట్లు చెప్పాడు. ప్రసన్నబాబుతో మాట్లాడిన కలెక్టర్ డైరీ ఫామ్ ఏర్పాటుకు రుణం ఇప్పిస్తామని హామీ ఇస్తూ, వెంటనే దానికి సంబంధించిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు.

గన్నవరం సమీపంలో రోడ్డు ప్రమాదం

- ఐద్వా జిల్లా నేత కుమార్తె మౌనిక దుర్మరణం
- తండ్రి ఆంజనేయులకు గాయాలు



మౌనిక (ఫైల్‌పోటో)

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరం ఆంజనేయస్వామి గుడికి సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, గన్నవరం మాజీ జెడ్‌పిటిసి జయమ్మ దంపతుల కుమార్తె మౌనిక (23) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. ఆర్‌టిసి హైర్ బస్సు మృత్యువు శకటమై ఆమెను నిర్జీవిని చేసింది. ఇదే ప్రమాదంలో మౌనిక తండ్రి ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. మృతురాలి తల్లి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మల్లంపల్లి జయమ్మ శోక సంద్రంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళితే.. బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్‌లో ఉంటున్న మల్లంపల్లి ఆంజనేయులు సెంట్రింగ్ కార్మికుడు. రెండు దశాబ్దాల నుంచి ప్రజానాట్యమండలిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం పిఎన్‌ఎం జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కుమార్తె మౌనిక ఎంఫార్మసీ చదువుతోంది. దంత సమస్య రావడంతో పరీక్షలు చేయించుకోవడానికి తండ్రి ఆంజనేయులుతో కలిసి చిన ఆవుటపల్లి దంత వైద్య కళాశాలకు టివిఎస్‌పై బయలుదేరి వెళ్తోంది. గ్రామం వెలుపల ఉన్న ఆంజనేయ స్వామి గుడికి సమీపంలోకి వెళ్లే సరికి అతి వేగంగా దూసుకొచ్చిన ఆర్‌టిసి హైర్ బస్సు వారిని ఢీకొని ముందుకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో మౌనిక తల భాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. ఆంజనేయులు తీవ్ర గాయాల పాలయ్యాడు.

కోడిపందేల్ని ఎందుకు అడ్డుకోలేదు: హైకోర్టు

హైదరాబాద్: కోడిపందేల్ని నిర్వహించకుండా అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటారని హామీ ఇచ్చినా ఎందుకు అడ్డుకోలేకపోయిందని ఏపీ సర్కార్‌ను హైకోర్టు నిలదీసింది. కోర్టుకు హామీ ఇవ్వడమే కాకుండా కోడిపందేల్ని నిర్వహించడానికి వీల్లేదని తాము ఉత్తర్వులిచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని ప్రశ్నించింది. కోడిపం దేలపై కౌంటర్ పిటిషన్ వేయాలని ఈ నెల 4న ఆదేశాలిస్తే తీరా కేసు విచారణకు వచ్చినప్పుడు తమకు సమయం కావాలని సీఎస్, డిజిపి తరపు లాయర్లు కోరడాన్ని సోమవారం హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. కోడిపందేలు జరగబో వని చెప్పిన తర్వాత కూడా యథాప్రకారం జరిగాయని, టీవీలో చూశామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయ మూర్తి జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. 29న జరిగే విచార ణకు సీఎస్, డీజీపీ స్వయంగా కోర్టుకు రావాలని బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

రక్తపు మరకల కలకలం

- సూర్యాపేట జిల్లాలో ఘటన

నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం రోళ్లబండతండాలో రక్తపు మరకలు కలకలం సృష్టించాయి. కొందరు గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి తండాలోని ప్రతి ఇంటికీ రక్తపు మరకలు అంటించారు. దీంతో ఆ తండా వాసులు భయంతో వణికిపోతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి తండాలోకి ప్రవేశించారు. శ్రీరాంసాగర్ కాల్వ నుంచి గ్రామ పంచాయతీ చివర వరకూ ఉన్న ప్రతి ఇంటి వద్దా రక్తపు మరకలు అంటించారు. కొన్ని ఇండ్ల డాబాలు, ఆరుబయట ఉన్న దుస్తులపైనా రక్తం చల్లారు. సోమవారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్న గిరిజన రైతులు రక్తపు మరకలను గమనించారు. తండాలోని మొత్తం ఇండ్లపై రక్తం చల్లడంతో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ పని ఎవరు చేశారనే విషయం తెలియాల్సి ఉంది. చివ్వెంల ఎస్సై ప్రవీణ్‌కుమార్ తండాకు చేరుకొని విచారణ చేపట్టారు.

'సర్పంచ్ ఎన్నికల విధానాన్ని మార్చొద్దు'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్ చట్టాన్ని మార్చొద్దని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి, నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తేవడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్నారు. దీనివల్ల అనేక అక్రమాలు, గొడవలు జరిగే ప్రమాదముందని తెలిపారు. పరోక్షంగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే వార్డు మెంబర్ల కిడ్నాపులు, కొనుగోలు పద్ధతులు ప్రారంభమవుతాయన్నారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉంటుందని, పరోక్ష ఎన్నికల ద్వారా అల్లర్లు చెలరేగే జరిగే అవకాశం ఉందన్నారు. పంచాయతీరాజ్ చట్ట సవరణపై ముందుగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను నీరు గార్చడం సరికాదని, పరోక్ష ఎన్నికల నిర్వహణపై ముందుగా అధ్యయనం చేయాలిసిన అవసరం ఉందన్నారు.

ఈజిప్టునకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తాం : సి పార్థసారథి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈజిప్టు దేశానికి అవసరమైన మేరకు నాణ్యమైన విత్తనాలు ఎగుమతి చేస్తామని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి పార్థసారథి తెలిపారు. ఈజిప్ట్ ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గమల్ అలజబ్, ఆ దేశ ఎగుమతి దిగుమతుల భాధ్యులు నేతత్వంలోని అధికారుల బృందం విత్తన ధ్రువీకరణ క్రమాన్ని అధ్యయనం చేయటానికి హైదరాబాద్ చేరుకున్నది. ఈ బృందంతో పార్థసారథి భేటీ అయ్యారు. ఈజిప్టు బృందంతో ఆయన మాట్లాడుతూ అవసరాల మేరకు కావలసిన మొక్కజొన్న, జొన్నలతో పాటు కూరగాయలు నాణ్యమైన విత్తన ఎగుమతులు చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దేశంలోనే మొదటిసారిగా ఆన్‌లైన్ విత్తన, అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణతో పాటు సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణలపై సంస్థ చేస్తున్న కార్యకలాపాలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. హైదరాబాద్ లో 400 లకు పైగా విత్తన కంపెనీలున్నాయని, ఆసియా ఖండంలోనే మొట్ట మొదటిసారిగా 2019 జూన్ నెలలో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ విత్తన సదస్సులో పాల్గొనాలని ఈజిప్ట్ ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించారు. ఈజిప్ట్ ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గమల్ అలజబ్ మాట్లాడుతూ తమ దేశానికి గత సంవత్సరం 550 మెట్రిక్ టన్నుల అంతర్జాతీయ ధ్రువీకరణ విత్తనాలను ఎగుమతి చేసి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్వా హస్సన్, ఈజిప్ట్ అంతర్గత నాణ్యా తా పరిపాలన భాధ్యులు మహమ్మద్ అలీ, మహమ్మద్ ఇబ్రహీం, పేరెంట్ సీడ్ మేనేజర్ మొయినుద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు జి.సుదర్శన్, భాస్కర్ సింగ్, నర్సింహాదాస్ పాల్గొన్నారు.

ఉగ్రవాది ఖురేషీకి హైదరాబాద్‌తో సంబంధాలు?


నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

2008 గుజరాత్‌లో మారణహోమం సృష్టించి అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాది మహ్మద్ సుభాన్ ఖురేషీ ఢిల్లీలో పట్టుబడ్డాడు. అతనికి హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నాయా? ఇక్కడ గతంలో జరిగిన పేలుళ్లలో ఇతని పాత్ర కూడా ఉందా అనే కోణంలో రాష్ట్ర నిఘా విభాగం అధికారులు ఆరా తీస్తున్నారు. దేశంలో ఏమూల ఉగ్రవాదులు పట్టుబడ్డా వారికి హైదరాబాద్‌తో ఉన్న సంబంధాలు బయటపడటం, మరి కొందరి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం వంటివి గతంలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. కాగా కరడుగట్టిన ఉగ్రవాదిగా భద్రతా విభాగాలు గుర్తించిన సుభాన్ ఖురేషీకి మొదట సిమితో సంబంధాలు ఉండటం అటు తర్వాత అవి వివిధ ఉగ్రవాద సంస్థల కార్యకలాపాల వైపునకు ఆకర్షితం కావడం జరిగిందని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. ఢిల్లీ, ముంబయి, బెంగళూరులలో జరిగిన పేలుళ్లతో ఇతనికి సంబంధాలు తేలడంతో మిగతా రాష్ట్రాల నిఘా విభాగాలు కూడా అప్రమత్తం అయ్యాయి. లుంబిని, గోకుల్‌చాట్, దిల్‌షుక్‌నగర్ ట్విన్ బ్లాస్ట్‌ల కారకులుగా తేలిన ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన రియాజ్‌భత్కల్, ఇక్బాల్ భత్కల్ ల వెనుక సుభాన్ ఖురేషీ మాస్టర్ మైండ్ అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అయితే దీనికి సంబంధించిన ఆధారాలు ఇంకా లభించాల్సి ఉందని రాష్ట్ర కౌంటర్ ఇంటె లిజెన్స్ అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని నిర్ధారించు కోవడానికి ఢిల్లీకి ఒక ప్రత్యేక బృందం సీఐ సెల్ తరపున వెళ్లనుందని తెలిసింది. కాగా సుభాన్‌ఖురేషీకి హైదరాబాద్‌లో మూలాలు ఉన్నాయా అనేది ఇంకా స్పష్టం కాలేదని అధికారులు తెలిపారు.

ప్రజాస్వామ్య మనుగడకు.. నిష్పాక్షిక, స్వతంత్ర న్యాయ వ్యవస్థ అవసరం

- జస్టిస్ చలమేశ్వర్

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యం మనుగడ కోసం నిష్పాక్షిక, స్వతంత్ర న్యాయ వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. దేశంలోని ఉన్నత న్యాయస్థానం(సుప్రీంకోర్టు)లో పేరుకుపోతున్న కేసుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేండ్లుగా కేసుల సంఖ్య పెరగడం వల్ల సత్వర న్యాయం అందించడంలో తీవ్ర ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నట్టు ఆయన తెలిపారు. బ్యాక్‌లాగ్ కేసుల్ని పరిష్కరించడం తమ జీవితకాలంలో సాధ్యం కాదని ఆయన అన్నారు. సమస్య వాస్తవం, సంస్థ మనుగడ సాధించినపుడు తప్పనిసరిగా పరిష్కరించాల్సిందేనని ఆయన అన్నారు. సుప్రీంకోర్టులో 55,000కు పైగా పెండింగ్ కేసులున్న విషయాన్ని చలమేశ్వర్ గుర్తు చేశారు. 'సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా, ది బిగినింగ్' అనే పుస్తకావిష్కరణ సందర్భంగా జస్టిస్ చలమేశ్వర్ ప్రసంగించారు.



పుస్తకావిష్కరణలో జస్టిస్ చలమేశ్వర్

దేశ జనాభాలోని ఆరో వంతుమంది తమ కేసుల కోసం కోర్టుల్లో పోరాడుతున్నారని జస్టిస్ చలమేశ్వర్ తెలిపారు. అత్యున్నత కోర్టు ఇచ్చే ఆదేశాలు దేశ ప్రజలను ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు.

సుప్రీంకోర్టు సాధించిన ఫలితాలు, వైఫల్యాలపై సమగ్ర విశ్లేషణ ద్వారా పనితీరు మెరుగుపడుతుందని చలమేశ్వర్ అన్నారు. అయితే, న్యాయస్థానంలో భాగస్వాములుగా ఉండేవారికి అంత సమయం దొరకదని ఆయన అన్నారు. కేసుల కేటాయింపు విషయంలో ప్రధాన న్యాయమూర్తితో తమ వివాదం పరిష్కారమైనట్టేనా అని విలేకరులు ప్రశ్నించగా చలమేశ్వర్ చేతులు జోడించి వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేతలు సల్మాన్‌ఖుర్షీద్, జైరామ్ రమేశ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ హాజరయ్యారు. చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులను ప్రశాంత్‌భూషణ్ సమర్థించిన విషయం తెలిసిందే.

త్వరలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

ప్రభుత్వ సలహాదారు వివేక్

- సత్ఫలితాలిచ్చిన కేటీఆర్ విదేశీ పర్యటన



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్వరలోనే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రానున్నాయని ప్రభుత్వ సలహాదారు వివేక్ తెలిపారు. కేటీఆర్ విదేశీ పర్యటన సత్ఫలితాలిస్తున్నదని చెప్పారు. సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. జపాన్, దక్షిణ కొరియా, దావోస్‌లో పర్యటనకు వెళ్లిన కేటీఆర్ అక్కడి పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాధినేతలతో సమావేశమయ్యారని చెప్పారు. టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి దక్షిణ కొరియా పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపారన్నారు. అదేవిధంగా ఫార్మసీ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి జపాన్ పారిశ్రామికవేత్తలు త్వరలోనే రాష్ట్రంలో పర్యటించనున్నారని చెప్పారు. విద్యకు సంబంధించి దక్షిణ కొరియా, తెలంగాణ రాష్ట్రం పరస్పర సహకారం అందిపుచ్చుకునేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. దక్షిణ కొరియాలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులను ఆ దేశంలో ఉద్యోగం కల్పించేందుకు కూడా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. జపాన్‌లోని ఫార్మసీ రంగానికి చెందిన బహుళజాతి సంస్థ భారతదేశంలో రూ.350 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిరంతర విద్యుత్, నీటి సదుపాయాలు, టీఎస్ఐపాస్ గురించి ఆ కంపెనీ ప్రతినిధులకు వివరించామని, తెలంగాణలో ఫార్మసీ రంగానికి చెందిన పరిశ్రమను స్థాపించడానికి ఆసక్తి చూపారన్నారు. టోక్యోలో రెండు అగ్రిమెంట్లపై మంత్రి కేటీఆర్ సంతకాలు చేశారన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో ఫ్యాషన్ టెక్నాలజీ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వచ్చే నెలలో ఆ కంపెనీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటించనున్నట్టు తెలిపారు.

వీహెచ్‌కు వయస్సు దాటింది

కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి హనుమంతరావుకు వయస్సు అయిపోయినందునే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని వివేక్ విమర్శించారు. ఆయనకు లోధా కమిటీ సిఫారసులే తెలియవన్నారు. అజారుద్దీన్ క్రికెట్ ఆటలో ఎంతో సంపాదించాడని, ఆయన క్రికెట్ కోసం ఎంతో కొంత చేస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. స్పాన్సర్‌షిప్ అంటే తెలియని వారు కూడా విమర్శలు చేయడం సరికాదన్నారు. మ్యాచ్ ఫిక్సింగ్‌లో కోర్టు తనకు క్లీన్ చిట్ ఇచ్చిందన్న అజార్, ఇతరులకు కోర్టు క్లీన్ చిట్ ఇస్తే ఎందుకు పట్టించుకోలేదని వివేక్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డితో పాటు పారిశ్రామిక రంగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

అన్యాయం చేస్తే ఊరుకోబోం...

- నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం వీడాలి: మంత్రి సమావేశం వద్ద 'గౌరవెల్లి' బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు

నవతెలంగాణ-హుస్నాబాద్

'సర్కార్ మమ్మల్ని మోసం చేస్తున్నది. మాకు అన్యాయం చేస్తే ఊరుకోబోం. ఏండ్ల నుంచి దీక్షలు చేస్తున్నా పట్టించుకోరా?..సర్కార్ వైఖరి మారాలి. మాకు న్యాయం జరిగేంత వరకూ పోరాడుతూనే ఉంటం' అని సిద్దిపేట జిల్లా గౌరవెల్లి భూ నిర్వాసితులు తేల్చి చెప్పారు. సోమవారం హుస్నాబాద్ మండలం గౌరవెల్లి ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసేందుకు భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వచ్చారు. విషయం తెలుసుకున్న నిర్వాసితులు ఆయన్ను అడ్డుకునే యత్నం చేశారు. నిర్వాసితులు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మంత్రి సమావేశం నిర్వహించే ప్రాంతంలో వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని గుడాటిపల్లి గ్రామంలో ఏండ్ల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. భూ సేకరణ చేసేటప్పుడు అన్ని విధాలా ఆదుకుంటామని, సరైన పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం మాటిచ్చిందని గుర్తుచేశారు. కానీ నేటి వరకూ భూమి, ఇండ్లకు సరైన పరిహారం చెల్లించలేదన్నారు. ఇన్నాండ్లూ సీలింగ్ భూములు దున్నుకుని బతికిన రైతులకు పరిహారం రాక, ఉన్న ఉపాధి పోయి దిక్కుతోచని స్థితిలో పడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటిసారి భూమి సేకరించిన వారికే సరైన న్యాయం చేయకుండా ప్రాజెక్టు ఎత్తుపెంచి రెండోసారి భూసేకరణ చేయడం సరికాదన్నారు. పరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన మంత్రి హరీశ్ రావు 'మీ సమస్యల పరిష్కారం కోసం మరోసారి చర్చిస్తాం. నిర్వాసితులకు న్యాయం చేసేలా చేస్తాం' అంటూ వెళ్లిపోయారు. మంత్రి వెంట కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఒడి తెల సతీశ్‌కుమార్, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

మహిళల పట్ల చిన్నచూపు

- కార్యకర్తల జోలికొస్తే సహించబోం: రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



నవతెలంగాణ-ఖమ్మం

టీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూస్తోందని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి అన్నారు. సోమవారం ఖమ్మంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు దిరిశాల భద్రయ్య అధ్యక్షతన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఏ కాంగ్రెస్ కార్యకర్తకు అన్యాయం జరిగినా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. అధికారం ఉంది కదా అని తమ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి గ్రామగ్రామాన తిరుగుతానని చెప్పారు. దేశం, రాష్ట్రంలో ఎన్నికల రణభేరి మోగిందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై నిందలు వేయడం దారుణమన్నారు. రానున్న బడ్జెట్ సినిమా ట్రైలర్‌గా కాకుండా ప్రజలకు ఆమోదయోగ్యమైనదిగా ఉండేలా ప్రవేశ పెట్టాలని కోరారు. భవిష్యత్‌లో జిల్లాలో ఏ కార్యక్రమం నిర్వహించినా తాను తప్పకుండా హాజరవుతానని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మానుకొండ రాధాకిషోర్, దిరిశాల భద్రయ్య నాగండ్ల దీపక్‌చౌదరి, వడ్డేబోయిన శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూతురుతో కలిసి తల్లి ఆత్మహత్య

- చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన
- కూతురు శాన్వీకి అంగవైకల్యముందని ఇంట్లో నిత్యం గొడవలు

నవతెలంగాణ - చందానగర్

కూతురు అంగవైకల్యంతో పుట్టడం, భర్తతో తరుచూ గొడవలు వస్తుండటంతో తట్టుకోలేక ఏడాది పాపతో ఓ తల్లి ఐదంతస్తుల బిల్డింగ్‌పై నుంచి దూకేసింది. ఈ ఘటనలో తల్లీబిడ్డలిద్దరూ చనిపోయారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...కరీంనగర్‌కు చెందిన స్వాతికి, మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సందీప్‌కు ఆరేండ్ల కింద పెండ్లయింది. వారికి కొడుకు ఆరుష్‌రాం, కూతురు శాన్వీ (1) ఉన్నారు. శాన్వీ పుట్టుకతోనే కొద్దిపాటి అంగవైకల్యం, అనారోగ్యంతో జన్మించింది. కూతురు ఆరోగ్య విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు అవుతుండేవి. ఇదిలా ఉండగా పండగ నిమిత్తం స్వాతి తన పిల్లలతో సొంతూరుకు వెళ్లింది. రెండ్రోజుల కింద తిరిగి తాను నివాసముండే సాయిపెరల్ రెసిడెన్సీకి వచ్చింది. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి భోజనం చేసి పిల్లలతో కలిసి నిద్రకు ఉపక్రమించారు. స్వాతి ఉన్నట్టుండి సోమవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌పై (ఐదంతస్తులు) నుంచి కూతురు శాన్వీని పట్టుకుని కిందకు దూకేసింది. దీంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. భర్త సందీప్, స్థానికులు చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌పై రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలి : భట్టి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం అవినీతిపై రాష్ట్రపతి కోవింద్‌ను కలుస్తామని టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గవర్నర్‌కు తాము వేసిన ప్రశ్నలకు మాత్రం మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పకుండా...మిగతా అంశాలు మాట్లాడారని విమర్శించారు. నీచ రాజకీయాలు ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసన్నారు. గవర్నర్‌పై కాగితాలు చించి విసిరేసిన సంగతిని ఆయన ప్రస్తావించారు. పరిధిదాటి నీలాగా వెకిలి మాటలు మాట్లాడలేదన్నారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా.. గవర్నర్‌కు క్షమాపణ చెప్పాలంటూ హరీశ్ మాట్లాడడాన్ని ఆయన తప్పు పట్టారు. అవినీతి ప్రాజెక్టు పనులను ప్రశంసించి గవర్నర్ నరసింహన్ తన పదవికి గౌరవాన్ని దిగజార్చారని అన్నారు. అవినీతిపై ప్రశంసలు కురిపించిన గవర్నర్‌పై రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సిరియాపై టర్కీ దురాక్రమణ



డమాస్కస్: టర్కీ భద్రతా బలగాలు సిరియాపై దాడులకు పాల్పడుతున్నాయి. ఉత్తర సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారులను పారదోలేందుకు ఈ చర్యలు చేపట్టినట్టు టర్కీ బుకాయిస్తోంది. ఇప్పుడిప్పుడే శాంతియుత వాతావరణంలోకి అడుగుపెడుతున్న సిరియాలో మరోసారి అలజడి సృష్టిస్తోంది. సిరియా అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చుతూ పరోక్షంగా టర్కీ కయ్యానికి కాలుదువ్వుతోంది. ఈపరిణామాలను వీక్షిస్తున్న అమెరికా ఇదే అదనుగా చూసుకొని సిరియా అంతర్గత భద్రతా వ్యవహారాల్లో కలగజేసుకోవాలని భావిస్తోంది. సిరియన్ల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కల్గించకుండా కుర్దు తిరుగుబాటుదారుల స్థావరాలపై దాడులు నిర్వహించాలని టర్కీ సైనికాధికారులకు సలహాలు ఇస్తున్నది. సిరియాలో 2011 నుంచి యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఉగ్రవాదం శృతిమించడంతో ప్రజలు భీతిల్లుతున్నారు. లక్షలాది మంది ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా తరలివెళ్లారు. వెలాది మంది అంతర్యుద్ధంలో మృతి చెందారు. ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసేందుకు కుర్దు తిరుగుబాటుదారులు కొంతకాలంగా శ్రమిస్తున్నారు.

ప్రజలకు అభయ హస్తం ఇస్తున్నారు. కుర్దు తిరుగుబాటుదారులపై టర్కీ ప్రభుత్వం ఉగ్రవాద ముద్ర వేసింది. కుర్దు తిరుగుబాటుదారులు కూడా మిలిటెంట్ల కోవ కిందికే వస్తారని ప్రకటించింది. సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారులను అంతంచేస్తామని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రకటించారు. వారి ఏరివేత పూర్తయే వరకు తమ ఆపరేషన్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ విరమించబోమని అన్నారు. అయితే, సిరియా అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడమే కాకుండా ఉత్తర సిరియాలోని పలు ప్రాంతాలపై పాగా వేసేందుకు టర్కీ ప్రయత్నిస్తున్నది. సిరియా సరిహద్దులోని ఆఫ్రిన్ నగరంపై టర్కీ బలగాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. తూటాలు, ఫిరంగుల చప్పుళ్లతో ఈ ప్రాంతం దద్దరిల్లుతున్నది. కుర్దు తిరుగుబాటుదారులకు, టర్కీ బలగాలకు మధ్య జరుగుతున్న ఎదురుకాల్పుల కారణంగా స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రాణ భయంతో ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. అయితే, తమ మిత్రదేశంలోకి ఎలాంటి అనుమతి లేకుండా టర్కీ ప్రవేశించడం పట్ల రష్యా కన్నెర్ర చేసింది. సిరియాకు బాసటగా నిలవనున్నట్టు తెలిపింది. ఈనేపథ్యంలో ఐరాస భద్రతామండలి అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నది.

టర్కీ కారణంగా సిరియాలో చెలరేగిన అశాంతియుత వాతావరణాన్ని నివారించాలని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్ వేస్ లి డ్రాయన్ కోరారు. 'ప్రస్తుత సిరియా పరిస్థితులపై ఫ్రాన్స్ తీవ్రంగా ఆందోళన చెందుతోంది. అందుకే మేం భద్రతామండలి అత్యవసర సమావేశం జరగాలని కోరుతున్నాం. పరిస్థితులు బాగా దిగజారాయి. వీలైనంత త్వరగా యుద్ధ విరమణ కోసం ప్రయత్నించాలి" అని ఆయన అన్నారు. మరోవైపు, టర్కీ సైనిక చొరబాటును వైజీపీ మిలీషియా తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఈ ఎదురుదాడిలో నలుగురు టర్కీ సైనికులు మృతి చెందారు. అయితే, టర్కీ మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. ఆదివారం జరిగిన వైమానిక దాడుల్లో ఎనిమిది మంది సాధారణ పౌరులు మరణించారని కూడా కుర్దు కమాండర్స్ తెలిపారు.

టర్కీ సైనిక చర్యకు కారణాలేంటి?

సిరియాలో పెట్రేగిపోయిన ఐఎస్‌ను దెబ్బ తీయడం కోసం అమెరికా కుర్దు తిరుగుబాటుదారుల అనుబంధ సంస్థ అయిన వైపీజీకి మద్దతిస్తోంది.నిషేధిత కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ (పీకేకే)తో ఈ గ్రూపులకు సంబంధాలున్నాయని టర్కీ అభిప్రాయం.

ఐఎస్‌ని నిరోధించేందుకు అమెరికా సిరియన్ డెమోక్రటిక్ ఫోర్స్ (ఎస్‌డీఎఫ్)తో కలిసి సరిహద్దు రక్షణ దళాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం పట్ల కూడా టర్కీ ఆగ్రహం వెలిబుచ్చింది. టర్కీ అధ్యక్షుడు దీనిని 'టెర్రర్ ఆర్మీ' అని అభివర్ణించారు

మరోవైపు, 1980వ దశకం నుంచి టర్కీ తమపై యుద్ధం సాగిస్తూ తమ సాంస్కృతిక గుర్తింపును నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందని కుర్దు తిరుగుబాటుదారులు విమర్శిస్తున్నారు.టర్కీ, సిరియాలు రెండూ సంయమనంతో వ్యవహరించాలని ఫ్రాన్స్ కోరుతున్నది. టర్కీ సైనిక చర్య పట్ల రష్యా కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మరో సిరియా మిత్రదేశమైన ఇరాన్ కూడా టర్కీ సైనిక చర్యను త్వరగా ముగించాలని డిమాండ్ చేసింది.

టర్కీ ఆక్రమణలో ఉత్తర సిరియాలోని ప్రాంతాలు..

ఉత్తర సిరియాలోని ప్రాంతాలను ఆక్రమించుకున్నట్టు టర్కీ సైనికాధికారులు తెలిపారు. ఆఫ్రిన్‌లోని షాంకల్, ఖోర్న్, బాలి, అదా మాన్లి, కిటా, కోర్డో, బిబ్నో ప్రాంతాలు తమ ఆధీనంలోకి వచ్చినట్టు ప్రకటించారు. సిరియాలోని సామాన్య పౌరులపై తాము దాడులు నిర్వహించబోమని అన్నారు. కుర్దు తిరుగుబాటులే తమ లక్ష్యమని అన్నారు. వైపీజీ తిరుగుబాటుదారులకు చెందిన స్థావరాలపై దాడులకు పాల్పడినట్టు సైనికాధికారులు తెలిపారు. టర్కీ బలగాల దాడులను వైపీజీ తిరుగుబాటుదారులు తిప్పిగొడుతున్నారని సిరియాలోని హక్కుల పర్యవేక్షణ సంస్థ ప్రకటించింది. ఆఫ్రిన్‌లో సిరియా బలగాలు నిర్వహిస్తున్న దాడుల కారణంగా 18 మంది మృతిచెందినట్టు ఆ సంస్థ ధ్రువీకరించింది. ఇదిలా ఉండగా, సిరియాలో టర్కీ నిర్వహిస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని సిరియా అధ్యక్షుడు అస్సద్ డిమాండ్ చేశారు. ఆఫ్రిన్ గగనతలంలో టర్కీ యుద్ధవిమానాలు కనిపిస్తే కూల్చేస్తామని హెచ్చరించారు.

సిరియా అంతర్గత వ్యవహారాల్లో టర్కీ జోక్యం తగదన్నారు. సిరియాలో ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్న తిరుగుబాటుదారులపై దాడులు నిర్వహించడం తగదన్నారు. సిరియాలో ఉగ్రసంస్థలు పుంజుకోవాలనే దురుద్దేశంతో టర్కీ మారణహోమాన్ని సృష్టిస్తోందని అన్నారు. సిరియాలో శాంతి స్థాపన జరగాలంటే టర్కీ తక్షణమే తమ బలగాలను ఉపసంహరించుకోవాలని రష్యా డిమాండ్ చేసింది.


థాయ్‌లాండ్ మార్కెట్‌లో పేలుడు

- **ముగ్గురు మృతి, 22 మందికి గాయాలు**

బ్యాంకాక్ : థాయ్‌లాండ్ మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈఘటనలో ముగ్గురు పౌరులు మృతి చెందగా, 22 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మోటార్‌సైకిల్ బాంబు పేలడంతో పరిసర ప్రాంతాలన్నీ దద్దరిల్లాయని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు చనిపోయారని అన్నారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్టు అంతర్గత భద్రత ఆపరేషన్ కమాండ్ పేర్కొన్నది. కాగా, ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు.

ప్రచ్ఛన్న యుద్ధం కాలంలోనూ ఇలాంటి పరిణామాలు చూడలేదు

- **రష్యా ఫోబియాపై లావ్‌రోవ్ వ్యాఖ్య**



మాస్కో : పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న విధానాలను ప్రచ్ఛన్న యుద్ధం కాలంలోనూ తాను చూడలేదని రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్ తెలిపారు. పలు పశ్చిమ దేశాలు 'రష్యా ఫోబియా' అంటూ దుష్ప్రచారానికి దిగాయని అన్నారు. సోమవారం లావ్‌రోవ్ మీడియాతో మాట్లాడారు. 'తాజాగా నెలకొన్న రష్యా ఫోబియా గతంలో ఎన్నడూ లేనిది. కనీసం ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో కూడా ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొనలేదు' అని ఆయన పేర్కొన్నారు. న్యూయార్క్‌లో పర్యటన అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయన ఓ రష్యా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పై వ్యాఖ్యలు చేశారు. గతంలో కనీసం కొన్ని నిబంధనలు ఉండేవి, కొంత మర్యాద, గౌరవం ఉండేది, కానీ ఇప్పుడు అవన్నీ పక్కకు నెట్టేశారు.' అని అన్నారు. తమపై అమెరికా, యురోపియన్ యూనియన్ విధించిన ఆంక్షలు అర్థం రహితమైనవని, నిరాధారమైనవని ఆయన పేర్కొన్నారు.

దక్షిణ కొరియా తీరంలో పడవ మునక

- **ముగ్గురు మృతి**

సియోల్ : దక్షిణ కొరియా తీరంలోని బెంగ్నియాన్ ద్వీపకల్పం సమీపంలో పడవ మునిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. నావికాదళ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...చైనా నుంచి దక్షిణ కొరియాకు వస్తున్న పడవ మునిగిపోయిందన్నారు. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారని అన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

జెరూసలేమ్‌కు అమెరికా దౌత్యకార్యాలయం

- **యూఎస్ ఉపాధ్యక్షుడు**

వాషింగ్టన్ : అమెరికా రాయబారి కార్యాలయాన్ని వచ్చేఏడాది జెరూసలేమ్‌కు తరలించనున్నట్టు యూఎస్ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ స్పష్టం చేశారు. జెరూసలేమ్ పర్యటనలో ఉన్న పెన్స్ పై వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలేమ్‌ని గుర్తించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతనెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా, ఇజ్రాయిల్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాన్ని జెరూసలేమ్‌కు తరలించనున్నట్టు ప్రకటించారు. ట్రంప్ రగిల్చిన చిచ్చుతో మధ్య ప్రాచ్య దేశాల్లో అలజడి మొదలైంది. ఈ నేపథ్యంలో వెస్ట్‌బ్యాంక్ అల్లర్లతో అట్టుడికింది. రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో అనేక మంది మృతి చెందారు. ట్రంప్ నిర్ణయాన్ని జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఈయూ విదేశాంగ విధానాల చీఫ్ ఫెడెరికా మోఘెరినీ తప్పుపట్టారు.

మెక్సికోలో మరణమృదంగం

- **గతేడాది 29,168 హత్యలు : హోంశాఖ**



మెక్సికో సిటీ : మెక్సికోలో హత్యల సంఖ్య పెరిగిపోవడం పట్ల ఇక్కడి హోంశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. హత్యలను అరికట్టడంలో విఫలమైందని అంగీకరించింది. హత్యల నివారణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపింది. దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా మెక్సికోలో నరమేథం చోటు చేసుకుందని తెలిపింది. 2017లో 29,168 హత్యలు చోటు చేసుకున్నాయని, ఇది 2016కన్నా 27శాతం ఎక్కువ అని పేర్కొంది. 1997 నుండి ఇందుకు సంబంధించిన రికార్డులన్నీ ఉన్నాయని, వాటితో పోల్చుకుంటే ఇదే అత్యధికమని పేర్కొంది. 2011లో మెక్సికోలో మాదకద్రవ్యాల పోరు సాగినప్పుడు కూడా రికార్డు స్థాయిలో హత్యలు జరిగాయని తెలిపింది. 2017లో ప్రతి లక్షమందికీ మృతుల రేటు 20.5శాతంగా ఉండగా, 2011లో 19.4శాతంగా ఉందని హోంశాఖ పేర్కొంది. కాగా, హోంశాఖ అధికారులు వెలువరించిన దాని కన్నా హత్యల రేటు ఎక్కువగానే ఉండవచ్చునని మెక్సికో భద్రతా వ్యవహారాల నిపుణుడు అలెజాండ్రో అభిప్రాయపడ్డారు.

అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్



వాషింగ్టన్: అమెరికాలో పరిపాలనా వ్యవస్థ స్తంభించిన విషయం తెలిసిందే. ఈ షట్‌డౌన్ సోమవారానికి మూడో రోజుకు చేరింది. డెమోక్రట్లతో ఆదివారం జరిగిన చర్చలు సఫలీకృతం కాక పోవడంతో షట్‌డౌన్ కొనసాగుతోంది. తాజా ద్రవ్య వినిమయ బిల్లులో డ్రీమర్స్ భద్రత కోసం ఎలాంటి ప్రతిపాదనలు లేవని డెమోక్రట్లు వ్యతిరేకించడంతో బిల్లు సెనేట్‌లో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికా ప్రభుత్వం మూతపడింది. అత్యవసర సేవలు మినహా మిగతా ప్రభుత్వ కార్యకలాపాలన్నీ స్తంభించాయి. ఫిబ్రవరి 8వ తేదీ వరకు ప్రభుత్వానికి తాత్కాలిక నిధులు సమకూర్చడం కోసం సెనేట్ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఓటింగ్ నిర్వహించనుంది. ఇది ఆమోదం పొందితే వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులు విధుల్లో చేరగలిగే అవకాశం ఉంటుంది. అయితే ఈ ఓటింగ్‌కు డెమోక్రాట్లు మద్దతిస్తారా లేదా అనే అంశంపై స్పష్టత కొరవడింది.

అంత తొందరెందుకు..!

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై పునరాలోచన

పక్కన పెట్టేసిన ముఖ్యమంత్రి కేసీఆర్

- ఆశావహుల్లో మాత్రం ఇంకా ఆశలు
- బడ్జెట్ సమావేశాల తర్వాత పరిశీలించే అవకాశం
- ఎమ్మెల్యేలందరినీ నియోజకవర్గాల్లోనే ఉండాలని ఆదేశం
- సిట్టింగులందరికీ టికెట్టు ఇస్తామని చెప్పినట్టు వెల్లడి
- కేంద్రం నుంచి నియోజకవర్గాల పెంపు ఉంటుందని సంకేతాలు
- గవర్నర్, చంద్రబాబు ద్వారా కేసీఆర్‌కు సమాచారం



(ఫైల్)

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి కేసీఆర్ పునరాలోచనలో పడ్డారు. నెలకో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ, సాఫీగా ప్రభుత్వం సాగుతున్న తరుణంలో మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు చేపట్టి ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకని, దానికి ప్రస్తుతం ముఖ్యమంత్రి స్వస్తి చెప్పినట్టు తెలిసింది. అన్నీ బాగుంటే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని అధికారపార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. మంత్రివర్గంలో చేరేందుకు ఆశలు పెట్టుకున్న ఆశావహులు మాత్రం తమ కోరికను చంపుకోలేకపోతున్నారు. పునర్వ్యవస్థీకరణ తప్పకుండా ఉంటుందని ఆశాభావంతో ఉన్నారు.

మంత్రివర్గంలో కొత్తవారిని చేర్చుకునే అవకాశాలు లేవు. ఉన్నవారిలో కొంతమందిని తీసేసి ఆ స్థానంలో కొత్తవారికి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలోనే మంత్రివర్గంలో చోటు దక్కలేదని కొప్పుల ఈశ్వర్, స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, కొండా సురేఖ లాంటివారు అసంతృప్తికి గురయ్యారు. వారిలో స్వామిగౌడ్‌కు శాసనమండలి చైర్మెన్‌గానూ, మధుసూదనాచారికి అసెంబ్లీ స్పీకర్‌గానూ నియమించిన విషయం తెలిసిందే. శ్రీనివాస్‌గౌడ్, మరికొందరికి పార్లమెంటరీ సెక్రెటరీలుగా నియమించినా, ఆ తర్వాత హైకోర్టు తీర్పుతో వారి పదవులు పోయాయి. టీడీపీ నుంచి వచ్చిన తలసాని శ్రీనివాస్‌యాదవ్, తుమ్మల నాగేశ్వరరావులకు మంత్రివర్గంలో చోటు దక్కిన విషయం విదితమే. రాజయ్యను తప్పించి కడియం శ్రీహరిని మంత్రివర్గంలో తీసుకోవడం చర్చనీయాంశమైంది. కొప్పుల ఈశ్వర్‌కు ప్రభుత్వచీఫ్‌విప్‌గా నియమించినా ఆయన అసంతృప్తిగానే ఉన్నారు. ఇతర పార్టీల నుండి వచ్చిన గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, టీఆర్ఎస్ నేత నిరంజన్‌రెడ్డిలకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని వారికి కేసీఆర్ హామీ ఇచ్చారని ప్రచారం జరిగింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో నాయిని నర్సింహారెడ్డి, చందూలాల్, లక్ష్మారెడ్డి, పద్మారావుగౌడ్, కడియం శ్రీహరి వంటి వారిని తప్పించి కొత్తవారిని తీసుకునే అవకాశాలు ఉన్నాయని ఎప్పట్నుంచో ప్రచారం జరుగుతున్నది. విలేకరుల సమావేశం పెట్టినప్పుడల్లా..క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ ఎప్పుడు ఉంటుంది అని ముఖ్యమంత్రిని ప్రశ్నించినప్పుడు' నేను ఎప్పుడు చెప్పలేదు..మీరే రాసుకుంటున్నారు' అని చెబుతుండేవారు. అయితే ఉండదు అని మాత్రం చెప్పకపోవడం గమనార్హం. దీంతో ఆశావహుల్లో ఎప్పటికప్పుడు తాము మంత్రిని అయినట్టేనని ఊహించుకునేవారు. ఒకరిద్దరు అయితే అయినప్పుడు చూద్దాంలే అని తప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు టీఆర్ఎస్‌పార్టీలో దుమారం రేపాయి. మంత్రివర్గంలో బయటివారికి చోటు దక్కుతుందని, వారిదే పెత్తనం సాగుతున్నదని మాట్లాడడంతో సీఎం కేసీఆర్ పునరాలోచనలో పడి ఉంటారని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

అసలుకే నియోజకవర్గాల పెంపు లేకపోవడం, కొంతమంది ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉన్న సమయంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడితే, మొదటికే మోసం వస్తుందన్న భయంతోనే కేసీఆర్ వెనక్కి తగ్గి ఉంటారని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు. కేసీఆర్ చెప్పకుండా మరొకరు నిర్ణయం తీసుకునే అవకాశం లేదనీ, మార్పులు చేర్పులు ఎప్పుడు ఉంటాయన్నది ఆయనే నిర్ణయిస్తారని తెలిపారు. అయితే ఇంతటితో అయి పోయిందని అనుకోవాల్సిన అవసరం లేదని, ఇప్పుడు కాకపోతే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత ఉండొచ్చు కదా అని అనుమానం వ్యక్తం చేశారు. నాయకుడు అనేవాడు 'ఇక ఉండదు' అని చెప్పరు, చివరిదాకా ఆశలు కల్పిస్తూనే ఉంటారు అని మరో నాయకుడు తెలిపారు.

సిట్టింగులందరికీ భరోసా..

సిట్టింగు ఎమ్మెల్యేలందరికీ సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చినట్టు తెలిసింది. 2019 ఎన్నికల్లో అందరికీ టికెట్టు ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నియోజకవర్గాల్లోనే ఉండాలని చెప్పినట్టు తెలుస్తోంది. అయితే నియోజకవర్గాలు పెంపు ఉంటుందని సంకేతాలు రావడంతో కేసీఆర్ తమ పార్టీ ఎమ్మెల్యేలకు పైవిధంగా హామీ ఇచ్చినట్టు సమాచారం. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోడీతో ఏపీ సీఎం చంద్రబాబు సమావేశమైన సందర్భంలో నియోజకవర్గాల పెంపుపై హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇదే విషయాన్ని చంద్రబాబు కేసీఆర్‌కు చెప్పినట్టు తెలుస్తోంది. వారి మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్టు కూడా చెబుతున్నారు. ఢిల్లీ వెళ్లి వచ్చిన గవర్నర్ నరసింహన్ నియోజకవర్గాల పెంపుపై సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. దీంతో గవర్నర్ ఇచ్చిన హామీతోనే కేసీఆర్ తమ పార్టీ సిట్టింగులందరికీ భరోసా ఇచ్చారని అధికారపార్టీలో చర్చ జరుగుతున్నది. దీంతో సిట్టింగులతో పాటు ఇటీవల చేరిన వారికి కూడా 2019లో టికెట్లు వచ్చేనట్టేనన్న ఆనందంతో ఉన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే నియోజకవర్గాల పెంపు అంశం తేలుతున్నది. అందులో లేకుంటే పాత కథేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.



టీఆర్ఎస్‌కు నిర్మాణమే లేదు

- కమీషన్ల కోసమే మిషన్ కాకతీయ
- మూడు నెలల్లో కాంగ్రెస్‌లోకి పలువురు ప్రముఖులు : పోట్ల


నవతెలంగాణ–ఖమ్మం

టీఆర్ఎస్‌లో సత్తా ఉన్న నాయకుడు ఒక్కరూ లేరని, ఆ పార్టీకి అసలు నిర్మాణమే లేదని మాజీ ఎంఎల్సీ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోట్ల నాగేశ్వరరావు విమర్శించారు. మరో మూడు నెలల్లో కాంగ్రెస్‌లోకి పలువురు ప్రముఖులు చేరబోతున్నారని అన్నారు. ఖమ్మం నెహ్రూనగర్‌లోని ఆయన నివాసం నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులతో వైరారోడ్డు, బస్టాండ్, మయూరీ సెంటర్ వరకు భారీ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం సంజీవరెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షులు అయితం సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోట్ల మాట్లాడుతూ..ఇటీవల అనివార్య పరిస్థితుల్లో టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరానన్నారు. 22నెలలుగా తనను పార్టీ కార్యాలయానికే పరిమితం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో పింఛన్ పథకం తప్ప ఏ ఒక్కటీ అమలు కావట్లేదన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి పథకాలు కేవలం ఆయన కుటుంబం, ఆ పార్టీ నాయకుల కమీషన్ల కోసమే అని ఆరోపించారు. రూ.10లక్షలతో పూర్తి కావాల్సిన చెరువు మరమ్మతుల పనులు రూ.50లక్షలకుపైనే ప్రతిపాదనలు తయారు చేసి ఆ ప్రాంత ఎమ్మెల్యే, నాయకులు చెప్పిన కాంట్రాక్టర్లకు ఇచ్చి కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. తొలుత పోట్ల నాగేశ్వరరావు, పోట్ల మాధవికి కాంగ్రెస్ సభ్యత్వాన్ని జిల్లా అధ్యక్షులు ఐయితం సత్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డేబోయిన నర్సింహారావు, తాజుద్దీన్, రాందాస్ నాయక్, పంతంగి వెంకటేశ్వర్లు, బిక్షపతి రాజు, గాదె యూన్సీ, కె. ఉమాదేవి, వెల్లంకి వెంకటేశ్వర్లు, అశోక్, ఇసాక్ పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల కోసం

జర్నలిస్ట్స్ హౌజింగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు

- **కన్వీనర్‌గా దిలీప్‌రెడ్డి**



నవతెలంగాణ బ్యూరోత–హైదరాబాద్

జర్నలిస్టుల ఇండ్లస్థలాల సమస్య పరిష్కారానికి అన్ని జర్నలిస్ట్ సంఘాలు, హౌజింగ్ సొసైటీలు, ప్రెస్‌క్లబ్‌లు కలిసి సంయుక్తంగా ప్రత్యేక సమన్వయ కమిటీగా ఏర్పడ్డాయి. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్ట్ సంఘాలు, సొసైటీలు, ప్రెస్‌క్లబ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న సీనియర్ జర్నలిస్టులు, ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇందులో కోఆర్డినేషన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ కమిటీకి జర్నలిస్టుల హౌసింగ్ కో–ఆర్డినేషన్ కమిటీ(జెహెచ్‌సీసీ)గా పేరు ఖరారు చేశారు. జెహెచ్‌సీసీకి కన్వీనర్‌గా సాక్షి దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఆర్.దిలీప్ రెడ్డి ఎన్నికయ్యారు. కో–కన్వీనర్లుగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బి.రాజమౌళి చారి, జర్నలిస్ట్స్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు డి.వెంకటాచారి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, కో–ఆర్డినేటర్లుగా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, హౌజింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ హాష్మీ, మీడియా కో–ఆర్డినేటర్‌గా ఎం. సోమయ్య(టీడబ్ల్యూజేఎఫ్) లీగల్ కో–ఆర్డినేటర్‌గా సీనియర్ అడ్వకేట్ ఎస్ ఏ ఇషాఖీ, సలహాదారులుగా వార్త దినపత్రిక బ్యూరో చీఫ్ కోనేటి రంగయ్య, సీనియర్ జర్నలిస్టులు ఆర్. శైలేష్ రెడ్డి, ఎం.వేణుగోపాల్ రావు, సభ్యులుగా కె.రాములు(సీవీఆర్ ఛానల్), కె. అజిత(99 టీవీ) రెహానా(ఎన్టీవీ) ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్ మారం శ్రీనివాస్, గుడిగ రఘు (నవతెలంగాణ), ఉర్దూ జర్నలిస్ట్ ఫోరం ప్రతినిధి తాహెర్ రుమానీ, ఉర్దూ జర్నలిస్ట్ ఎండీ రియాజ్ అహ్మద్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జెహెచ్‌సీసీ కన్వీనర్‌గా ఎన్నికైన ఆర్.దిలిప్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 26న కొత్తగా ఎన్నికైన కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి న్యాయవాదిని పిలవడంతోపాటు ఇండ్లస్థలాల సమస్య పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయమై చర్చిస్తామని తెలియజేశారు.

పంచాయతీ పాలనలో కేరళ భేష్

- పరోక్ష పద్ధతిలో ఎన్నికలు సరికాదు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ–హుస్నాబాద్

గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడంలో కేరళ రాష్ట్రం భేష్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి కొనియాడారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని జీపీలను ఇక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహిస్తే క్యాంపు రాజకీయాలు, కొట్లాటలకు దారితీస్తాయని, అలాంటి ఆలోచనను విరమించుకోవాలని సీఎం కేసీఆర్‌కు సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్నారు. పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మందపవన్, కార్యవర్గ సభ్యులు పెండ్యాల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లస్థలాలు ఇప్పించండి

- **సమస్యలు సీఎంకు వినిపించండి : శాసన మండలి చైర్మెన్‌కు మాజీ సైనికుల సంక్షేమ సంఘం వినతి**

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మాజీ సైనికులకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అమ్మిక రంగయ్య గౌడ్ తెలంగాణ శాసన మండలి చైర్మెన్ కె. స్వామిగౌడ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం శాసన మండలి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగయ్యగౌడ్ మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమ సంఘానికి అప్పటి ప్రభుత్వం 2001లో ఇండ్ల స్థలాల కోసం 46 ఎకరాల 12 కుంటల భూమి కేటాయించిందన్నారు. కానీ ఇంత వరకు పట్టాలివ్వలేదని చెప్పారు. రెవెన్యూ శాఖ మంత్రి మహమూద్ ఆలీ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి కలెక్టర్‌తో సర్వే చేయించారని అన్నారు. త్వరలో ఇండ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు గానీ ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారం అయ్యే విధంగా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోవాలని కోరారు. అంతేకాకుండా తమ సంఘం సభ్యులు 425 మంది టీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారని ఇంత వరకు సభ్యత్వ కార్డులు కూడా జారీ చేయలేదన్నారు.

నవచిత్రం

బాధ్యతగా సేవ చేస్తాను

- ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధాన చైర్మెన్ మోహన్‌బాబు



శివాజీరాజా, మోహన్‌బాబు, పరుచూరి వెంకటేశ్వరావు, ఏడిద శ్రీరాం తదితరులు

'నేనెప్పుడూ దేవాలయ చైర్మెన్ అవ్వాలనుకోలేదు. సినిమాలు, నా సంస్థలను చూసుకోవడంలో చాలా బిజీగా ఉన్నాను. చైర్మెన్‌గా అదనపు బాధ్యత ఎందుకనుకున్నా. కానీ టి.సుబ్బరామిరెడ్డి వంటి పలువురి వల్ల ఫిల్మ్ నగర్ దైవ సన్నిధాన చైర్మెన్ పదవీ బాధ్యతలు చేపట్టాను' అని మోహన్‌బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ దైవ సన్నిదానం చైర్మెన్‌గా శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి ఆధ్వర్యంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు 12 మంది పాలక మండలి కొత్త సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వారిలో గిరిబాబు, పరుచూరిగోపాలకృష్ణ, కృష్ణంరాజు సతీమణి శ్యామల, చిరంజీవి సతీమణి సురేఖ, కోమటిరెడ్డి లక్ష్మి, లక్ష్మి, చాముండేశ్వరినాథ్, వి.రామ్‌ప్రసాద్, రఘురామకృష్ణ ఉన్నారు. కార్యదర్శిగా కాజా సూర్యనారాయణ కొనసాగుతున్నారు.

ఈ సందర్భంగా శ్రీ స్వరూపానందేంద్ర స్వామి మాట్లాడుతూ, 'దైవ భక్తి, ఆధ్యాత్మిక చింతన బాగా ఉన్న మోహన్‌బాబు చైర్మెన్‌గా పదవి చేపట్టడం ఆనందంగా ఉంది. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడే మోహన్‌బాబును ముక్కోపి, అహంకారి అనుకుంటారు. కానీ ఆయన మనసు వెన్నెపూస' అని అన్నారు. 'స్వరూపానందేంద్ర స్వామిని సుబ్బరామిరెడ్డి ద్వారా నేను, రజనీకాంత్ ఓసారి కలిశాం. ఆయన రావడం ఆనందంగా ఉంది. ఆడపడుచులు పూజ చేస్తే మంచిదంటారు. నాతోపాటు సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన అందరికీ అభినందనలు. మురళీమోహన్ మాకు విలువైన సలహాలు ఇవ్వాలని కోరుకుంటున్నా. దేవాలయాన్ని పరిశుభ్రంగా ఉంచటం ప్రధమ కర్తవ్యం. అందుకు మొదటి ప్రయత్నంగా డ్రైనేజ్, బాత్‌రూమ్స్ వంటి ఇతర పనులు చేయించబోతున్నాం. ఎలాంటి అవక తవకలకు తావులేకుండా చైర్మెన్‌గా నా వంతు సేవ చేస్తాను' అని తెలిపారు. ఈ సందర్భంగా 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా లక్షా 516 రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కె.రాఘవేంద్ర రావు, పరచూరి వెంకటేశ్వరరావుతోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొని మోహన్‌బాబుకు అభినందనలు తెలిపారు.

పవర్‌ఫుల్ ఫస్ట్‌లుక్..



సాయి ధరమ్‌తేజ్

సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తయ్యింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఫుల్ యాక్షన్, ఎంటర్‌టైనర్ చిత్రమిది. వినాయక్ మార్క్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. సాయి ధరమ్ తేజ్‌ను మాస్ హీరోగా మరో స్టెప్ ఎక్కించే చిత్రమవుతుంది. సాయిధరమ్‌తేజ్ పెర్‌ఫార్మెన్స్, వినాయక్ టేకింగ్ హైలైట్‌గా ఈ చిత్రం రూపొందింది. సాయిధరమ్, వినాయక్ కెరీర్‌లో 'ఇంటిలిజెంట్' మరో బిగ్గెస్ట్ హిట్ మూవీ అవుతుంది. అలాగే మా బ్యానర్‌లో మరో కమర్షియల్ హిట్ సినిమాగా నిలుస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.

నా హృదయానికి దగ్గరైన సినిమా

- 'భాగమతి' ప్రీ రిలీజ్ వేడుకలో అనుష్క



వంశీ, విక్కీ, అశోక్, అనుష్క, అల్లుఅరవింద్, నాని, ప్రభాస్ శ్రీను, మారుతి తదితరులు

'నా హృదయానికి దగ్గరైన చిత్రమిది. ఇది నా సినిమా మాత్రమే కాదు, టీమ్ అందరి సినిమా. భాగమతిగా నేను తప్ప ఎవరు చేసినా బాధపడే దాన్ని' అని అనుష్క అన్నారు.

అశోక్ దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'భాగమతి'. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'ట్రైలర్ చూస్తే భయమేసింది. ఏడాదికిపైగా సినిమాను తీస్తున్నారు. ఇండస్ట్రీలో ఎవరికీ లేని ఓపిక అనుష్కకు ఉంది. ఆ విషయాన్ని 'అరుంధతి'తో నిరూపించుకుంది. ఆ సినిమాలాగానే ఇది కూడా పెద్ద హిట్టై బొమ్మాళి అంతటి పేరు రావాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'ఈ సినిమాను ఓ ఫ్రెండ్ రీరికార్డింగ్ టైమ్‌లో చూసి 'ఇంటర్వెల్ చూస్తుంటే రోమాలు నిక్కబొడుచుకున్నాయి, ఇలాంటి సినిమాను పెద్ద స్క్రీన్‌పైనే చూడాలి. స్వీటీ ఈ ఏడాది అన్ని అవార్డులను గెలుచుకుంటుంద'ని చెప్పాడు. అప్పట్నుంచి ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూడాలా అని ఎదురు చూస్తున్నా. దర్శకుడు అశోక్‌ను ఈ చిత్రం తర్వాత అందరూ 'భాగమతి' అశోక్ అని పిలుస్తారు. ఈ ఏడాది మన పరిశ్రమకు సాలిడ్ హిట్ పడలేదు. ఈ చిత్రంతో వస్తుంది' అని నాని తెలిపారు.

చిత్ర దర్శకుడు అశోక్ చెబుతూ, 'గెలవాలనుకున్నప్పుడు కష్టం మొదలవుతుంది. ఎలాగైనా గెలవాలనుకున్నప్పుడు మోసం ప్రారంభమవుతుంది. ఈ రెండు సమాంతరంగా నడుస్తుంటాయి. తను గెలుస్తూ తన చుట్టూ ఉన్న వారిని గెలిపిద్దాం అని ఎవరైనా ఆలోచిస్తే.. అతనితో దైవత్వం మొదలైనట్టు. అలాంటి వ్యక్తి ముందు ఈ కథ విన్నారు. ఆ దేవుడు ప్రభాస్. ఇక్కడి వరకు నడిపించింది ఆయనే. వంశీ, ప్రమోద్, విక్కీ త్రిమూర్తులు. వీళ్ళలో ఒకరు నిర్ణయం తీసుకోవడం, మరొకరు నడిపించడం, ఇంకొకరు సరిగ్గా నడిపించడం చేస్తారు. వీరికి సినిమా తీయడం వేలం వెర్రి. సినిమాను బిడ్డలా చూసుకున్నారు. వీరితో ఐదేండ్లుగా ట్రావెల్ అవుతున్నాను. స్వీటీ అంటే అనుభూతి. తను ఒక శక్తి. 'అరుంధతి'లా, సరోజగా, 'రుద్రమదేవి'గా కనిపించిన అనుష్క ఇప్పుడు 'భాగమతి'గా కనిపించబోతున్నారు. ఈ సినిమా కోసం తను ఎంత ఒత్తిడికి గురయ్యారో నాకు తెలుసు. విపరీతమైన దుమ్ములో 45 రోజులు ఈ సినిమా చేశారు. టెక్నీషియన్స్ ఆర్ట్ డైరెక్టర్ రవీందర్, మ్యూజిక్ డైరెక్టర్ థమన్, సినిమాటోగ్రాఫర్ మది, మనోజ్ పరమహంస ఇలా అందరూ క్యారెక్టర్‌లా ఫీలై చేశారు. ఇంత అద్భుతమైన సినిమాను రూపొందించడంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు. ఈ నెల 26న విడుదల చేస్తున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.'ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రాన్ని నిర్మించాం. ఓ మంచి చిత్రాన్ని నిర్మించామనే అనుభూతితో ఉన్నాం. ఇందులో భాగమతిగా అనుష్క అత్యద్భుతంగా నటించింది. ఈ పాత్రలో ఆమెని తప్ప మరొకరిని ఊహించలేం. ఈ సినిమా అందర్నీ అలరిస్తుంది' అని నిర్మాతలు చెప్పారు.

ఆహ్లాదంగా సాగే నవ్వుల యాత్ర..



జి.నాగేశ్వర్‌రెడ్డి

'సక్సెస్ కోసం హిట్ కాంబినేషన్ రిపీట్ చేయడంలో తప్పులేదు' అని అంటున్నారు దర్శకుడు జి.నాగేశ్వర్‌రెడ్డి. మంచు విష్ణు, ప్రగ్యా జైశ్వాల్ జంటగా నటించిన 'ఆచారి అమెరికా యాత్ర' చిత్రానికి ఆయన దర్శకుడు. కుమార్ చౌదరి సమర్పకులు, కీర్తి చౌదరి, కిట్టు నిర్మాతలు. ఈ చిత్రం వచ్చే నెలలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం దర్శకుడు జి.నాగేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, 'మంచు విష్ణుతో ఓ సినిమా చేయాలని ప్లాన్ చేసుకుంటున్న టైమ్‌లో నిర్మాతలు ఈ కథను తీసుకొచ్చారు. మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు రాసిన కథ ఇది. బ్రాహ్మణుల ప్రధానంగా సాగే కథ కావడంతో ముందు చేయనని చెప్పా. ఎలాంటి ఇబ్బందికర అంశాలు లేకపోవడం, కథ నచ్చడంతో సినిమా చేశాం. మంచు విష్ణు, బ్రహ్మానందం నటిస్తేనే సినిమా చేస్తా అని చెప్పా. స్క్రిప్ట్ నచ్చడంతో వాళ్ళు కూడా ఒప్పుకున్నారు. మంచి కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఆహ్లాదంగా సాగే నవ్వుల యాత్రలా ఉంటుంది. తాత సెంటిమెంట్‌తో సాగుతుంది. మనవరాలుగా ప్రగ్యా జైశ్వాల్ నటించింది. వీరి కుటుంబానికి ప్రమాదం పొంచి ఉందని తెలిసి బ్రాహ్మణులైన విష్ణు, బ్రహ్మానందం బ్యాచ్ అమెరికా వెళ్ళి ప్రమాదం నుంచి వారిని కాపాడటమే సినిమా. ఇందులో బ్రాహ్మణుల గురించి పోసాని చెప్పే డైలాగులు గొప్పగా ఉంటాయి. పెద్ద సినిమాలుండటంతో ఈ నెల 26న విడుదల కావల్సిన సినిమాను ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. నేను దర్శకత్వం వహించిన గత చిత్రాలు 'ఆటాడుకుందాం రా', 'ఇంట్లో దెయ్యం నాకేం భయ్యం' నిరాశ పర్చిన మాట వాస్తవమే. దర్శకుడిగా నేను ఫెయిల్ కాలేదు. సినిమాలు వర్కౌట్ కాలేదు. 'దేనికైనా రెడీ', 'ఆడో రకం ఇడోరకం' చిత్రాల తర్వాత విష్ణుతో చేస్తున్న సినిమా కావడంతో హిట్ కోసం చేస్తున్నానని అందరూ అంటున్నారు. సక్సెస్ కోసం, కమర్షియల్ పాయింట్ ఆఫ్ వ్యూలో హిట్ కాంబినేషన్‌ని రిపీట్ చేయడం తప్పులేదు. అలాగే కామెడీ దర్శకుల కొరత ఉందనే మాటలో వాస్తవం లేదు. కామెడీ చిత్రాలు చేసే హీరోలు లేరు. ఇప్పుడు ప్రతి హీరో కామెడీ చేస్తున్నారు. అలాగే యువ దర్శకులు లవ్, యాక్షన్ సినిమాల వైపు దృష్టి పెడుతున్నారు. తదుపరి మంచు విష్ణుతో మరో సినిమా చేయబోతున్నా. నాకు కామెడీ చిత్రాల దర్శకుడిగా పేరు రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు.



ఐశ్వర్యరాయ్

అరుదైన గౌరవం..

మాజీ ప్రపంచ అందాల తార ఐశ్వర్యరాయ్‌కు 'ఫస్ట్‌లేడీ' అవార్డు రూపంలో మరో అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఐష్ ఈ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో విజయం సాధించిన మొట్టమొదటి మహిళలకు ఈ 'ఫస్ట్‌లేడీ' అవార్డులను అందజేస్తారు. ఐష్ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి 20 ఏండ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న విషయం విదితమే. అత్యంత ప్రతిష్టాత్మక కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో జ్యూరీ సభ్యురాలిగా ఎంపికైన ఏకైక భారతీయ నటి ఐశ్వర్యరాయ్. ఇందుకుగానూ మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ ఐశ్వర్యను సత్కరించారు. ఐశ్వర్య ప్రస్తుతం 'ఫన్నీ ఖాన్' చిత్రంలో నటిస్తోంది. అనిల్ కపూర్, రాజ్‌కుమార్‌రావ్ కథానాయకులు. రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రా దర్శకత్వం వహిస్తున్నారు. దీంతోపాటు 'రాత్ ఔర్ దిన్' రీమేక్‌లోనూ నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఆ వ్యాఖ్యలు విచారకరం



శివాజీరాజా

'నలభై సంవత్సరాలుగా రాజకీయ, సామాజిక, సినిమా కళారంగాలకు విశేష సేవలందిస్తున్న కళాబంధు, ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి ఇటీవల 'కాకతీయ కళా వైభవోత్సవాలు' నిర్వహించారు. అలాంటి వ్యక్తిని ఉద్దేశించి ప్రభుత్వం సలహాదారు, 'కాకతీయ హెరిటేజ్' ట్రస్ట్ పాపారావు 'సినిమా నటీనటులను సత్కరించకూడద'ని హెచ్చరించడం విచారకరం' అని 'మా' అధ్యక్షులు శివాజీ రాజా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సినిమా, సమాజం వేర్వేరు కాదు. ప్రజలతో మమేకమైన కళ సినిమా. తొలినాళ్ల నుంచి ప్రజల పట్ల సినీ కళాకారులు స్పందిస్తూ సహాయమందిస్తున్న విషయం తెలిసిందే. అలాంటి గొప్ప సినిమా రంగానికి సంబందించిన నిర్మాత టి. సుబ్బరామిరెడ్డి సినిమా నటీనటులను సన్మానించే భాగంగా తొలుత మోహన్‌బాబును సత్కరించారు. ఇంకా ఎన్నో చోట్ల ఎన్నో వైవిధ్యమైన కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వ సలహాదారు పాపారావు ఇలా వాఖ్యానిస్తూ హెచ్చరించడం బాధాకరం. ఒక వైపు కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సినీ నటీనటులను గొప్పగా సన్మానించారు. కేటీఆర్ కూడా నటుడు గుండు హనుమంతరావు అనారోగ్య పరిస్థితి తెలుసుకుని రూ.5లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సినిమా రంగానికి ఎంతో సహకరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో పాపారావు 'సినిమా నటీనటులను సన్మానించకూడదు' అంటూ హెచ్చరించడం ఎంత వరకు సబబు అనేది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. ఇలాంటి వ్యాఖ్యలను ప్రభుత్వం కూడా సమర్థించదు. కళాకారులను సన్మానించడమంటే వారిని ప్రోత్సహించడమని తెలుసుకోవాలి. పాపారావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాను' అని పేర్కొన్నారు.

అలరించే కిరాక్ పార్టీ..

నిఖిల్, సిమ్రన్ పర్జీనా, సంయుక్త హేగ్డే హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏ టీవీ సమర్పణలో ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని తొలిపాట 'దమ్ దారే..'ను సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు.

ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'వరుస విజయాలతో దూసుకుపోతున్న నిఖిల్ నటిస్తున్న 15వ చిత్రమిది. తాజాగా ఈ సినిమాలోని మొదటి పాటను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఈ పాటను వనమాలి రచించగా, హరి చరణ్ ఆలపించారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూర్చారు. పాట అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రముఖ దర్శకుడు సుధీర్ వర్మ ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, మరో దర్శకుడు చందు మొండేటి సంభాషణలు అందించడం విశేషం. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని తెలిపింది.



సిమ్రన్ ఫర్జీనా, నిఖిల్



సోనాక్షి సిన్హా

వెల్‌కమ్ టు న్యూయార్క్..

గతేడాది 'నూర్', 'ఇత్తేఫాక్' చిత్రాలతో ఆకట్టుకున్న సోనాక్షి సిన్హా హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'వెల్‌కమ్ టు న్యూయార్క్'. దిల్‌జిత్ దోసాంజ్, కరణ్ జోహర్, రానా, బొమ్మన్ ఇరాని, లారా దత్తా, రితీష్ దేశ్‌ముఖ్ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల సల్మాన్ ఖాన్ విడుదల చేశారు. ఇందులో దిల్‌జిత్ హీరోగా కనిపిస్తుండగా కరణ్ జోహర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. సోనాక్షి గుజరాత్‌కి చెందిన ఫ్యాషన్ డిజైనర్‌గా నటిస్తున్నారు. బొమ్మన్ ఇరానీ, రానా, రితేష్ కామెడీ పాత్రలో కనిపిస్తూ ట్రైలర్‌లో నవ్వులు పంచుతున్నారు. ఇండియాలోనే ఫస్ట్ టైమ్ త్రీడీ ఫిల్మ్‌గా వస్తున్న కామెడీ చిత్రమిది. ఫ్యాషన్ డిజైనర్‌గా సోనాక్షి పాత్ర ఆద్యంతం అలరిస్తుంది. ఈ సినిమాను వచ్చే నెల 23న విడుదల చేయబోతున్నారు. సోనాక్షి దీంతోపాటు ప్రస్తుతం 'హ్యాపీ భాగ్ జాయేగి రిటర్న్స్' చిత్రంలోనూ నటిస్తోంది.

వారికీ శిక్ష పడాల్సిందే..



షబానా అజ్మీ

'ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈనెల 25న 'పద్మావత్' చిత్ర విడుదలకు అందరూ సహకరించాలంటూ సుప్రీమ్‌కోర్ట్ ఇచ్చిన తీర్పును నేను స్వాగతిస్తున్నాను. అయితే దీపికా పదుకొనె, సంజయ్‌లీలా భన్సాలీల తలలను నరికేస్తే భారీ పారితోషికం ఇస్తాం అంటూ ప్రకటించిన కొంత మంది మాత్రం స్వేచ్ఛగా సమాజంలో తిరుగుతున్నారు. అటువంటి వారికి కచ్చితంగా శిక్ష పడాల్సిందే' అని అంటున్నారు సీనియర్ నటి షబానా అజ్మీ. 'పద్మావత్' చిత్రానికి వ్యతిరేకంగా కర్ణి సేవలతోపాటు కొంతమంది దీపికా పదుకొనె, దర్శకుడు భన్సాలీపై పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు వారిని చంపేస్తే భారీ నజరానా ఇస్తామంటూ బహిరంగంగా ప్రకటించారు. అలా ప్రకటించిన వారిపై పోరాటం చేస్తామని షబానా చెబుతున్నారు. ఈ విషయాన్ని ట్వీట్ ద్వారా షబానా ప్రస్తావిస్తూ, 'దీపికా, భన్సాలీల ప్రాణాలకు వెల కట్టిన ప్రతి ఒక్కరికి శిక్ష పడాల్సిందే. వారికి శిక్షపడేంతవరకు మేమంతా పోరాటం చేస్తాం. ఈ విషయాన్ని సుప్రీమ్‌కోర్ట్ దృష్టికి కూడా తీసుకెళ్తాం. ఈ విషయంలో బాలీవుడ్ మొత్తం ఏకమవుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు. 'పద్మావత్' కోసం అక్షయ్ కుమార్ తన 'ప్యాడ్‌మాన్' చిత్ర విడుదలను వాయిదా వేసుకున్న విషయం విదితమే.

తొలి భారతీయ స్పేస్ బేస్డ్ సినిమా..

జయంరవి, నివేదా పేతురాజ్ జంటగా శక్తి సౌందర్ రాజన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'టిక్ టిక్ టిక్'. చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిల్మ్ బ్యానర్ పతాకంపై నిర్మాత పద్మావతి చదలవాడ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో జయం రవి మాట్లాడుతూ, 'మన దేశంలో రూపొందిన ఫస్ట్ స్పేస్ ఫిల్మ్ ఇది. దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ స్పేస్ ఫిల్మ్ అని చెప్పగానే షాక్ అయ్యాను. ఇటువంటి సినిమాలను ఈజీగా చేయలేం. ఒక్కొక్క షాట్ వెనుక చాలా కష్టం ఉంటుంది. 90లో కొన్ని స్పేస్ చిత్రాలు వచ్చాయి. అలా చేయాలంటే నో ప్రాబ్లమ్. కానీ అంతకంటే బాగా చేయాలంటే బడ్జెట్ కావాలన్నారు. లక్కీగా మంచి ప్రొడక్షన్ టీమ్, చెన్నైలో అజాక్స్ గ్రాఫిక్ స్టూడియో దొరికాయి. అందరూ మీకు ఇటువంటి వైవిధ్యమైన సినిమాలు చేయడం ఎలా కుదురుతుందని అడుగుతున్నారు. అందరూ నెగటివ్‌గా చూసిన విషయంలో నేను పాజిటివ్ తీసుకుని చేస్తున్నా. టీజర్, ట్రైలర్‌లో కంటే సినిమాలో పది రెట్లు ఎక్కువ ఉంటుంది. లార్జర్ థేన్ లైఫ్ సినిమా ఇది' అని అన్నారు. "బాహుబలి' స్థాయిలో తీసిన చిత్రమిది. ఈ చిత్ర ట్రైలర్‌లో చిన్న పిల్లాడు 'డాడీ.. డాడీ..' అనే సన్నివేశంలో మంచి ఎమోషన్ కనిపించింది. తెలుగు హక్కులు తీసుకున్నా. 'బిచ్చగాడు' తరహాలోనే ఈ చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని చదలవాడ శ్రీనివాసరావు తెలిపారు. చదలవాడ లక్ష్మణ్ చెబుతూ, 'ఇండియాలో ఇప్పటి వరకు స్పేస్ ఫిల్మ్ రాలేదు. 'స్టార్ వార్స్' తర్వాత ఇండియాలో ఇలాంటి సినిమా చేస్తే బాగుండూ అనుకునేవాడిని. తమిళంలో ఈ సినిమా చేస్తున్నారని తెలిసి తెలుగు హక్కులు దక్కించుకున్నాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. తెలుగు, తమిళంలో ఏకకాలంలో విడుదలకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.



జయం రవి

ఆగని సాగునీటి పోరాటం

- అడుగడుగునా ఆందోళనలు, నిలదీతలు
- పెద్దపల్లి ఎమ్మెల్యేను పరుగులు పెట్టించిన రైతులు
- చివరి ఆయకట్టు వరకూ నీరందించాలని డిమాండ్
- వెల్గటూర్‌లో చీఫ్‌విప్‌ను అడ్డుకున్న రైతులు



నవతెలంగాణ - పెద్దపల్లి రూరల్/వెల్గటూర్

పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో సాగునీటి ఆందోళనలు చల్లారడం లేదు. ఎస్సారెస్పీ ద్వారా నీరందకపోవడంతో రైతులు గరంగరం అవుతున్నారు. సంక్రాంతి పండుగ రోజు కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని నిలదీసిన రైతులు పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులను కడిగి పారేశారు. తాజాగా సోమవారం పెద్దపల్లి మండలం అప్పన్నపేట రైతులు ఇదే అంశంపై ఎమ్మెల్యేను నిలదీయంతో వారికి సమాధానం చెప్పలేక ఆయన పరుగులు పెట్టారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో ప్రభుత్వ చీఫ్‌విప్‌ను రైతులు అడ్డుకుని సాగునీటి కోసం నినాదాలు చేశారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాంకింగ్ సేవలను ప్రారంభించేందుకు సోమవారం సహకార బ్యాంకు రాష్ట్ర చైర్మన్ కోడూరి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, నగరపంచాయతీ చైర్మన్ ఎల్.రాజయ్య హజరు కావడానికి వెళ్తున్నారు. వారు అక్కడికి చేరకముందే రైతులు ఒకేసారి వారి వాహనాలను అడ్డుకున్నారు. సాగునీరందించాలని ఆందోళన చేశారు. ఎంత సర్దిచెప్పినా వినకపోవడంతో వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు నీళ్లు పెట్టాలన్నా నీరు లేదని రైతులు ప్రశ్నించారు. ఎస్సారె-స్పీ కాల్వల ద్వారా మంత్రులు సాగునీరు తీసుకెళ్తుంటే మీరు ఇక్కడ ఉండి ఏం చేస్తున్నారని ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. రైతులకు ఎల్లంపల్లి నీరందించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి నగరపంచాయతీ చైర్మన్ ఎల్.నాజయ్యనూ నిలదీశారు. అనంతరం రాజీవ్ రహదారిపై కూర్చొని వాహనాలు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఒక్కరే రోడ్డుపై నడకదారిన వెళ్లారు. అంతలోనే కోడూరి రవీందర్‌రావు వాహనం రావడంతో ఎక్కే ప్రయత్నం చేయగా ఆ వాహనాన్నీ రైతులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే వాహనం దిగి కాస్త దూరం నడిచి రైతుల నుండి తప్పించుకుని పోలీస్ వాహనంలో ఎక్కి పెద్దపల్లికి బయలుదేరారు.

వెల్గటూర్‌లో విపక్షాల ఆందోళన

వెల్గటూర్ మండల కేంద్రంలోని పెద్దవాగు బ్రిడ్జిపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి, ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సారెస్పీ అధికారులు, డీఈ, ఈఈ రావాలని డిమాండ్ చేస్తూ స్టేషన్‌లో బైటాయించారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఎల్లంపల్లె ప్రాజెక్టు వెల్గటూర్ మండలానికి కనీసం 10 మీటర్ల దూరంలో ఉంటే 170 కి.మీల దూరంలో ఉన్న గజ్వేల్, సిద్దిపేట, హైదరాబాద్‌కు నీరు తరలిస్తుంటే ఈ ప్రాంత ఎమ్మెల్యేలు ఎందుకు ఊరుకుంటున్నారని ప్రశ్నించారు. త్వరలోనే నీరందిస్తామని అధికారులు హామీనివ్వడంతో వారు ఆందోళన విరమించారు. అలాగే చర్లపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వచ్చిన ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్‌ను సాగు నీరందించాలని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఒకదశలో టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు కల్పించుకుని ఇరువర్గీ శాంతిపజేశారు.

సినిమాలకు సెలవు

నవతెలంగాణ, కలెక్టరేట్/జగిత్యాల

'ఇక సినిమాలకు సెలవు... పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వస్తున్నా... వచ్చే ఎన్నిల్లో శక్తిని బట్టి రెండు రాష్ట్రాల్లోనూ పోటీ చేస్తా. బీజేపీలోకి రావాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆహ్వానిస్తే సున్నితంగా తిరస్కరించా.' అని జనసేన అధ్యక్షుడు, సినీ హీరో పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తన తదుపరి రాజకీయ ప్రస్థానాన్ని ప్రకటించారు. సమస్యల అధ్యయనానికే తాను రాజకీయయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ఈ నెల 27 నుంచి అనంతపురం నుంచి తన యాత్ర ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, అందుకే అక్కడే ఎక్కువగా దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. ప్రధానంగా ఒంగోలులో ఫ్లోరోసిస్, కిడ్నీ బాధితుల సమస్యలు, కొవ్వాడ ప్రాంతంలో జనం బాధలు తెలుసుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చినట్టు చెప్పారు. తెలంగాణపై తనకు అమితమైన మమకారం ఉందని, దశాబ్దాల తర్వాత ఏర్పడిన తెలంగాణపై చాలా సున్నితంగా, సుశితంగా దృష్టి పెట్టాలని కార్యకర్తలు, మిత్రులు తెలిపారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సీఎం కేసీఆర్ కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. జనసేన పార్టీకి, చిరంజీవికి ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. తన పార్టీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర పార్టీలో కలపబోమన్నారు. తనకు సీట్లు, ఓట్లు ప్రాధాన్యం కాదని, ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు.

అంజన్న సన్నిధిలో జనసేనాని

రాజకీయ యాత్ర ప్రారంభ సూచికంగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పవన్‌కల్యాణ్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్ నుండి బయలుదేరిన ఆయన మధ్యాహ్నం 1:30 గంటలకు ఆలయానికి చేరుకున్నారు. పవన్‌కల్యాణ్ రాకకోసం ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దారిపొడవున కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ పవన్ ఆలయానికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో సుమారు 30 నిమిషాల పాటు పూజలు చేశారు. అనంతరం ఆయనకు ఆలయ ఈవో అమరేందర్, అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆలయ అభివృద్ధికి రూ.11 లక్షల విరాళం ప్రకటించారు. కొండగట్టు నుండే పార్టీ కార్యాచరణ, యాత్ర ప్రణాళిక ప్రకటిస్తామని ప్రకటన చేసినా అభిమానుల తాకిడి ఎక్కువగా ఉండడంతో అదేమీ లేకుండానే ఆయన కరీంనగర్‌కు వెళ్లారు.

అప్పుల బాధతో గల్ఫ్ బాధితుని ఆత్మహత్య

- కామారెడ్డి జిల్లాలో ఘటన

నవతెలంగాణ-భిక్కనూరు

అప్పుల బాధతో గల్ఫ్ బాధితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం అయ్యావారిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగయ్యల రాములు (45) రెండేండ్ల కింద దుబాయ్ వెళ్లాడు. దీనికి గాను సుమారు రూ.2 లక్షల వరకూ అప్పు చేశాడు. అక్కడ సరైన పని దొరకలేదు. చేసిన అప్పు తీరకముందే స్వదేశానికి వచ్చేశాడు. దుబాయ్ వెళ్లేందుకు చేసిన అప్పు ఎలా తీర్చాలనే మనో వేదనతో పాటు, కూతురి పెండ్లి చేసేందుకు డబ్బులు లేకుండా పోయాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రాములు ఆదివారం రాత్రి తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. ఆలస్యంగా గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమా చారం అందించగా వారు ఆయన్ను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజాగౌడ్ తెలిపారు.

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వేలాదిగా తరలొచ్చిన భక్తులు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో గల శ్రీపార్వతీ జడలరామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో అర్చకుల వేదమంత్రాల నడుమ కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అటవీశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి సారథ్యంలో స్వామివారికి పంచోపచార పూజా హారతీతో నగరోత్సవం నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు వారం రోజుల పాటు జరగనున్నాయి.

ప్రధాని సంతకం చేశారు..

మొదటిపేజీ తరువాయి


అంశంలో మోడీని కేసీఆర్, చంద్రబాబు బతిమాలుకుంటున్నారని వ్యాఖ్యానించారు. వారు కోరుకున్నట్టుగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే.. ఒక్కో పార్లమెంట్‌కు రెండు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశముందన్నారు. రాష్ట్రంలో అప్పుడు ఎన్నికల వాతావరణం వచ్చిందన్నారు. డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశముందని తెలిపారు. తాము కూడా అందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆ దిశగానే..తాము నిర్ణయాలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పవన్ కల్యాణ్ చేపట్టిన యాత్రపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరేవారికి తగిన ప్రాధాన్యమిస్తామని ఆయన తెలిపారు. టీఆర్ఎస్, బీజేపీల నుంచి చాలా మంది నేతలు తనతో టచ్‌లో ఉన్నారని ఆయన వెల్లడించారు. అయితే వారి పేర్లు ఇప్పుడే వెల్లడించలేమని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

నేడు దావోస్‌లో మోడీ ప్రారంభోపన్యాసం



జ్యూరిచ్ : ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్)లో పాల్గొనడానికి బయల్దేరిన ప్రధాని మోడీ సోమవారం జ్యూరిచ్‌కు చేరుకున్నారు. మంగళవారం సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోడీ కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సందర్భంగా భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా మోడీ కోరనున్నారు. భారతదేశ భవిష్యత్తు కార్యక్రమాల్ని అంతర్జాతీయ సమాజంతో పంచుకోబోతున్నానని దావోస్ పర్యటనకు బయల్దేరేముందు ప్రధాని మోడీ మీడియాకు తెలియజేశారు. దావోస్‌లో స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలైన్ బెర్సెట్, ప్రధాని స్టెఫాన్ లోవెన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈసారి దావోస్ సదస్సుకు భారత ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోంది. గత 48 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా, 130 మంది సీఈఓలతో కూడిన భారత బృందం దావోస్‌కు చేరుకుంది. 2 వేలమంది వ్యాపారవేత్తలు, రాష్ట్రాల నుంచి 70 మంది ముఖ్య అధికారులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. అంతర్జాతీయంగా భారతదేశం బ్రాండ్ విలువను, భారతీయ కంపెనీల బిజినెస్‌ను పెంచుకోవటం కోసం వీరంతా ఇక్కడకు చేరుకున్నారు. దావోస్‌లో మొదట ప్రధాని మోడీ-స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలేయిన్ బెరెస్టాండ్ మధ్య భేటీ జరగనున్నది. ఆర్థిక సదస్సు ప్రధాన వేదికపై 1500 మంది డెలిగేట్స్‌తో మోడీ సమావేశం జరపనున్నారు. అటు తర్వాత 18 దేశాలకు చెందిన 40 మంది ప్రపంచ పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం, అనంతరం విందు కార్యక్రమం. ఇందులో భారతీయ పారిశ్రామికవేత్తలు కూడా పాల్గొంటున్నారు. మంగళవారం ఉదయం సదస్సులో మోడీ కీలక ఉపన్యాసం చేయనున్నారు.

పూర్తిస్థాయి నేతగా పవన్ రావాలి : టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

పూర్తిస్థాయి రాజకీయ నేతగా జనసేన అధినేత, సినీనటుడు పవన్ కల్యాణ్ యాత్ర కొనసాగిస్తే మంచిదని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పవన్ రహస్య ఒప్పందం కుదుర్చుకున్నదంటూ పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. నాటి సమావేశంలో పవన్ రాజకీయాలు చర్చించలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి పనులను అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ నీచ రాజకీయాలను చేస్తోందని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో టిఆర్ఎస్ఎల్పి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం పర్యటనలో గవర్నర్ నరసింహన్ ప్రభుత్వాన్ని పొగడడాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ఆరోపించారు.

జనగోస

మొదటిపేజీ తరువాయి

లేదంటూ పలువురిని అరెస్టు చేశారు. అసిఫాబాద్‌లో 144 సెక్షన్ విధించారు. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు అనుచరులు ఊరూరా తిరిగి టీమాస్ కార్యక్రమానికి వెళ్లొద్దని బెదిరించినా... ప్రజలు స్వచ్ఛందంగా కలెక్టరేట్ ముట్టడికి తరలొచ్చారు. మంచిర్యాలలో గంగిరెద్దులవారు, తదితర సంచార జాతుల వారు ప్రదర్శన చేపట్టారు. మహబూబాబాద్ జిల్లాలో ముందు రోజు టీమాస్ నాయకుల ఇండ్లకు వెళ్లి పోలీసులు బెదిరించినా... తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నా...కలెక్టరేట్ ముట్టడి విజయవంతమైంది. ఇలా ప్రతిజిల్లాలోనూ ఏదో ఒక రకంగా పోలీసులు, పాలకులు అడ్డంకులు సృష్టించినా టీమాస్ చేపట్టిన కలెక్టరేట్ల ముట్టడి జయప్రదమైంది. ముట్టడుల అనంతరం...గ్రామాల్లో టీమాస్ సర్వేల్లో వెలుగుచూసిన సమస్యలపై కలెక్టర్లకు వినతిపత్రా లను టీమాస్ నాయకులు అందజేశారు. ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన 18 హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

వాగ్దానాలు అమలు చేయకుంటే పజాప్రతినిధులను తిరగనివ్వబోం : జాన్‌వెస్లీ

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయకుంటే సామాజిక న్యాయం- సమగ్రాభివృద్ధి ఎజెండా కోసం ప్రత్యేక ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని, ప్రజాప్రతినిధులను ప్రజల్లో తిరుగనివ్వబోమని టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక (టీమాస్) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా జరిగింది. టీమాస్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ, సౌత్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల డబుల్ బెడ్ రూం ఇండ్లు అవసరం ఉంటే, ఐదు వేల ఇండ్లను కూడా నిర్మించలేదన్నారు. లక్షా ఏడువేల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, ఏడువేల పోస్టులను కూడా భర్తీ చేయలేదన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలు చేయనందున, విద్య వ్యాపారంగా మారిందన్నారు. ఈ సమస్యలపై తహసీల్దార్లకు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. రాష్ట్ర నాయకులు నాగరాజు మాట్లాడుతూ...రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్ర నాయకులు డీజీ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన 2500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీమాస్ గ్రేటర్ నాయకులు ఎం.శ్రీనివాస్, సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎన్. సోమయ్య మాట్లాడారు. ధర్నా సందర్భంగా పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. కలెక్టరేట్ రహదారిలో సుమారు 2 గంటలకు పైగా రాకపోకలను నిలిపేశారు. ధర్నా అనంతరం టీమాస్ బృందం కలెక్టర్ యోగితారాణాను కలిసి సమస్యలను విన్నవించింది. ప్రజల నుంచి స్వీకరించిన వినతిపత్రాలను అందజేశారు. రంగారెడ్డిలో పీఎల్ విశ్వేశ్వరావు మాట్లాడుతూ...కేసీఆర్ ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడిలో టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఊ. సాంబశివరావు మాట్లాడుతూ... బడుగుల త్యాగాలతో సిద్ధించిన తెలంగాణలో వారి సమస్యలు పాలకులకు పట్టట్లేదన్నారు.

హామీలను నెరవేర్చకుంటే ప్రజలే ఓట్ల ద్వారా తిరస్కరిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీమాస్ స్టీరింగ్ సభ్యులు మాట్లాడుతూ... శ్రీరాముల శ్రీనివాస్, పాలడుగు భాస్కర్, శ్రీరామ్‌నాయక్, శ్రీకాంత్, డీఎస్ఎస్ కోఆర్డినేటర్ నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుజ్జ రమేష్, తదితరులు పాల్గొన్నారు. వికారాబాద్‌లో తెలంగాణ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రత్నం, బలహీనవర్గాల రాష్ట్ర సంఘం అధ్యక్షులు వెంకట్‌రామ్, తెలంగాణ డీఎల్ఎఫ్ సెక్రెటరీ ఇ.మొగులయ్య మాట్లాడారు.

రూ.50 వేల కోట్లివ్వండి..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బడ్జెట్‌కు ముందు (సన్నాహకం) సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో.. రానున్న ఆర్థిక సంవత్సరం (2018-19)లో తమకు భారీ స్థాయిలో నిధులివ్వాలంటూ సాగునీటి పారుదలశాఖ.. ప్రభుత్వాన్ని వేడుకుంది. వచ్చే పద్దులో తమకు రూ.50 వేల కోట్ల మేర నిధులు కేటాయించాలంటూ ఆ శాఖ ఉన్నతాధికారులు.. ఆర్థికశా ఖకు ప్రతిపాదనలు సమర్పించారు. అయితే ఈ పద్దును రూ.30 వేల కోట్లకు తగ్గించుకోవాలంటూ ఆర్థికశాఖ సూచించినట్టు తెలిసింది. తదనుగుణంగా ప్రతిపాదనలను మార్చుకోవాలని కోరింది. ఆ తర్వాత తుది ప్రతిపాదనలను అందజేయాలని సూచించింది. సాగునీటి పారుదలకు ప్రతియేటా బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు కేటాయిస్తామం టూ సీఎం కేసీఆర్ గతేడాది ప్రకటించిన విషయం విదితమే. ఇదే సమయంలో ఏడాదికేడాది రూ.5 వేల కోట్లను పెంచుకుంటూ పోతామంటూ ఆయన ప్రకటించారు కూడా. ఈ క్రమంలో రూ.50 వేల కోట్లు.. రూ.30 వేల కోట్లు కాకుండా చివరకు సాగునీటి పారుదల శాఖకు రూ.25 వేల కోట్లే కేటాయించనున్నారని సమా చారం. మరోవైపు ఏడాదికేడాది బడ్జెట్లను పెంచి చూపు తున్న సర్కారు.. ఆ స్థాయిలో నిధులను ఖర్చు చేయటం లేదు. అన్ని శాఖల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. సాగునీటి పారుదలశాఖ కూడా ఇదే జాబితాలో ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గత బడ్జెట్ (2017-18 ఆర్థిక సంవత్స రం)లో నీటి పారుదలశాఖకు ప్రభుత్వం రూ.24,575 కోట్లను కేటాయించింది. ఇందులో గత డిసెంబరు నాటికి కేవలం రూ.13,124 కోట్లనే ఖర్చు చేశారు.

ఇంకా రూ.11,451 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం మనం జనవరి చివరలో ఉన్నాం కనుక ఇంకా రెండు నెలల్లో ఈ డబ్బును విడుదల చేయటం కష్టసాధ్యమేనంటూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు నిర్వహించిన పనులకుగాను రూ.5,657 కోట్ల మేర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

కాగ్ నివేదికపై కసరత్తు...

ప్రతియేటా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రూపొందించిన నివేదికను ఉభయ సభల్లో ప్రవేశపెడతారన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే ఆ దిశగా కసరత్తు ముమ్మరమైంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలు, రంగాలు.. వాటిలో నిధుల వ్యయం, దుర్వినియోగం, లోపాలు, లొసుగులు, నిబంధనల ఉల్లంఘనలు తదితరాంశాలను కాగ్ తన నివేదికలో ఎత్తి చూపటం పరిపాటి. ఈ నివేదికను రూపొందించిన అనంతరం ఆమోదముద్ర కోసం గవర్నర్‌కు పంపుతారు. గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత నేరుగా శాసనసభ, శాసనసమండలిలో ప్రవేశపెడతారు.

అంతా మా ఇష్టం..దిక్కున్న చోట చెప్పకో..

మొదటిపేజీ తరువాయి


ఆక్రమించి..రైతు భూమి ప్రభుత్వానిదని తెలుసుకుని మొత్తం తన పరిధి దాటి దున్నేశాడు. 'ఇదేంటి అని అడగ్గా.. ఇంద్రసేనారెడ్డి వెంట ఉన్న గన్‌మెన్లు కాల్చేస్తాం' అని బెదిరించారని భిక్షపతి నవతెలంగాణతో వాపోయాడు. ఈ విషయంపై అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశానని రైతు తెలిపాడు. మరిన్ని ఆధారాలు కలిగిన రైతుకు న్యాయం జరుగుతుందా..లేక అధికార బలంతో ఉన్న ఇంద్రసేనారెడ్డి పంతం నెగ్గుతుందా..చూడాలి. ఈ విషయంపై రెవెన్యూ భూ సర్వేయర్‌ను నవతెలంగాణ వివరణ కోరగా అక్కడ సీలింగ్ భూమి ఉన్నది వాస్తవమే. త్వరలోనే ఆ భూమిని సర్వేచేసి హద్దులు ఏర్పాటుచేస్తాం.



సేద్యం చేసుకుని బతుకుతున్న...
దయతల్చండి మాజీ ఎమ్మెల్యే సారూ...

ప్రభుత్వం ఇచ్చిన భూమిపై నాకు అన్ని హక్కులున్నాయి. ప్రస్తుతం 25 ఏండ్లుగా ఆ భూమిని సేద్యం చేసుకుని నా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మాజీ ఎమ్మెల్యే సారూ నాపై దయ తలచండి. ఆ భూమిని వదలండి.

అధికార దాహంతో రైతులను బెదిరిస్తే ఉద్యమం తప్పదు :
సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా



ప్రభుత్వం రైతులకు ఇచ్చిన భూమిని సేద్యం చేసుకుంటుండగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే అధికార దాహంతో కబ్జాలకు పాల్పడటం సరికాదు. రెవెన్యూ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని రైతుకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదు.

నేను కబ్జా చేయలేదు. రైతు కబ్జా చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేశా : నల్లు ఇంద్రసేనారెడ్డి

నేను ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయలేదు. ఆ రైతే భూమిని కబ్జా చేశాడు. రెవెన్యూ అధికారుల వద్దకు రమ్మంటే రాలేదు. నా స్థలంలో నేను ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాను.

గొంతెత్తిన మహిళా లోకం

మొదటిపేజీ తరువాయి

నడుపుతున్నారు. ఆదివారంనాటి ర్యాలీలో బ్రిటన్‌కు చెందిన రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

భారత్‌లో కుల వివక్షను నిరసిస్తూ...ప్రదర్శన

భారత్‌లో దళితులపై జరుగుతున్న దాడుల్ని నిరసిస్తూ లండన్ వీధులు మారుమ్రోగాయి. గత శనివారంనాడు జరిగిన ర్యాలీలో 'డౌన్ మోడీ, డౌన్ ఆర్ఎస్ఎస్' అంటూ నిరసనకారులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బర్మింగ్‌హోం, వోవెర్‌హాంప్టన్, లండన్ తదితర నగరాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. బ్రిటన్ పార్లమెంట్ స్క్వేర్ నుంచి మొదలైన నిరసన ర్యాలీ భారత హై కమిషన్ కార్యాలయం వరకూ సాగింది. బ్రిటన్‌లోని వివిధ సామాజిక గ్రూపులు, దక్షిణాసియా దేశాల గ్రూపులు నిరసన ప్రదర్శనకు సంఘీభావం ప్రకటించాయి. నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న ఒక సామాజిక గ్రూప్ సభ్యురాలు మాట్లాడుతూ..."భారత్‌లో మోడీ ప్రభుత్వానికి ఓ సందేశం పంపాలని ఈ నిరసన కార్యక్రమం జరుపుతున్నాం. నేడు భారత్‌లో జరుగుతున్న ఘటనల గురించి ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరముంది.

మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థే నేడు ప్రమాదంలో ఉంది. లండన్ ఒక ప్రపంచ వేదిక కాబట్టి, దళితులు, మైనార్టీలు, ఇతర గ్రూపులపై దాడులకు వ్యతిరేకంగా నిరసనకు దిగా"మని తెలియజేశారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

నవతెలంగాణ-రామకృష్ణాపూర్/జగిత్యాల/సిరికొండ/డిచ్‌పల్లి

జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో సోమవారం ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. భూ సమస్య పరిష్కారం కావడం లేదని జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటే నిజామాబాద్ జిల్లాలో అప్పుల బాధతో మరో రైతు ప్రాణం తీసుకున్నాడు. వేధింపులు తాళలేక ఓ గీత కార్మికుడు మంచిర్యాల కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపెల్లి గ్రామానికి చెందిన చిట్యాల గంగయ్య(40) 18 ఏండ్లుగా సర్వే నెంబర్ 210బీలో ఎకరం 20 గుంటలను సాగు చేసుకుంటున్నాడు. భూమి పట్టెదారు నల్ల వెంకట్‌రెడ్డి పేరుతో ఉండగా పహాణీలో మాత్రం ఆయన మనవడు గుర్రాల జితేందర్‌రెడ్డి పేరుంది. జితేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిలో ఉండగా కొన్ని నెలల కింద గుండెపోటుతో మృతిచెందాడు. అయితే జితేందర్‌రెడ్డికి ఎకరం 20 గుంటల భూమికి సంబంధించిన కొనుగోలు కోసం రూ.80వేలు మాటమీద ఇచ్చినట్టు గంగయ్య రెవెన్యూ అధికారులకు చెప్పారు. ఈ క్రమంలో జితేందర్ రెడ్డి తల్లి ఆ భూమి పట్టా తన పేరుపై చేయాలని దరఖాస్తు చేసుకుంది. భూమిని 18 ఏండ్లుగా తాను సాగుచేసుకుంటున్నానని, దీనికి రూ.80 వేలు కూడా చెల్లించానని, ఇప్పుడు లాక్కోవడం సరికాదని గంగయ్య వాపోయాడు. బాధితుని వద్ద ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గంగయ్య సోమవారం తన కుటుంబంతో కలిసి ప్రజావాణికి వచ్చాడు. సమస్య తీరేట్టులేదని భావించి పురుగుల మందు తాగి అక్కడే కుప్పకూలి పోయాడు. గమనించిన స్థానికులు ఆయన్ను జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతునికి భార్య సుశీల, కుమారులు ఉన్నారు. భూమి గంగయ్య కబ్జాలో ఉన్న మాట వాస్తవమేనని, అయితే జితేందర్ తల్లి మాత్రం కేవలం కౌలు మాత్రమే ఇచ్చినట్టు చెబుతోందని సారంగాపూర్ తహశీల్దార్ వసంత చెప్పారు.

జగిత్యాల కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఒకరు...

- నిజామాబాద్ జిల్లాలో అప్పుల బాధతో మరొకరు..వేధింపులు తాళలేక గీత కార్మికుని ఆత్మహత్య

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన సల్ల మోహన్‌రెడ్డి (43)కు ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. నీటి కోసం రూ.10 లక్షలు అప్పు చేసి 10 బోర్లు వేయించినా ఫలితం లేకుండా పోయింది. వ్యవసాయం కలిసిరావట్లేదని రూ.లక్ష ఖర్చుచేసి గతేడాది గల్ఫ్‌కు వెళ్లినా సరైన ఉపాధిలేక తిరిగొచ్చాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మోహన్‌రెడ్డి ఇంట్లో ఉరేసుకున్నాడు. మతుని భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బషీర్ అహ్మద్ తెలిపారు.

వేధింపులు తాళలేక గీత కార్మికుని ఆత్మహత్య

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలానికి చెందిన రంగు రామాగౌడ్ (45) టీడీపీ నాయకుడు, గీత కార్మికుడు. స్థానిక సర్పంచ్ ఎమ్‌డీ.ఆస్మా, భర్త ఇబ్రహీం అనుచరులైన పల్లె మహేశ్ చేత పెద్ద చెరువులో శనగ పంట వేయించి కబ్జాకు యత్నించారు. ఈ విషయంపై రామాగౌడ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్థానికుల నాయకులు రామాగౌడ్‌పై ఒత్తిళ్లు పెంచారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా పెట్టించి వేధించారు. అయితే న్యాయం కోసం రామాగౌడ్ ఈ నెల 2న కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో సోమవారం ప్రజావాణికి వచ్చిన ఆయన కలెక్టర్ కార్యాలయంలోనే పురుగుల మందు తాగాడు. ఆయన్ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని అఖిలపక్ష నాయకులు బంధువులతో కలిసి ఆందోళనకు దిగారు. మృతునికి భార్య సరస్వతి, కూతురు వసుధ ఉన్నారు.

గురుకుల టీజీటీ ఫలితాలు ప్రకటించండి

టీఎస్‌పీఎస్సీని ముట్టడించిన అభ్యర్థులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ గురుకుల విద్యాసంస్థల్లో ప్రకటించిన ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) పోస్టుల ఫలితాలు వెంటనే ప్రకటించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యాలయాన్ని ముట్టడించారు. ప్లకార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో అభ్యర్థులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. గురుకుల టీజీటీ పోస్టులకు 1:2 నిష్పత్తి చొప్పున అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన ముగిసి నెలన్నర రోజులయ్యాయని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. టీజీటీ ఫలితాలు విడుదల చేయకుండా జాప్యం చేయడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోవైపు వచ్చేనెల 24 నుంచి జరగాల్సిన ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి అర్హత సాధించినా ప్రిపేర్ కాలేకపోతున్నామని వాపోయారు. ఈ ఫలితాలు ప్రకటిస్తే టీఆర్టీ, ఇతర పోస్టులకు చదివేందుకు ప్రణాళిక రూపొందించుకుంటామని చెప్తున్నారు. టీజీటీ తుది ఫలితాలు ప్రకటించి మానసిక వేదనను తగ్గించాలని టీఎస్‌పీఎస్సీ అధికారులను కోరారు. గురుకుల పీజీటీ ఫలితాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

నేటినుంచి ఆప్షన్లకు అవకాశం : టీఎస్‌పీఎస్సీ

టీజీటీ ఫలితాలు ప్రకటించాలని అభ్యర్థుల ఆవేదనకు టీఎస్‌పీఎస్సీ స్పందించింది. మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు టీజీటీ ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు సొసైటీలు, జోన్ల ఆప్షన్లను ఎంచుకోవడానికి మరోసారి అవకాశం కల్పిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సొసైటీలు, జోన్ల ఆప్షన్లను పూర్తిస్థాయిలో అభ్యర్థులు ఎంచుకోనందున ఫలితాలు ప్రకటించడానికి వీలుకాదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సెన్సెక్స్ ▲286	నిఫ్టీ ▲72	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు	
35,798	10,966	63.87	రూ. 29,812	రూ. 40,200	హైదరాబాద్ 368	విజయవాడ 374
					ఒక్కగుడ్డుకు 4.30	చెన్నై 397
					వరంగల్ 370	ముంబయి 410

ప్రవాసులే తెలంగాణ రాయబారులు : కేటీఆర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బంగారు తెలంగాణ కల సాకారానికి ప్రవాస తెలంగాణ వాసులు కలిసి రావాలని మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి స్విట్జర్లాండ్‌లోని జురిచ్ నగరంలో తెలంగాణ ఎన్నారైలు ఏర్పాటుచేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలు, పాలసీలు, రాష్ట్రంలో వాటి అమలు తీరుతెన్నులు తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. భారతదేశంలో ఎక్కడా అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, ప్రాజెక్టుల పనులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను సైతం ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం అద్భుతమైన ప్రగతి దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్తోందన్నారు. 15 ఏళ్ల క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు కూడా ఇంకా పూర్తిగా కుదురుకోని పరిస్థితుల్లో ఉంటే తెలంగాణ రాష్ట్రం మాత్రం మూడున్నర ఏళ్లలోనే అనేక రంగాల్లో దేశానికి ఆదర్శవంతమైన విధానాలతో ముందుకెళ్తోందన్నారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షించిన లక్ష్యాల సాధన దిశగా ప్రయాణం మొదలైందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతత్వంలో బంగారు తెలంగాణను సాధిస్తామని మంత్రి ఉద్ఘాటించారు. ఎన్నారైలే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు అని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అభివద్ధికి కలిసి రావాలని కోరారు. అనంతరం ఎన్నారైలు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానాలు చెప్పారు. జురిచ్ నగరంలో శ్రీధర్ గండె, అల్లు కష్ణారెడ్డి , అనిల్ జాలా, కిశోర్ తాటికొండ తదితరులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్వీడన్, జర్మనీ, యూకే, స్విట్జర్లాండ్ దేశాల నుంచి తెలుగువారు హాజరయ్యారు. తెలంగాణ జాగృతి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

మెదక్‌లో హెచ్ఎస్ఐఎల్ పీవీసీ ప్లాంట్

- 30 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు
- వెయ్యి మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు
- మార్కెట్లోకి పీవీసీ, యూపీవీసీ పైపులు ఆవిష్కరణ



నవతెలంగాణ , బిజినెస్ డెస్క్: హింద్‌వేర్ బ్రాండ్‌తో శానిటరీవేర్ ఉత్పత్తులను అందించే 'హిందుస్థాన్ శానిటరీవేర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్' (హెచ్ఎస్ఐఎల్) ప్లంబింగ్ సొల్యూషన్ విభాగంలోకి అడుగు పెట్టింది. 'ట్రూఫ్లో' పేరుతో సంస్థ పీవీసీ, యూపీవీసీ పైపులను మార్కెట్లోకి ఆవిష్కరించింది. ఇందుకోసం సంస్థ తెలంగాణలోని మెదక్ జిల్లా ఇస్నాపూర్‌లో రూ.160 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్లాంటులో కార్యకలాపాలను ప్రారంభించడం ద్వారా సంస్థ అధికారికంగా ప్లంబింగ్ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చింది. ఏడా దాదాపు 30,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంటును ఏర్పాటు చేసినట్టుగా సంస్థ వైస్ చైర్మెన్, ఎండీ సందీప్ సుమేనీ తెలిపారు. రానున్న రెండేండ్లలో ప్లాంటు ఉత్పత్తిని రెండింతలు చేయనున్నట్టుగా వివరించారు. ఈ ప్లాంటు ద్వారా సంస్థ మొత్తం 1000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించనున్నట్టుగా ఆయన తెలిపారు. దేశం మధ్యలో ఉండి దాదాపు అన్ని ప్రధాన నగరాలకు అతి తక్కువ సమయంలో ఉత్పత్తులను చేరవేసే వెసులుబాటు ఉన్నందునే తాము పాంటు ఏర్పాటునకు తెలంగాణను ఎంచుకున్నట్టుగా ఆయన వివరించారు. హెచ్ఎస్ఐఎల్ పైప్స్ విభాగం అధ్యక్షుడు రాజేష్ పజ్నా మాట్లాడుతూ సీపీవీసీ రెసిన్ సప్లయినకు గాను తమ సంస్థ జపాన్‌కు చెందిన సెకీస్యూ సంస్థతో జట్టుకట్టినట్టుగా తెలిపారు.

మొండిబాకీలు @9.5 లక్షల కోట్లు

మార్చి నాటికి మరింత పెరగనున్న బ్యాంకుల ఎన్పీఏలు

- ఏటా లక్ష కోట్లకుపైగా బ్యాంకులకు ఎగనామం
- అసోచామ్-క్రిసిల్ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: బ్యాంకుల ఎన్‌పీఏలు (నిరర్థక ఆస్తులు) ఈ ఏడాది మార్చి చివరికల్లా రూ.9.5 లక్షల కోట్లకు చేరనున్నట్టు అసోచామ్-క్రిసిల్ సంయుక్త అధ్యయనంలో తేలింది. ఇవి గతేడాది మార్చి చివరికి రూ.8 లక్షల కోట్లు. అంటే.. ఒక్క ఏడాదిలోనే మొండి బకాయిలు లక్షన్నర కోట్లు అదనంగా చేరాయని అర్థం.కాగా వీటికి వడ్డీ మూడు లక్షల కోట్లు అదనం.ఈ బకాయిల్లో అధిక భాగం కార్పొరేట్ సంస్థలు, బడా కంపెనీలు తీసుకున్నవేనన్నది వివరాలు బయట పెడ్తే వెలుగు చూస్తుంది. ఎగవేతదారులు కేంద్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారితో అంట కాగుతూ బ్యాంకింగ్ చట్టాలను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. ఉన్నత న్యాయస్థానాల్లో కేసులు కూడా వీరిని కట్టడి చేయలేకపోతున్నాయి. అందుకు ఉదాహరణ..బ్యాంకులకు సుమారు రూ.9000 కోట్లు ఎగ్గొట్టి దర్జాగా లండన్ చెక్కేసిన లిక్కర్ వ్యాపారి విజయ్‌మాల్యా. అవినీతిపరులకు వణుకు పుట్టిస్తానంటూ ఫీంకరింపులు చేసే మోడీ ప్రభుత్వ హయాంలోనే విజయ్‌మాల్యా విమానమెక్కి దేశం దాటారు. బ్యాంకులు ఇచ్చిన ఈ అప్పుల లెక్క అంతా బ్యాలెన్స్ షీట్లలో చూపించేది మాత్రమేనన్నది గమనార్హం. గతేడాది సెప్టెంబర్ నాటికే మొండి బకాయిల మొత్తం విలువ రూ.8.5 లక్షల కోట్లు దాటిందని ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్‌శుక్లానే స్వయంగా వెల్లడించారు.

మొండి బకాయిల్ని కొంతకాలం తర్వాత బ్యాలెన్స్ షీట్ల నుంచి తొలగిస్తారు. వాటిని నష్టాల జాబితాలో రైటాఫ్ పేరుతో పక్కన పెడ్తారు. ఇక వాటిని లెక్కల్లో చూపరు. అయితే, అలా చేయడానికి ముందు ఎగవేతదారుల ఆస్తులు జప్తు చేయాలి. కానీ, పలుకుబడి ఉన్న వ్యక్తులు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని దొడ్డిదారిన సమకూర్చుకున్న ఆస్తుల్ని ఇతర కంపెనీల్లోకి మళ్లిస్తారు. దాంతో, రైటాఫ్స్ కింద పెట్టిన అప్పుల వసూలు పట్ల అధికారులు శ్రద్ధ చూపరు. గత పదేండ్లలో(2007-2017) ఇక వసూలు సాధ్యం కాదని భావించి బ్యాంకులు తమ ఆస్తుల జాబితాల్లోంచి తొలగించిన రైటాఫ్స్ విలువ రూ.3 లక్షల కోట్లు. 2017-18 మొదటి ఆరు నెలల్లోనే(ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు) రైటాఫ్స్ కింద చేర్చిన మొండి బకాయిలు రూ.55,356 కోట్లు. ఈ లెక్కన ఏటేటా నిరర్థక ఆస్తుల జాబితాలోంచి కూడా తొలగిపోతున్న రుణాల విలువ రూ.లక్ష కోట్లకు పైమాటేనన్నది గమనార్హం. అంటే..మొండి బకాయిలు అలా ఉండగా బ్యాంకులకు ఏటా జరుగుతున్న నికర నష్టం రూ.లక్ష కోట్లకు పైగా అని అర్థం.

బ్యాంకులకు అప్పులు ఎగ్గొట్టేవారిలో అధికభాగం అధికార పార్టీలకు చెందిన రాజకీయ నేతలు, వారి సన్నిహితులేనని పరిశీలకులు చెబుతున్నారు. స్వయంగా అధికార పార్టీల ఎంపీలు,వారి బినామీలు కూడా ఎగవేతదారుల్లో ఉన్నారన్నది తెలిసిందే. వీరిలో చాలామందికి కేంద్రంలో అధికారం ఎటు మారితే అటు వెళ్లడం(పార్టీలు మార్చడం) వెన్నతో పెట్టిన విద్య. కాంగ్రెస్ నేతృత్వంలోని గత యూపీఏ ప్రభుత్వంగానీ, బీజేపీ నేతృత్వంలోని ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వంగానీ బడా ఎగవేతదారుల ముక్కు పిండి బ్యాంకుల్ని బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్న విమర్శలున్నాయి. బ్యాంకులను ప్రయివేటీకరించాలన్న ఆలోచన ఆ రెండు పార్టీల ఉదార ఆర్థిక విధానాల్లో ఉండటం గమనార్హం.

పాక్ కంటే భారత్‌కు అధ్వాన్న ర్యాంకింగ్!

- సమ్మిళిత వృద్ధిలో 62వ స్థానంలో దిగజారిన ఇండియా
- గతేడాదితో పోలిస్తే రెండు ర్యాంకులు వెనక్కి
- ఐడీఐలో 47వ స్థానంలో మన దాయాది దేశం
- మెరుగైన స్థానాల్లోనే నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్



దావోస్: భారత్ అన్ని రంగాల్లో వృద్ధి పథంలో సాగుతూ వెలిగిపోతోందంటూ మోడీ సర్కారు చేస్తున్న ప్రచారం గాలి మాటలేనని మరోమారు నిరూపితమైంది. దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) తాజాగా ప్రకటించిన సమ్మిళిత వృద్ధి సూచీలో (ఐడీబీ) భారత్ మరింత వెనక్కి వెళ్లింది. తాజాగా ప్రకటించిన ఐడీబీ ర్యాంకింగ్‌లో భారత్ 62వ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఇదే ర్యాంకింగ్‌లలో మన దేశం 60వ స్థానంలో నిలవగా ఈ ఏడాది రెండడుగులు వెనక్కి వెళ్లడం విశేషం. ఇదిలా ఉండగా మన దాయాది దేశం పాకిస్థానం గత ఏడాదితో పోలిస్తే అయిదు స్థానాలను మెరుగు పరుచుకొని 52వ స్థానం నుంచి 47వ స్థానానికి చేరుకోవడం విశేషం. మన పొరుగు దేశం చైనా ఈ జాబితాలో 26వ స్థానంలో నిలిచింది. 2018 ఐడీఐలో మొత్తం 103 దేశాలకు డబ్ల్యూఈఎఫ్ ర్యాంకులు ప్రకటించింది. వీటిలో అభివృద్ధి చెందిన 29 దేశాలను ఓ జాబితాలో, అభివృద్ధి చెందుతున్న 74 దేశాలను మరో జాబితాలో చేర్చింది. భారత్, చైనా, పాకిస్థాన్ అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉండగా.. అభివృద్ధి చెందిన జాబితాలో నార్వే మొదటి స్థానంలో నిలిచింది. ఐర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, డెన్మార్క్ వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అభివృద్ధి చెందుతున్న జాబితాలో లితువేనియా, హంగేరీ, అజర్‌బైజాన్, లాత్వియా, పోలెండ్ వరుసగా ఐదు స్థానాల్లో నిలిచాయి. డీఐలో ఆస్ట్రేలియా-9, జర్మనీ-12, కెనడా-17, ఫ్రాన్స్-18,రష్యా-19, యూకే-21, నేపాల్-22, అమెరికా-23, జపాన్-24, ఇటలీ-27, బంగ్లాదేశ్-34, బెజిల్-37, శ్రీలంక-40,దక్షిణాఫ్రికా-69 స్థానాల్లో నిలిచాయి. భారత్‌కన్నా మాలీ, ఉగాండా, రువాండా, బురుండీ, ఘనా, ఉక్రెయిన్, సెర్బియా, ఇండోనేషియా, మాసిడోనియా, మెక్సికో, థాయ్‌ల్యాండ్, మలేషియాలాంటి దేశాలు మెరుగైన స్థానాల్లో నిలవడం గమనార్హం. ఈ సూచీ కోసం ఆయా దేశాల జీవన ప్రమాణాలు, భవిష్యత్ తరాలను ఉద్దేశించి పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన చర్యలను కొలమానంగా తీసుకున్నారు.

7.4 % వృద్ధి నమోదు కావొచ్చు: ఐఎంఎఫ్

దావోస్: పెద్దనోట్ల రద్దు కారణంగా కాస్త వెనుకబడిన భారత ఆర్థిక వ్యవస్థ 2018లో 7.4 శాతం మేర వృద్ధిని నమోదు చేసే అవకాశం కనిపిస్తున్నట్టుగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది.. అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో వేగంగా దూసుకుపోతున్న దేశంగా భారత్ ముందు వరుసలో నిలువనున్నట్టుగా ఐఎంఎఫ్ అభిప్రాయపడింది. 2018లో మన పొరుగు దేశం చైనా 6.8 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉన్నట్టుగా ప్రపంచ ఆర్థిక సదస్సుకు ముందుకు 'వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్' (డబ్ల్యూఈవో) పేర్కొంది. 2019లో భారత్ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని అంచనా కట్టింది. పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ నెమ్మదించినందున 2017 అక్టోబరు వరకు కూడా భారత వృద్ధి రేటును డబ్ల్యూఈవో మార్పులేమీ లేకుండానే స్థిరంగా ఉంచుతూ వచ్చింది. ఇదే కాలంలో ఆసియా దాదాపు 6.5 శాతం మేర వృద్ధిని నమోదు చేయవచ్చని అంచనా కట్టింది. ఆసియా ప్రాంతం మొత్తం ప్రపంచ వృదికి సగ భాగం దన్నును అందించనున్నట్టుగా పేర్కొంది.

మార్కెట్లకు ముందస్తు బడ్జెట్ జోష్



ముంబయి: దేశీయంగా స్టాక్ మార్కెట్ల జోరు కొనసాగుతోంది. కేంద్ర బడ్జెట్‌పై సర్కారు ఇస్తున్న ఆశాజనకమైన లీకులకు తోడు కీలక కంపెనీల సానుకూల ఫలితాల ప్రకటిస్తుండడం తదితర అనుకూల పరిణామాల నేపథ్యంలో మార్కెట్లు కొత్త రికార్డులకు పరుగులు తీస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో కూడా సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త రికార్డు స్థాయిల్లో ముగిశాయి. సెన్సెక్స్ 286 పాయింట్ల లాభంతో 35,798 పాయింట్ల వద్ద ముగియగా... ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 72 పాయింట్ల ర్యాలీతో 10,966 పాయింట్ల వద్ద స్థిరపడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్ రెండు కంపెనీలు నేటి ట్రేడింగ్‌లో రూ.6 లక్షల కోట్లకు పైగా మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో దూసుకుపోయాయి. యాక్సిస్ బ్యాంకు మూడో త్రైమాసికానికి గాను మెరుగైన 25 శాతం వృద్ధితో మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించడంతో ఈ స్టాక్ 4 శాతానికి పైగా లాభపడింది. ట్రేడింగ్ చివరి గంటలో అత్యధికంగా కొనుగోళ్లు నమోదు కావడంతో మార్కెట్లలో మెరుగైన ర్యాలీ నమోదు అయింది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్ల ముగింపు కూడా దగ్గరపడటంతో షార్ట్ కవరింగ్ కూడా జరుగుతోందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడ్డారు. సోమవారం ట్రేడింగ్‌లో అత్యధికంగా లాభాలు నమోదు చేసిన స్టాక్స్ జాబితాలో టీసీఎస్, రిలయన్స్, ఓఎన్‌జీసీ, యాక్సిస్ బ్యాంకు, టెక్ మహీంద్రా స్క్రిప్‌లు నిలిచాయి. అత్యధికంగా నష్టపోయిన స్టాక్స్‌లో హెచ్‌పీసీఎల్, ఐడియా సెల్యులార్, గెయిల్, విప్రో, బీపీసీఎల్‌లు ఉన్నాయి. అటు డాలర్‌తో రూపాయి మారకం విలువ 7 పైసల మేర బలపడి రూ.63.78 స్థాయికి చేరుకుంది. ఎంసీఎక్స్ మార్కెట్‌లో బంగారం ధరలు 46 రూపాయలు పెరిగి 29,801 రూపాయలుగా నమోదు అయింది.

మాదే అవినీతిరహిత డిపార్ట్‌మెంట్

- ప్రతిపక్షాలు ఎంత దుమ్మెత్తిపోసినా ఫర్వాలేదు: కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో కార్మికశాఖ అవినీతి రహిత డిపార్ట్‌మెంట్ అని కార్మిక, హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఆ శాఖకు జాతీయ స్థాయిలో సీఎస్ఐ నిహిలెంట్ ఈ గవర్నెన్స్ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కార్మికశాఖ అధికారులతో కలిసి సచివాలయంలో ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ... ఇటీవలే కొలకత్తాలో జరిగిన సమావేశంలో ఈ అవార్డును కార్మికశాఖ కమిషనర్ నదీమ్ అహ్మద్ అందుకున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కార్మికశాఖ బాగా పనిచేస్తుందని చెప్పారు. అవినీతి నిరోధానికి ఆన్‌లైన్‌లో లైసెన్సులు జారీ చేస్తున్నామనీ, పారదర్శకత పాటిస్తున్నామని అన్నారు. ప్రతిపక్షాలు తమపై ఎంత దుమ్మెత్తి పోసినా ఫర్వాలేదనీ, ప్రజలు తమవెంటే ఉన్నారని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి శశాంక్‌గోయల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నదీమ్ అహ్మద్‌ను సన్మానించారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి సమావేశం

భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి సమావేశం సచివాలయంలో హోం, కార్మికశాఖ మంత్రి నాయినీ నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. సభ్యత్వమున్న కార్మికులకు మాత్రమే పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంపై బోర్డు సభ్యులు చర్చించారు. భవిష్యత్తులో నూతన పథకాలను ప్రవేశపెట్టి కార్మికులకు మరింతగా లబ్ది చేకూర్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలని బోర్డు నిర్ణయించింది. సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి శశాంక్‌గోయల్, కమిషనర్ అహ్మద్ నదీమ్, బోర్డు కార్యదర్శి, సీఈఓ రవీందర్‌రెడ్డి, బోర్డు సభ్యులు ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, పద్మశ్రీ పాల్గొన్నారు.

ప్రయివేటు వైపు..!

కొత్త విద్యావిధానం రూపకల్పనలో ఉన్నత విద్యామండలి

- ఆ దిశగా 2020, 2024 ప్రణాళిక తయారు
- ఉన్నత విద్యాసంస్థల హేతుబద్ధీకరణ!
- అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాల పెంపే లక్ష్యం
- పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగం బాధ్యతల నుంచి తెలంగాణ ప్రభుత్వం తప్పించుకునేందుకు రంగం సిద్ధమవుతున్నది. ప్రభుత్వ విద్యారంగాన్ని క్రమంగా బలహీనం చేస్తూ, ప్రయివేటు విద్యారంగాన్ని ప్రోత్సహించాలన్న ప్రయత్నాలు ముమ్మరమ య్యాయి. అందులో భాగంగానే రాష్ట్రంలో ప్రయివేటు విద్యారంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) నిర్ణయించడమే ఇందుకు నిదర్శనం. ప్రయివేటువైపు వెళ్లేందుకు కొత్త విద్యావిధానాన్ని రూపకల్పన చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి సూచించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఉన్నత విద్యామండలి 2018 నుంచి 2020 వరకు తాత్కాలిక ప్రణాళిక, 2020 నుంచి 2024 వరకు దీర్ఘకాలిక ప్రణాళికలను తయారు చేసింది. వీటిని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)కి పంపించింది. ఇంకోవైపు ఉన్నత విద్యాసంస్థల హేతుబద్ధీకరణ చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రయివేటు రంగంలోని ఉన్నత విద్యాసంస్థలను హేతుబద్ధీకరణ ప్రక్రియ నిర్వహించాలని ప్రకటించింది. దీంతో ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటించిన కాలేజీలకే ఇకనుంచి అనుబంధ గుర్తింపు వచ్చే



అవకాశముంది. విద్యార్థులు తక్కువున్నారని, నిబంధనలు పాటించడం లేదనే కారణంతో గుర్తింపు ఇవ్వకపోవడంతో ఆ విద్యాసంస్థలు భవిష్యత్తులో మూతపడే ప్రమాదం లేకపోలేదు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని నిర్ణయించింది. పట్టణ, గ్రామీణ అన్న తేడా లేకుండా విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా నిర్దేశించకుంది. నిధుల కొరత రాకుండా విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. అంతర్జాతీయ స్థాయిలో విద్యాసంస్థల్లో ప్రమాణాలు పెంచాలని నిర్ణయించింది.

తాత్కాలిక ప్రణాళిక (2018-2020)

- విద్యార్థులందరికీ సమాన విద్యావకాశాలు అందించాలి
- విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ అందించడంపై కేంద్రీకరించాలి
- దేశంలో స్కిల్ క్యాపిటల్‌గా తెలంగాణ నిలవడాలి.
- క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్స్ (క్యూఐపీ)ని టీఎస్‌సీహెచ్ఈప్రారంభిస్తుంది.
- విద్యావకాశాలతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలి. (ఎస్‌టీఈఎం)ను పెంచేందుకు కరికులమ్ మార్చాలి.
- పరిశ్రమల్లో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ఉండాలి. దీనిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. పరిశోధనలను ప్రోత్సహించాలి.
- దోస్త్, సీబీసీఎస్ విధానాన్ని పటిష్టం అమలు చేయాలి.
- పరిశ్రమలను తప్పనిసరిగా సందర్శించాలి. కుదుర్చుకోవాలి. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించాలి.
- ఓ విశ్వవిద్యాలయంలో జరిగే మంచి పనులను ఇతర విశ్వవిద్యాలయాలకు నిరంతరం అందించాలి.
- విశ్వవిద్యాలయాల బలోపేతమే లక్ష్యం.
- అధ్యాపకుల కోసం వేసవి పాఠశాల నిర్వహించాలి. ప్రోత్సహించాలి.
- విశ్వవిద్యాలయాల్లో ప్రతిభ, వనరులు, సుపరిపాలన అందించడం కోసం కేంద్రీకరించి పనిచేయాలి.
- విశ్వవిద్యాలయాలు, అన్ని విద్యాసంస్థల్లోనూ ఐసీటీని వినియోగించాలి.
- విశ్వవిద్యాలయం, పరిశ్రమల మధ్య అనుసంధానం ఉండాలి
- మౌలిక వసతుల కల్పన కోసం నిధుల విడుదల సంస్థలతో ఉన్నత విద్యామండలి నిరంతరం పర్యవేక్షణ ఉండాలి.
- విద్యార్థులకు ఈ లైబ్రరీ సేవలు అందించాలి.
- విశ్వవిద్యాలయాలకు మరింత స్వయంప్రతిపత్తి అందిచాలి. ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలన్నింటిలో హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలి.
- అకడమిక్ క్యాలెండర్‌ను పాటించాలి. చేయాలి.
- కార్పొరేట్ రెస్పాన్సబులిటీ ఫండ్ (సీఎస్ఆర్)ను పెంచాలి. అంతర్జాతీయ స్థాయికి అభివృద్ధి చేయాలి.
- విద్యాసంస్థల్లో ఇంకుబేటర్లు ప్రారంభించాలి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ (ఐపీ)ని స్థాపించాలి.

దీర్ఘకాలిక ప్రణాళిక (2020-2024)

- అందరికీ అందుబాటులోకి విద్య తేవడం, నాణ్యమైన విద్య అందించాలి
- విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల్లో నైపుణ్యం పెంచాలి.
- తెలంగాణ విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలు అందిపుచ్చుకోవాలి.
- సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్
- విజ్ఞానంతో ఉద్యోగాలు పొందే దశ నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.
- వృత్తి విద్యను ప్రోత్సహించాలి.
- అంతర్జాతీయ ఖ్యాతి గడించిన విద్యాసంస్థలతో ఒప్పందాలు
- ప్రభుత్వరంగంలో ఉన్నత విద్యపట్ల అందరిలోనూ విశ్వాసాన్ని పెంచాలి.
- సృజనాత్మకతను పెంపొందించాలి.
- అధ్యాపకుల అవార్డులను నామినేషన్ల ద్వారా స్వీకరించి
- నిటిఅయోగ్, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలకు
- అనుగుణంగా ఉన్నత విద్యాభివృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి.
- రాష్ట్రంలో ప్రయివేటు విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. అందుకు అవసరమైన విధానపరమైన మార్గదర్శకాలను రూపొందించాలి.
- విద్యాసంస్థల్లో నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.
- అంతర్జాతీయ స్థాయికి ప్రమాణాలు పెంచాలంటే మరిన్ని నిధులు కేటాయించాలి.
- ఇన్నోవేషన్ హబ్‌లు ప్రారంభించాలి.
- రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్
- విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్యబద్ధంగా సుపరిపాలన అందించాలి.
- హైదరాబాద్‌తో అన్ని విద్యాసంస్థలను అనుసంధానం
- మూల్యాంకనం విధానాన్ని మెరుగుపర్చాలి. విద్యాసంస్థలను
- నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


బుర్రా వెంకటేశం

- నాయి బ్రాహ్మణ వృత్తి నైపుణ్య శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యువత కోసం ప్రభుత్వం ప్రకటిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఆధునిక కాలంలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నాయి బ్రాహ్మణులు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచిం చారు. సోమవారం సంక్షేమ భవనంలో నాయి బ్రాహ్మణ శిక్షణా శిబిరాన్ని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రాజేంద్రతో కలిసి ప్రారంభించారు. నాయి బ్రాహ్మణులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని అందించేందుకు 31 జిల్లాల నుంచి 650 యువతీ, యువకులను ఎంపిక చేశామన్నారు. మొదటి విడతగా 160 మందికి శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. శిక్షణా తరగతులను పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంబీసీల అభివృద్ధి పలు సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నామని తెలిపారు. నాయి బ్రాహ్మణులకు ఇస్తున్న తరహాల్లోనే ఇతర కులాల వారికి కూడా వృత్తి నైపుణ్య శిక్షణను అందిస్తామన్నారు.





తెలంగాణ చరిత్ర, సంస్కృతులను వెలికి తీయడం, ఇప్పటికే వెలుగు చూసిన చారిత్రక, వారసత్వ సంపదను కొత్త కోణాల్లో చూడటం వర్తమాన దృశ్యంగా కనిపిస్తున్నది. ప్రత్యేక తెలంగాణ వచ్చిన తరువాత మిగతా విషయాల్లో ఏం మేలు జరిగిందో ఏమో కాని పురావస్తు సంపద పరిరక్షణ, చరిత్ర, సంస్కృతులకు తగిన గుర్తింపు తీసుకువచ్చి 'ఇది మా వారసత్వ సంపద' అని తెలంగాణీయులు గర్వంగా చెప్పకునే వాతావరణం మాత్రం ఏర్పడింది. ఈ వాతావరణం ఏర్పడటంలో యూనిర్సిటీలు, వ్యక్తులు, సంస్థలు గణనీయమైన కృషి చేస్తున్నా రాష్ట్రప్రభుత్వ పురావస్తు శాఖ పాత్ర మాత్రం మరువరానిది. అనేక కట్టడాలను బాగుచేసి రక్షణ కల్పించడంతో పాటు, అనేక పుస్తకాలను పునర్ముద్రించడంలో నిమగ్నమయింది. మారుమూల ప్రాంతాల్లో అన్వేషణ సాగించి మరుగున పడిపోయిన చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను గుర్తిస్తున్నది. అట్లాగే అనేక పురావస్తు ప్రాధాన్యం ఉన్న స్థలాల్లో తవ్వకాలు జరిపి ఈ నేలపై ఒకప్పుడు నడయాడిన మానవుల జీవన శైలిని మన కళ్లముందుంచుతున్నది. ఇంతేకాకుండా సెమినార్లు, కాన్ఫరెన్సులు నిర్వహించి జాతీయ, అంతర్జాతీయ పరిశోధకులను ఆహ్వానించి తెలంగాణ, చరిత్ర సంస్కృతులపై లోతైన పరిశోధనలు జరిగేలా స్థానిక పరిశోధకుల్లో స్ఫూర్తి రగిలిస్తోంది. అందులో భాగంగానేఈ నెల (జనవరి) 19, 20 తేదీల్లో 'మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ'లో అంతర్జాతీయ సెమినార్ జరిపింది. ఆ సెమినార్‌లో మన చరిత్ర, సంస్కృతులపై జరిగిన చర్చలు, వెలుగు చూసిన విశేషాల సమాహారాన్ని 'జాతర' ప్రత్యేకంగా అందిస్తున్నది.

తెలంగాణ సంస్కృతి

తెలుగు జిలుగులు

**భూగోళం పుట్టుకకోసం
రాలిన సుర గోళాలెన్నో
ఈ మానవ రూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో
ఒక రాజును గెలిపించుటలో
ఒరిగిన నరకంతాలెన్నో**

అన్నారు మహా కవి దాశరథి. భూమి పుట్టుక, దానిపై మానవుని అవతరణ, పరిణామక్రమం; ఇప్పటివరకు సాగిన ప్రయాణం అంతా కోట్లు, లక్షల సంవత్సరాల కాల క్రమంలో జరిగింది. కాలం ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. మార్పు దాని సహజ లక్షణం. కాలానుగుణంగా మారిన జీవరాశి బతికి మనుగడ సాగించింది. మారలేని జీవులు నశించిపోయాయి. ఎన్నో నాగరికతలు, సంస్కృతుల ఉత్థాన పతనాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఈ వాస్తవాన్ని పురావస్తు శాస్త్రం చెప్పినంత సమర్థవంతంగా మరో సైన్స్ చెప్పలేదు. అటువంటి పురావస్తు శాఖ కూడా ఇప్పుడు తన పేరు 'హెరిటేజ్ తెలంగాణ' (తెలంగాణ వారసత్వం)గా మార్చుకున్నది. ఆ విధంగా కొత్త పేరుతో కొంగొత్త శాస్త్రీయ విధానాలతో తెలంగాణ చరిత్ర సంస్కృతులను దీప్తివంతం చేయడానికి ముందుకు సాగుతున్నది. గత ఏడాది నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు మంచి స్పందన రావడం, ఆశించిన ప్రయోజనం చేకూరడంతో పురావస్తు శాఖ మరింత ఉత్సాహంతో ఈ ఏడాది కూడా ఇంటర్నేషనల్ సెమినార్ నిర్వహించింది. ఈ నిర్వహణ ఇక ముందు కూడా కొనసాగుతుందని హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ విశాలాచ్చి అన్నారు.

ఈ సెమినార్‌లో దేశ విదేశాలకు సంబంధించినవారు మొత్తం 35 మంది స్కాలర్స్ పరిశోధనా పత్రాలు సమర్పించారు. చర్చల్లో పాల్గొనడానికి, వీక్షించడానికి వందలమంది మేధావులు, సాధారణ జనం హాజరయ్యారు. ఈ సెమినార్‌కి హాజరైన బ్రిటన్‌కి చెందిన రెబెకా డార్లే... "మా దేశంలో ఇటువంటి సెమినార్లకు ఇంత పెద్ద ఎత్తున రావడం చూడలేదు. ఎంతో ఆసక్తితో సెమినార్‌కి రావడం, అర్థవంతమైన చర్చలను జరపడం మా దేశంలో అరుదు. ఆసక్తి ఉన్న ఏ కొద్దిమందో మాత్రమే ఇటువంటి సెమినార్లకు వస్తుంటారా"ని ఆమె 'జాతర' ప్రతినిధితో అనడాన్ని బట్టి ఎంత విజయవంతంగా సెమినార్ నిర్వహణ జరిగిందో అర్థమవుతుంది.

ఇది సాంస్కృతిక వలసల గడ్డ

తెలంగాణ సంస్కృతి బహుళ సంస్కృతుల మిశ్రమ సారం అన్నారు కేరళ రాష్ట్ర పురావస్తు శాఖ రిటైర్డ్ డైరెక్టర్ డా॥టి.సత్యమూర్తి. తెలంగాణలో ప్రస్తుతం మనం చూస్తున్న అనేక కట్టడాలపై చుట్టుపక్కల ప్రాంతాల వాస్తు శిల్పాల ప్రభావం ఉందని ఆయన అన్నారు. ఇందుకు కారణం భౌగోళికంగా తెలంగాణ ఉన్న స్థానమే అంటారాయన. అటు ఉత్తర భారత దేశానికి ఇటు దక్షిణ భారత దేశానికి నడుమ ఉండటం వల్ల రెండు ప్రాంతాలలోని సంస్కృతి సంప్రదాయాల ప్రభావం తెలంగాణపై పడింది. ముఖ్యంగా మనం కాకతీయుల దేవాలయ నిర్మాణం గురించి ఎంతో గర్వంగా చెప్పుకుంటాం. ఈ దేవాలయాలపై అనేక ఇతర శైలుల ప్రభావం ఉంది. కాకతీయుల దేవాలయ విమానాన్ని పరిశీలిస్తే 'తలచెద' ప్రభావం కనిపిస్తుంది. శిల్పం, దేవతా విగ్రహ రూపకల్పనలో దక్కని, దక్షిణ శిల్పకళా ప్రభావం పడి కొంగొత్త కాకతీయ శిల్పం ఆవిర్భవించింది. మకర తోరణాలు, మదనికా శిల్పాలు కాకతీయ శిల్పానికి ఒక ప్రత్యేకతను సంతరించి పెట్టాయి. కాకతీయ కట్టడాలు కొన్ని చాళుక్యుల నార్మాణ సాంకేతిక విజ్ఞానాన్ని కొంతవరకు అనుసరించి నిర్మితమయ్యాయి. కాకతీయ తోరణాలపై అంతకు ముందు కాలంలో ఉన్న బార్హుత్, సాంచి స్థూపాల తోరణాలు, ఇతర దేవాలయ తోరణాల ప్రభావం ఉన్నట్లు డా"సత్యమూర్తి మూర్తి సోదాహరణంగా వివరించారు.



ఈ కృషి కొనసాగుతుంది

తెలంగాణ పురావస్తు శాఖ పేరును 'హెరిటేజ్ తెలంగాణ'గా మారుస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్టంలో పురావస్తు కట్టడాలు, స్థలాలు ఇతర విషయాలకు సంబంధించి పకడ్బందీ నిబంధనలు పొందుపరిచారు. అదే సమయంలో తేలికగా మార్పులు చేసి ప్రయోజనకరమైన నిబంధనలను చేర్చే వెసులుబాటూ దీనిలో ఉన్నాయి. మా శాఖ ద్వారా తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వాలకు ఎనలేని కృషి జరుగుతున్నది. స్థానిక పరిశోధకులకు అంతర్జాతీయ పరిశోధకులతో సంబంధ బాంధవ్యాలను ఏర్పరచి వారిని కూడా మంచి రీసెర్చర్స్‌గా తయారు చేయడానికి ఇటువంటి అంతర్జాతీయ సెమినార్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రతి ఏడాది ఈ సెమినార్ నిర్వహిస్తాం.

-ఎన్.ఆర్.విశాలాచ్చి
డైరెక్టర్, హెరిటేజ్ తెలంగాణ

ఆయుర్వేదం

మన భారతీయ చరిత్రలో ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానం ఉంది. చరకుడు వంటివారు నాటి ఆయుర్వేద వైద్యం గురించి గ్రంథాలు రాశారు. అనేక శాసనాలు, తాళపత్రాల్లో మన ఆయుర్వేద విజ్ఞానం గురించి ఎన్నో విశేషాలు లిఖితమై ఉన్నాయి. మనుషులకే కాక, పశువులకు వైద్యశాలలు నిర్మించిన వైనం శాసనాల వల్ల తెలుస్తున్నది. ఫణిగిరివంటి చోట్ల తవ్విన తవ్వకాల్లో వందల ఏండ్ల క్రితం నాటి వైద్యానికి సంబంధించిన ప్రస్తావనలు కనిపిస్తున్నాయి. ఈ విశేషాలన్నింటినీ సవివరంగా డా॥గోలి పెంచల ప్రసాద్ తన పరిశోధనాపత్రంలో ఇచ్చారు.

బౌద్ధం

సెమినార్‌లో అధికంగా పరిశోధనా పత్రాలు సమర్పించిన విభాగం బౌద్ధం. ప్రాచీన బౌద్ధానికి తెలంగాణ ఎట్లా నిలయంగా ఉందో చెప్తున్న వ్యాసంగ పత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫణిగిరి బౌద్ధక్షేత్రంలోని తోరణాలపై ఉన్న శిల్ప విశేషాలపై సమర్పితమైన పత్రం బాగా ఆకట్టుకున్నది. విదేశీయులు సైతం ఫణిగిరిపై పరిశోధన చేసి కొత్త కోణాలను ఆవిష్కరించారు. బౌద్ధానికి సంబంధించిన ఫొటో స్లైడ్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పునర్నిర్మాణం, రక్షణ

ఆర్కియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ), తెలంగాణ రాష్ట్ర పురావస్తు శాఖకి చెందిన చెందిన నిపుణులు సమర్పించిన పరిశోధనా పత్రాలు భారతీయ పురావస్తు నిపుణులు ఎంత శాస్త్రీయంగా, హేతుబద్ధంగా అన్వేషణ, ఉత్ఖాతన (తవ్వకాలు), పునర్నిర్మాణం (కన్సర్వేషన్) నిర్వహిస్తారో కండ్లకు కట్టాయి. ముఖ్యంగా వరంగల్ కోటలోని స్వయంభు దేవాలయ ప్రాంగణంలో చేపట్టిన ఫీల్డ్ వర్క్ ఆ ప్రదేశం ఏ విధంగా మార్పులకు గురవుతూ వచ్చిందో స్పష్టంగా తెలియజేసింది. ఎప్పుడో 1934-35లో నిజాం ప్రభుత్వకాలంలో జరిపిన చిన్న తవ్వకంలో స్వయంభు దేవాలయం గ్రౌండ్ ప్లాన్‌లో కొంత భాగం, కొన్ని వస్తు విశేషాలు, శిల్పాలు బయటపడ్డాయి. వాటిని అక్కడి నుంచి వేరు వేరు మ్యూజియాలకు తరలించారు. తవ్విన ప్రాంతం మళ్లీ పూడిపోయింది. ఎఎస్ఐవారు 2002-03, 2003-04లో జరిపిన తవ్వకాల్లో అనేక విశేషాలు బయటపడ్డాయి. ఇక్కడ వందల ఏండ్ల నుంచి ఇప్పటివరకు మానవ ఆవాసం కొనసాగుతున్న ఆనవాలు తెలిపే వస్తు విశేషాలు బయటపడ్డాయి. అట్లాగే స్వయంభు దేవాలయ సముదాయం చుట్టూ పెద్ద ప్రాకారం ఉన్నట్లు కూడా బయటపడింది. ఈ కట్టడాలకు సంబంధించిన రాళ్లను తీసుకువెళ్లి ఇతర నిర్మాణాలకు వాడుకున్నట్లు పురావస్తు నిపుణులు గుర్తించారు.

పురావస్తు శాఖ రక్షణలో ఉన్న చాలా కట్టడాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. అందుకు గోల్కొండ మంచి ఉదాహరణ. ఇక్కడ జరిగిన ఆక్రమణలు, అతిక్రమణల గురించి రాయాలంటే ఒక పుస్తకమే అవుతుంది. ప్రస్తుతం ఈ కోటలో ఉన్న 'బాగ్ ఎ నయా ఖిలా'ను సుభ్రం చేసి దానిని సందర్శకుల కోసం ఒక ఆర్కియోలాజికల్ పార్క్‌గా రూపుదిద్దడానికి ఎఎస్ఐ పడిన కష్టాలు, సాధించిన విజయాన్ని వివరిస్తూ సమర్పించిన పత్రం 'మనసుంటే మార్గం ఉంటుంది' అనే నానుడిని గుర్తు చేస్తుంది. అధికార్లు తమ పని తాము చేసుకుపోవడానికి ఎన్ని అడ్డంకులు వస్తాయి, వాటిని సహనంతో ఏవిధంగా పరిష్కరించుకోవచ్చో చెప్పే మోడల్‌గా ఈ రీసెర్చ్ పేపర్ నిలిచిపోతుంది.

గత ఏడాది తెలంగాణ రాష్ట్ర పురావస్తు శాఖవారు సిద్ధిపేట జిల్లాలోని నర్మెట్ట, పలమకుల గ్రామ పరిసరాల్లో జరిపిన రాక్షసగుళ్లు (మెగాలితిక్ బరియల్స్) అనే ఇనుపయుగం నాటి సమాధుల తవ్వకాలు జరిపారు. ఆ తవ్వకాల్లో బయటపడిన ఆసక్తికరమైన విశేషాలను తెలియజేస్తూ ఓ పరిశోధనా పత్రం సమర్పితమయింది. కెయిర్న్ సర్కిల్స్ రకానికి చెందిన ఈ సమాధుల్లో నాటి మానవుల ఎముకల అవశేషాలతోపాటు వారు వాడుకున్న మట్టిపాత్రలు, ఆభరణాలు, డైమండ్ ఆకారంలో ఎముకలతో చేసిన బిళ్లలు వంటి విశేషాలను నిపుణులు వెలికి తీశారు. ఇక్కడ దొరికిన ఈ డైమండ్ ఆకారపు బిళ్లలు ఇప్పటివరకు ఇండియాలో మరెక్కడా బయల్పడలేదనేది పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయం.

అట్లాగే తెలంగాణలోని కిన్నెరసాని నదీలోయలో మెగాలితిక్ బరియల్స్ విశేషాలను వివరించిన మరో పరిశోధనా పత్రం కూడా విశేషంగా ఆకట్టుకున్నది. శార్కో ఫాగయ్‌లు, క్రాస్‌లా కనిపించే మానవ ఆకారాలుగా మలిచిన పెద్ద పెద్ద రాళ్లు, డోల్మెన్స్ వంటి అనేక విశేషాలను ప్రతిభావంతంగా ప్రకటితమయ్యాయి ఈ పరిశోధనా పత్రంలో.

రామప్ప దేవాలయం

రామప్ప దేవాలయ నిర్మాణం, అందులోని శిల్ప సంపద పై మంచి పరిశోధన వెలుగు చూసింది. తెలంగాణ వాస్తువు, శిల్పానికి సంబంధించి ఈ దేవాలయం ఓ కలికితు రాయిగా పరిశోధకులు గుర్తించారు. సమకాలీన నృత్య విశేషాలు, సంగీత సాధనాలు, సాంఘిక జీవనానికి సంబంధించిన శిల్పాలు, వాటి ప్రాధాన్యం గురించి సవివరమైన చర్చ జరిగింది.

అన్నింటికన్నా ముఖ్యమైన మరో విషయం ఏమంటే కాకతీయుల కాలంలోజాయప సేనాని రచించిన 'నృత్తరత్నావళి' గ్రంథంలో ఉన్న అనేక నృత్య భంగిమలు రామప్ప దేవాలయంపై ఉన్నట్లు ప్రత్యేక ఉపన్యాసాలు ఇచ్చి, ఆ నృత్య భంగిమలను ప్రదర్శించి చూపిన డాక్టరేట్లు ప్రేక్షకుల అభినందనలు అందుకున్నారు.

అవీ ఇవీ

తెలంగాణలో ఉన్న రాతి చిత్ర కళపై సవివరమైన వివరణతో ఒక పత్ర ప్రకటితమయింది. ప్రాచీన మానవుడు భాష అభివృద్ధి చెందక ముందు తన భావాలను వ్యక్తం చేసింది బొమ్మలద్వారానే. రంగుల బొమ్మలు, రాతిపై రాయి లేక లోహంతో గీసిన గీతల ద్వారాను బొమ్మలు వేయడం అప్పటి విధానం. ప్రాచీన మానవుని బొమ్మలను ఎట్లా అర్థం చేసుకోవాలో చక్కగా వివరించిన పత్రం ఇది.

అట్లాగే గోల్కొండ కుతుబ్ షాహీల పాలన, కళలు, సాహిత్యం, వర్తకవాణిజ్యాలపై చాలా పరిశోధనా పత్రాలు వచ్చాయి.

ఓ విదేశీయుడు "మధ్యయుగాల్లో తెలంగాణలో నీరు.." అనే అంశంపై సమర్పించిన వ్యాసం చాలామంది మన్ననలను అందుకుంది. ఈ వ్యాసంలో ఆయన నాడు చెరువుల నిర్మాణం, వాటిని రిపేర్ చేయడం అందుకు అనుసరించే విధానాలు, ఏర్పరచుకున్న వ్యవస్థల గురించి సవివరంగా పేర్కొన్నారు.

రోమన్, బైజాంటెన్ నాణేలు తెలంగాణ, దాని పరిసర ప్రాంతాల్లో చాలా లభించాయి. అవి నేటి స్టేట్ మ్యూజియంలో ఉన్నాయి. వాటిని అధ్యయనం చేసి ప్రాచీన తెలంగాణలో వాణిజ్యం ఎంత ఉచ్ఛస్థాయిలో ఉందో వివరించింది ఓ విదేశీ యువతి. అట్లాగే చాళుక్యుల కాలంలో ముద్రితమైన బంగారు నాణేల ప్రాధాన్యతను మరో పరిశోధన పత్రం చెప్పింది.


ఇక పూనేలోని ప్రఖ్యాత దక్కన్ కాలేజిలో పరిశోధక విద్యార్థిగా ఉన్న ఓ యువతి మధ్య గోదావరి బేసిన్‌లో మధ్య ప్రాచీన శిలాయుగం నాటి జీవనం ఎట్లా ఉందో తెలియజేసే ఓ అద్భుతమైన పరిశోధన పత్రాన్ని ప్రజెంట్ చేశారు. పోచంపాడు, గౌతంనగర్ అనే రెండు గ్రామ పరిసరాలను తన అధ్యయన క్షేత్రంగా ఎంచుకుని పనిచేశారు. ఆమె ఆర్కియాలజీ ఫీల్డ్ వర్క్ ఎంత శాస్త్రీయంగా ఉంటుందో, ఆధునిక పరిశోధనా విశ్లేషణా పద్ధతుల ద్వారా ఫీల్డ్ రిపోర్టులు ఎట్లా రాయవచ్చో తెలియజేసి ఓ మోడల్‌గా నిలిచే రీసెర్చ్ పేపర్ని సమర్పించారామె.

హెరిటేజ్ తెలంగాణ శాఖ ఇక ముందు ముందు కూడా మంచి ప్రాజెక్టులు చేపట్టి మన చారిత్రక వారసత్వ సంపదకు సముచిత గౌరవం, రక్షణ కల్పిస్తుందని జనం ఆశిస్తున్నారు.


-జి.శివరామకృష్ణయ్య
7702508259















కంటిచూపు సమస్యతో ఆరేండ్ల వయసులో వైద్యుడి వద్దకు వెళ్లిన ఆ బుడతడు.. కంటిచూపు మెరుగుదల కోసం చేసిన ప్రయత్నం అతడిని ఇప్పుడు సంచలన హీరోగా నిలిపింది. ఎవరి ఆటనైతే అతడు చూస్తూ మైమరిచిపోయాడో, ఎవరి ఆటకు ఫిదా అయ్యాడో ఇప్పుడు అతడిపైనే జయకేతనం ఎగురవేశాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి చేరిన తొలి కొరియా ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అతడే 21 ఏండ్ల హ్యాన్ చంగ్. ప్రీ క్వార్టర్స్‌లో వరుస సెట్లలో మాజీ ప్రపంచ నెం.1 నొవాక్ జకోవిచ్‌ను ఓడించిన చంగ్ తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయం నమోదు చేశాడు. చంగ్ జోరుకు ఆరుసార్ల విజేత జకోవిచ్ మెల్‌బోర్న్ నుంచి నిష్క్రమించాడు.

జకో నిష్క్రమణ



నొవాక్ జకోవిచ్

- కొరియా చిన్నోడు చంగ్ సంచలనం
- క్వార్టర్స్ చేరిన తొలి కొరియన్‌గా రికార్డు
- రోజర్ ఫెదరర్ అలవోక విజయం
- క్వార్టర్స్‌లో కెర్బర్, హలెప్, బెర్డిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2018

నవతెలంగాణ-మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అతిపెద్ద సంచలనం నమోదైంది. గాయం నుంచి కోలుకుని ఆరు మాసాల విశ్రాంతి తర్వాత రాకెట్ పట్టిన సెర్బియా వీరుడు, మాజీ వరల్డ్ నెం.1 నొవాక్ జకోవిచ్‌కు ప్రీ క్వార్టర్స్‌లో ఊహించని భంగపాటు. గాయం నుంచి కోలుకుని తొలి మూడు మ్యాచుల్లో ఆకట్టుకునే ప్రదర్శన చేసిన జకోవిచ్‌కు సెమీస్ వరకూ ఎదురులేదనే అనిపించింది. కానీ వరల్డ్ నెం.58, దక్షిణ కొరియా యువ కెరటం హ్యాన్ చంగ్ అతడి జోరుకు బ్రేక్ వేశాడు. క్వార్టర్స్‌కు చేరకముందే జకోవిచ్‌ను సాగనంపాడు. 6-7(4-7), 5-7, 6-7(3-7)తో వరుస సెట్లలో జకోవిచ్‌పై మెరుపు విజయం సాధించాడు. 201 నిమిషాల ప్రీ క్వార్టర్స్ పోరులో గెలుపొందిన చంగ్ ఓ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించిన తొలి కొరియా ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. రెండో సీడ్ రోజర్ ఫెదరర్, చెక్ హీరో థామస్ బెర్డిచ్, సాండ్‌గ్రెన్ (అమెరికా)లు క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకున్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో ఎంజెలికా కెర్బర్ (జర్మనీ), సిమోన హలెప్ (రోమానియా), మడిసన్ కీస్ (అమెరికా)లు ప్రీ క్వార్టర్స్‌లో అలవక విజయాలు సాదించి ముందంజ వేశారు.



హ్యాన్ చంగ్


సూపర్ చంగ్ : చిన్న బంతులు, ప్రత్యేకించి ఎల్లో బంతులు చూస్తే కంటి చూపు మెరుగవుతుందనే వైద్యుడి సలహా మేరకు టెన్నిస్ చూడటం ఆరంభించి, అభిరుచితో టెన్నిస్ ఆడటం మొదలెట్టిన చిన్నోడు హ్యాన్ చంగ్. 2014 ప్రొఫెషనల్‌గా మారినా, చెప్పుకోదగిన విజయమేమీ లేదు!. పైగా కొరియాలో టెన్నిస్‌పై పెద్ద ఆసక్తి సైతం ఎవరకీ ఉండదు. నొవాక్ జకోవిచ్ సంగతి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వరుస గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో అదరగొట్టి, గాయంతో కాస్త డీలా పడినా అతడి రాకెట్ పవర్‌ను ఎన్నడూ తక్కువ చేయడానికి వీల్లేదు. జకోవిచ్‌తో ప్రీ క్వార్టర్స్ పోరు అంటే చంగ్ సైతం విజయాన్ని ఊహించి ఉండకపోవచ్చు!. కానీ అద్భుతంగా ఆడిన చంగ్ మాజీ వరల్డ్ నెం.1కు షాకిచ్చాడు. తొలి సెట్‌లో వరుసగా నాల్గు గేమ్ పాయింట్లు సాధించిన చంగ్ 4-0తో ఔరా అనిపించాడు. కానీ జకోవిచ్ పుంజుకుని స్కోరు 5-5తో సమం చేశాడు. ఈ సమయంలో జకోవిచ్ 6-5తో ముందంజ వేసినా.. ఓ గేమ్ పాయింట్ సహా టైబ్రేకర్‌లో 7-4తో పైచేయి సాధించి తొలి సెట్ సొంతం చేసుకున్నాడు. అదే జోరుతో రెండో సెట్‌లోనూ ఆధిక్యం దక్కించుకున్నాడు. 4-1తో జోరు కొనసాగించాడు. కానీ జకోవిచ్ వరుస పాయింట్లతో రేసులో నిలిచాడు. 5-5తో స్కోర్లు సమమైన వేళ.. వరుసగా రెండు గేము పాయింట్లు కొట్టిన చంగ్ రెండో సెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. సెట్ ఓడితే క్వార్టర్స్ బెర్త్ కోల్పోయే పరిస్థితిలో జకోవిచ్ మూడో సెట్‌లో 1-0తో సానుకూల ఆరంభం చేశాడు. కానీ చంగ్ వరుస పాయింట్లు సాధించి 3-1తో ముందంజ వేశాడు. జకోవిచ్, చంగ్‌లు ప్రతి గేమ్ పాయింట్ కోసం హోరాహోరీగా తలపడగా.. మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. మరోసారి 5-5, 6-6తో ఇద్దరూ సమవుజ్జీలుగా నిలిచారు. టైబ్రేకర్‌కు దారితీసిన సెట్‌లో 6-3తో పైచేయి సాధించిన చంగ్ నవ చరిత్రకు శ్రీకారం చుట్టాడు. క్వార్టర్‌ఫైనల్లో అమెరికా ఆటగాడు సాండ్‌గ్రెన్‌తో చంగ్ తలపడనున్నాడు.



కెర్బర్

పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ రోజర్ ఫెదరర్ అలవోకగా క్వార్టర్స్‌లో కాలుమోపాడు. మోర్టన్ (హంగరీ)పై 6-4, 7-6(7-3), 6-2తో వరుస సెట్లలో గెలుపొందాడు. చెక్ రిపబ్లిక్ ఆటగాడు థామస్ బెర్డిచ్ 6-1, 6-4, 6-4తో ఫోగ్నినిపై గెలుపొందాడు. క్వార్టర్స్‌లో థామస్ బెర్డిచ్‌తో ఫెదరర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సిమోన హలెప్ క్వార్టర్స్‌కు చేరింది. 6-3, 6-2తో 79 నిమిషాల్లోనే నొజోమి ఒసాక (జపాన్)పై విజయం సాధించింది. జర్మనీ భామ ఎంజెలికా కెర్బర్ సైతం క్వార్టర్స్‌లో ప్రవేశించింది. 4-6, 7-5, 6-2తో చైనీస్ తైపీ క్రీడాకారిణి సు వీపై గెలుపొందింది. మడిసన్ కీస్ 6-3, 6-2తో కరోలినా గార్సియాను ఓడించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్నకు భంగపాటు. రోజర్ వాసెలిన్ తోడుగా బరిలోకి దిగిన బోపన్న 4-6, 7-6(7-5), 3-6తో పరాజయం పాలయ్యాడు. అమెరికా ఆటగాడు రాజీవ్ రామ్‌తో కలిసి ఆడిన దివిజ్ శరణ్ సైతం 6-3, 6-7(4-7), 4-6తో మూడో రౌండ్లో తలొగ్గాడు.

ఏప్రిల్ 7 నుంచి ఐపీఎల్ సందడి



- ఏప్రిల్ 6న ముంబయిలో ఆరంభ వేడుకలు
- మే 27న వాంఖడేలోనే ఐపీఎల్ తుది పోరు
- మ్యాచ్ సమయాల్లోనూ మార్పులు
- ప్రకటించిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఈ ఏడాది క్రికెట్ పండుగ ఏప్రిల్ 7 నుంచి షురూ కానున్నది. ఈ మేరకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) గవర్నింగ్ కౌన్సిల్ సోమవారం 11వ సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఏప్రిల్ 7 నుంచి మే 27 వరకు ఐపీఎల్ 11 సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. డిఫెండింగ్ చాంపియన్ ముంబయి ఇండియన్స్ సొంత మైదానం వాంఖడేలో ఏప్రిల్ 6న ఆరంభ వేడుకలు ఉంటాయి. తర్వాతి రోజు, ఏప్రిల్ 7న లీగ్ తొలి మ్యాచ్ ఉండనున్నది. ఐపీఎల్ టైటిల్ పోరు సైతం వాంఖడే వేదికగానే జరుగనున్నది. పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు. కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తన గ్రూప్ మ్యాచుల్లో నాల్గింటిని మొహాలీలో మరో మూడు మ్యాచులను ఇండోర్‌లో ఆడనున్నది. నిషేధం ముగించుకుని రీ ఎంట్రీ ఇస్తోన్న రాజస్థాన్ రాయల్స్ సొంత మైదానంపై కోర్టు తీర్పు వెలువడిన తర్వాత నిర్ణయించనున్నారు. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌పై కోర్టు తీర్పు అనుకూలంగా ఉంటే జైపూర్‌లో లేదంటే పుణెలో రాయల్స్ సొంత గడ్డ మ్యాచులను ఆడనున్నది. గవర్నింగ్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలను చైర్మెన్ రాజీవ్ శుక్లా వెల్లడించారు. ఈ సీజన్ కోసం ఆటగాళ్ల వేలం జనవరి 27, 28న బెంగళూర్‌లో నిర్వహించనున్నారు.

మ్యాచ్ వేళల్లో మార్పులు

ఐపీఎల్ 11వ సీజన్‌లో మరో ప్రధాన మార్పు చోటుచేసుకున్నది. గత పది సీజన్లుగా సాయంత్రం మ్యాచులను 4 గంటలకు, రాత్రి మ్యాచులను 8 గంటలకు నిర్వహిస్తున్నారు. కానీ రాత్రి 8 గంటల మ్యాచ్ కారణంగా ముగిసేసరికి అర్ధరాత్రి దాటుతోంది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచుల్లో పరిస్థితి మరింత తీవ్రం. దీంతో ప్రసారదారు విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్ మ్యాచ్ వేళల్లో మార్పులకు అంగీకారం తెలిపింది. దీంతో సాయంత్రం జరగాల్సిన మ్యాచులు 5.30 గంటలకు, రాత్రి మ్యాచులు ఓ గంట ముందుగా 7కు ఆరంభం కానున్నాయి. స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో పలు చానెళ్లు అందుబాటులో ఉండటంతో వారాంతంలో ఒకే సమయంలో జరిగే రెండు మ్యాచులను ప్రసారం చేసేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండబోదు. ఈ మేరకు స్టార్‌స్పోర్ట్స్ యాజమాన్యం నుంచి ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కు హామీ లభించింది.

శాస్త్రి సపోర్టు

- రహానె తుది జట్టులో లేకపోవటం జట్టు నిర్ణయం
- విదేశాల్లో పిచ్‌లు, పరిస్థితులు తుది జట్టును నిర్దేశిస్తాయి
- టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలు



జోహనెస్‌బర్గ్ : ఊహించనట్టుగానే టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి కెప్టెన్ కోహ్లి నిర్ణయానికి బాసటగా నిలిచాడు. దక్షిణాఫ్రికాలో తొలి రెండు టెస్టుల్లో అజింక్య రహానెను పక్కనపెట్టడం సరైన నిర్ణయమే అని, దీనిపై పెద్దగా ఆలోచన అవసరం లేదని తేల్చిపారేశాడు. బుధవారం నుంచి మూడో టెస్టు ఆరంభం కానున్న నేపథ్యంలో ఇక్కడ వాండరర్స్‌లో కోహ్లిసేన రెండో రోజు కఠోర సాధన చేసింది. సెంచూరియన్ ఓటమి తర్వాత మూడు రోజులు విశ్రాంతి తీసుకున్న టీమ్ ఇండియా.. ఆదివారం నుంచి ప్రాక్టీస్ మొదలెట్టింది. ప్రాక్టీస్ సెషన్లో రహానె ప్రాధాన్యత, కెప్టెన్ కోహ్లితో సంభాషణలు చూస్తుంటే ఆఖరి మ్యాచ్‌లో అజింక్యకు అవకాశం లభించటం లాంఛనమే అని అనిపించింది. కానీ కోచ్ శాస్త్రి వ్యాఖ్యలు అజింక్య స్థానంపై మళ్లీ నీలినీడలు అలుముకునేలా చేశాయి. సోమవారం ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా శాస్త్రి మీడియా ముందుకొచ్చాడు. 'ఒకవేళ అజింక్య రహానె తొలి టెస్టులో ఆడి విఫలమైతే.. ఇప్పుడు అడుగుతున్న వారే మళ్లీ రోహిత్‌ను ఎందుకు ఆడించలేదని ప్రశ్నిస్తారు. రోహిత్ ఆడాడు, సరైన ప్రదర్శన చేయలేదు. అందుకే మీరు అజింక్య రహానె ఎందుకు ఆడలేదని అడుగుతున్నారు' అని తనదైన శైలిలో శాస్త్రి చెప్పుకొచ్చాడు. ఇదే తర్కం.. బౌలింగ్ విభాగానికి వర్తిస్తుంది. మన దగ్గర వనరులు ఉన్నప్పుడు.. అత్యుత్తమ కూర్పు కోసం మేనేజ్‌మెంట్ చర్చిస్తుంది. ఫలితం ఏదైనా దానికి కట్టుబడుతుందని అన్నాడు. ప్రత్యేకించి విదేశీ టెస్టుల్లో పిచ్ స్వభావం, పరిస్థితులతో పాటు ప్రస్తుత ఫామ్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఒక విధంగా తుది జట్టు కూర్పును ఈ అంశాలు ప్రభావితం చేస్తాయి. పరిస్థితులను వీలైనంత వేగంగా అర్థం చేసుకునే ఆటగాడి వైపు చూడాల్సి ఉంటుంది. వేటు వేయటం, మార్పు చేయటం విదేశాల్లో సులువు, కానీ భారత్‌లో అలా కాదు. పరిస్థితులు మనకు తెలుసు కాబట్టి తుది జట్టు కూర్పుపై తర్జనభర్జనలు అక్కర్లేదు. కానీ విదేశాల్లో బౌన్స్ రాబట్టే బౌలర్ ఎవరూ? స్వింగ్ చేసే పేసర్ ఎవరు అనే సమీకరణాలు వచ్చాక కథ వేరుగా ఉంటుందని శాస్త్రి తెలిపాడు. విశ్లేషకుల పని వారి చేస్తున్నారు, వారి అభిప్రాయాలు మాపై ప్రభావం చూపలేవని పరోక్షంగా సెహ్వాగ్‌ను ఉద్దేశించి రవిశాస్త్రి అన్నాడు. సెంచూరియన్‌లో కోహ్లి విఫలమైతే స్వతహాగా తుది జట్టు నుంచి వైదొలగాలని వీరూ విమర్శించిన సంగతి తెలిసిందే. ఇక తొలి రెండు టెస్టుల్లో టీమ్ ఇండియా గెలిచే అవకాశాలు సృష్టించున్నది. కానీ వాటిని సరిగా సద్వినియోగం చేసుకోలేదు. సిరీస్ కోల్పోయినా టీమ్ ఇండియా వరల్డ్ నెం.1 జట్టే. భారత్‌లో విదేశీ జట్లు ఇంత కంటే దారుణంగా పరాజయం చవిచూశాయి. కానీ మేము ఇక్కడ గెలిచే స్థితిలో నిలబడ్డాం. వాండరర్స్‌లోనూ గెలువగలమే నమ్మకంతోనే బరిలోకి దిగుతున్నామని రవిశాస్త్రి చెప్పాడు.



- 59 బంతుల్లో 126
- బెంగాల్‌పై యూపీ ఘన విజయం

రైనా ధనాధన్

కోల్‌కత : ఐపీఎల్‌కు ముందు పొట్టి ఫార్మాట్ హీరో సురేశ్ రైనా జూలు విదిల్చాడు. జాతీయ జట్టులో చోటు, ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైనా సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో దుమ్ముదులిపాడు. బెంగాల్‌తో సూపర్ లీగ్ మ్యాచ్‌లో అజేయ శతకం బాదాడు. 59 బంతుల్లో 13 ఫోర్లు, ఏడు సిక్సర్లతో విరుచుకుపడిన సురేశ్ రైనా అజేయంగా 126 పరుగులు నమోదు చేశాడు. రైనాకు తోడు అక్షదీప్ నాథ్ (80, 43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులు) మెరవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ మూడు వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (4/26) మాయతో ఛేదనలో బెంగాల్ 160 పరుగులకే కుప్పకూలింది. బెంగాల్ తరఫున ఓపెనర్ గోస్వామి (57), చటర్జీ (36)లు మాత్రమే ఫర్వాలేదనిపించారు. స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో బరోడా (140/8)పై ఢిల్లీ (143/8) గెలుపొందగా, ఉత్కంఠ మ్యాచ్‌లో పంజాబ్ (199/7) మూడు వికెట్ల తేడాతో ముంబయి (198/4)పై విజయం సాధించింది.



ఇండోనేషియా బరిలో.. సింధు, సైనా, శ్రీకాంత్

జకర్తా : రికార్డు టైటిళ్లతో గతేడాదిని ఘనంగా ముగించిన భారత అగ్రశ్రేణి షట్లర్లు పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లు కొత్త ఏడాదిని ఇండోనేషియా మాస్టర్స్‌తో ఆరంభించబోతున్నారు. పీబీఎల్‌లో ఆకట్టుకునే ప్రదర్శనలు చేసిన ఇండోనేషియాతో ప్రా సీజన్‌ను సానుకూలంగా ఆరంభించేందుకు సిద్ధమవుతున్నారు. మంగళవారం నుంచి ఇండోనేషియా మాస్టర్స్ మొదలు కానున్నది. లోకల్ షట్లర్ హనా రమదినితో సింధు, జుల్పద్లి (మలేషియా)తో శ్రీకాంత్ తొలి రౌండ్‌లో పోటీపడనున్నారు. మరోవైపు సైనా నెహ్వాల్‌కు తొలి రౌండ్‌లోనే వర్ధమాన సంచలనం చెన్ యుఫెయ్ (చైనా)తో ఎదుర్కొనున్నది. హెచ్.ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్‌లు శుభారంభం చేయాలిని భావిస్తున్నారు. డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయి ప్రదర్శనపై ఆసక్తి నెలకొన్నది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.